
# జనబలం

ప్రజలే ప్రభువులు

ఏప్రిల్ 2024 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-






## BJP, TDP, జనసేన కూటమి

## NDA కి లోక్‌సత్తా మద్దతు-ఎజెండా అంశాలు

## ఎలక్టోరల్ బాండ్స్ తీర్పు : సంచలనమా? సంస్కరణా?

## అంబేద్కర్ రాజకీయ సమానత్వం

## ఎన్నికల సమయంలో సోషల్ మీడియా

## జమిలి ఎన్నికలపై కోవింద్ కమిటీ నివేదిక





# యువత ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందించుకోవాలి

విద్యార్థులు సామాజిక సేవ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ముందుండాలని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించి సాధికారత సాధించేలా ప్రోత్సహించే 'వాటీజ్ మై గోల్' (నా లక్ష్యం ఏమిటి) సంస్థ ఆధ్వర్యంలో అండర్ 18 అసెంబ్లీ సభ్యులకు (విద్యార్థి ఎమ్మెల్యేలు) రాయదుర్గం టీ హబ్‌లో నిర్వహించిన తొలి దశ శిక్షణా కార్యక్రమంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 60 పాఠశాలలకు చెందిన విద్యార్థి ఎమ్మెల్యేలకు శిక్షణ నిర్వహించారు. మొత్తం 105 పాఠశాలల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎమ్మెల్యేలున్నారు. 1.4 లక్షల మంది విద్యార్థులకు (ఓటర్లు) వారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వాటీజ్ మైగోల్ అండర్ 18 చీఫ్ ఎలక్షన్ కమిషనర్ చిత్రాలి శర్మ, సంస్థ ప్రతినిధి కార్తికేయ వంకినేని మాట్లాడారు. ఎన్నికల్లో మూడు పార్టీల్లో ఒక పార్టీకి చెందిన వర్ధన్ అనే విద్యార్థి ముఖ్యమంత్రిగా ఎన్నికవగా, అగస్త్య, కింగ్, మిత్ర, మాన్వి, శశ్రిక, భవ్య, శ్రీధన్, షఫియ, సన్ని, వర్షిత్ బృందం కార్యక్రమాలను పర్యవేక్షించింది.



# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ఏప్రిల్
2024

సంపుటి 25
సంచిక 04


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


**సంపాదకవర్గం**

బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

**వర్కింగ్ ఎడిటర్**

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## లోపలి పేజీలలో..


➥ ఎలక్టొరల్ బాండ్లపై తీర్పు .. సంచలనమా? సంస్కరణా? — 5

➥ సరైన తీర్పు - కానీ 25 ఏళ్లు ఆలస్యం — 8

➥ BJP, TDP, జనసేన కూటమి NDAకి లోక్‌సత్తా మద్దతు - ఎజెండా అంశాలు — 9


➥ అంబేద్కర్ - రాజకీయ సమానత్వం — 17

➥ అంబేద్కర్ - ఆర్టికల్ 293, కేరళ సర్కార్ వర్సెస్ యూనియన్ ప్రభుత్వం — 20

➥ వానొస్తే వరదలు.. ఎండొస్తే మంచినీటి కరవు, హైదరాబాద్ సైతం మేలుకోవాలి — 25

➥ జేపీ రైతు విధానాలపై హేతుబద్ధంగా ఆలోచించండి — 29


### కార్టూన్ కార్నర్




పిచ్చివాడిలా ఉన్నావే! నల్లధనాన్ని తెల్లగా మార్చాలంటే ఏదైనా పార్టీలో చేరు.. లేకపోతే బాండ్లు కొను.. అంతేగాని ఇదేంటి?!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఉపాధి రంగంలో మోగుతున్న ప్రమాద ఘంటికలు!

ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణం ద్వారా ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థికశక్తిగా ఆవిర్భవించాలని మన ప్రభుత్వం గట్టిగా సంకల్పించింది."వికసిత భారత్" త్వరలో "విశ్వగురు" కానున్నదన్న ప్రధానమంత్రి మోదీ ఇస్తున్న గ్యారంటీ నిరంతరం మన చెవుల్లో గింగురుమని వినిపిస్తూనే ఉంది. మన సుస్థిరాభివృద్ధి గురించిన కథనాలు సామాజిక మాధ్యమాల్లో ప్రతిరోజూ వ్యాప్తిలోకి వస్తూనే ఉన్నాయి.

ప్రస్తుత వాతావరణం ఒక రంగు రంగుల స్వప్నాన్ని మనముందు ఆవిష్కరిస్తున్నది. నిజానికి అలాంటి స్వప్నం సాకారం కావాలని సగటు భారతీయులంతా గట్టిగా కోరుకుంటున్నారు. అందుకు తగిన అవకాశాలు మనకు లేకపోలేదు. సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే అపారమైన మానవవనరుల మనకున్నాయి. ఇరవై తొమ్మిదేళ్ళ మధ్యగత వయసుతో ఉన్న మన యువ జనాభా అగ్ర రాజ్యాలతో పోలిస్తే మన దేశానికి ఎంతో సానుకూలతను చేకూరుస్తున్నది.

రానున్న దశాబ్దాలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషించడానికి అవసరమైన గొప్ప శ్రామికశక్తి మనకు ఉంది. అయితే ముందుగా అధిగమించాల్సిన సవాలక్ష అవరోధాలు ఉన్నాయన్న స్పృహ మాత్రం మన సమష్టి వివేకంలో లోపిస్తున్నది. నిజానికి ఉపాధి కల్పనా రంగంలో సంభవిస్తున్న పరిణామాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఉద్యోగాల సృష్టి, ఉపాధి కల్పన, విద్య, నైపుణ్యాలు, శ్రామికశక్తిలో మహిళల స్థానం, శ్రామికుల నిజవేతనాలు వంటి అంశాలు మన సుస్థిరాభివృద్ధి విజయగాథను సందేహాస్పదం చేస్తున్నాయి.

మన ఆర్థికవ్యవస్థలో శ్రామికశక్తి భాగస్వామ్యపు రేటు, జనాభా శ్రామికుల నిష్పత్తి, దీర్ఘకాలికంగా దిగజారుతూ వస్తున్నాయి.నిరుద్యోగం పరిస్థితి మున్నెన్నడూ లేనంత ఆందోళనకరంగా తయారయ్యింది. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా "ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ -2024,విద్య , ఉపాధికల్పన, నైపుణ్యాలు" పేరుతో రూపొందించిన నివేదికను మార్చ్ 26న భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ విడుదల చేశారు.

ఉద్యోగాలు, ఉపాధిరంగంలో మనదేశం ఎదుర్కొంటున్న పలు సవాళ్ళను నివేదిక మన ముందుకు తెచ్చింది. "భారత్ వెలిగిపోతోంది" నినాదంతో పాలించిన అటల్ బిహారీ వాజపేయి కాలం నుండి (2000) "వికసిత భారత్" నినాదంతో పాలిస్తున్న నరేంద్రమోదీ హయాం (2022) వరకూ ఇరవై రెండేళ్ల వ్యవధిలో ఉపాధి రంగంలోని వివిధ ధోరణులను నివేదిక వెల్లడించింది.

దేశంలో నిరుద్యోగులుగా ఉన్న మొత్తం శ్రమజీవుల్లో యువత సంఖ్య 83 శాతంగా ఉండటం పెద్ద ప్రమాదాన్ని సూచిస్తున్నది. నిరుద్యోగ శ్రామికశక్తిలో సెకండరీ లేదా అంతకంటే ఎక్కువ చదివిన ఉన్నత విద్యావంతుల సంఖ్య 2000 వ సంవత్సరంలో 35.2 శాతం ఉండగా 2022 నాటికి వీరి సంఖ్య 65.7 శాతానికి చేరుకున్నది. విద్యాధిక యువత శ్రామిక శక్తిలో భాగం కాకపోవడం సైతం ఆందోళనకర పరిణామమే.

స్వయం ఉపాధి రంగంలో ఉపాధి పొందుతున్న శ్రామికుల సంఖ్య 2000 లో 52.5 శాతం ఉండగా 2012 నాటికి 52.2 శాతంగా ఉంది. 2019 నాటికి 52 శాతంగా ఉన్న వీరి సంఖ్య కోవిడ్ అనంతరం 2022 నాటికి అకస్మాత్తుగా 55.8 శాతానికి పెరిగింది. రెగ్యులర్ ఉద్యోగాలలో ఉన్నవారి సంఖ్య 2000లో 14.2 శాతం ఉండగా 2022 నాటికి వీరి సంఖ్య 21.5 శాతంగా పెరిగింది. క్యాజువల్ ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 2000 లో 33.3 శాతం ఉండగా 2022 నాటికి వీరి సంఖ్య 22.7 శాతానికి పడిపోయింది.

దాదాపు రెండు దశాబ్దాల పాటు 52 శాతం దగ్గర స్థిరంగా నిలిచిన స్వయం ఉపాధిరంగం కోవిడ్ తర్వాత 55.8 శాతానికి పెరిగిందంటే అందులోకి వచ్చి చేరినవారు ఎవరన్నది లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. మనకు వ్యవసాయ రంగంలో ఉపాధి పొందుతున్న శ్రామికులు 2000 లో 62 శాతంగా ఉన్నారు. 2012 నాటికి వీరి సంఖ్య 40 శాతానికి, 2019 నాటికి 42 శాతానికి తగ్గింది. కోవిడ్ అనంతరం 2022 నాటికి 45 శాతానికి పెరిగింది.

ఇక పారిశ్రామిక, వస్తూఉత్పత్తి, నిర్మాణం, రంగాల్లో నిమగ్నమైన శ్రామికులు 2000 లో 16 శాతం కాగా, 2012 లో వీరి సంఖ్య 24 శాతానికి, 2019 లో 36 శాతానికి పెరుగుతూ వచ్చింది. కోవిడ్ అనంతరం 2022 లో 25 శాతానికి పడిపోయింది. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, ఐటి, టూరిజం, సేవలు, వంటి రంగాల్లో ఉద్యోగాలు పొందినవారు 2000

లో 23 శాతం కాగా 2012 నాటికి వీరి సంఖ్య 27 శాతానికి, 2019 నాటికి 35 శాతానికి పెరిగింది. కోవిడ్ అనంతరం 2022 నాటికి వీరి సంఖ్య 32 శాతానికి పడింది.

జిడిపిలో వ్యవసాయ రంగం వాటా 2000 లో 27 శాతం ఉండగా 2019 కి 15 శాతానికి చేరుకున్నది. కోవిడ్ అనంతరం 2022 నాటికి 16 శాతానికి కొద్దిగా పెరిగింది. పారిశ్రామిక రంగం వాటా 2000 లో 29 శాతం ఉండగా 2022 నాటికి 31 శాతానికి పెరిగింది. సర్వీసు రంగం వాటా 2000 లో 44 శాతం ఉండగా 2022 లో 53 శాతానికి పెరిగింది. గణాంకాలన్నీ మన బహుళ దొంతర్ల ఆర్థికవ్యవస్థ పునాదిలో సంభవిస్తున్న సర్దుబాట్లను, ఎగుడు దిగుళ్ళను వెల్లడిస్తున్నాయి. భూగర్భం లోతుల్లో జరిగే ప్రకంపనాలు స్వల్పంగా కనిపించినా అవి పెను భూకంపాలను సృష్టిస్తాయి.
కోవిడ్ అనంతరం వ్యవసాయ రంగంలో, స్వయం ఉపాధి రంగంలో కనిపిస్తున్న శ్రామికశక్తి పెరుగుదల రేటును ఎలా అర్థం చేసుకోవాలి?ఉద్యోగాల సృష్టిలో, ఉపాధి కల్పనలో కనిపిస్తున్న ఒక ప్రతికూల ధోరణిగా మనం నిర్ధారించుకోవచ్చు. రెగ్యులర్ ఉద్యోగాలలో అవసరమైనంత వృద్ధి కనిపించడంలేదనీ, ఉపాధి కల్పనకు కూడా కోత పడిందని నివేదిక స్పష్టం చేసింది.
జిడిపి లో క్రమేపీ వాటా తగ్గిపోతున్న రంగాల్లోకి శ్రామికులు వెనక్కి మరలి రావడం అంటే పారిశ్రామిక, వస్తూత్పత్తి రంగాల్లో ఉపాధి అవకాశాలు తగ్గాయని అర్థం చేసుకోవచ్చు. ప్రాథమిక రంగంలో పనిచేసే శ్రామికుల ఆదాయాలు క్రమేపీ పడిపోతున్నాయని వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

అలాగే దేశంలో అసంఘటిత రంగంలో పనిచేసే శ్రామికుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. రెగ్యులర్ రంగంలో పనిచేసే శ్రామికుల సంఖ్య 2018 తర్వాత పడిపోవడం కూడా కనిపిస్తున్నది. శ్రామికశక్తిలో అత్యధిక సంఖ్యలో ఉన్న విద్యాధిక యువతకు ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలు లేవని నివేదిక తేల్చి చెప్పింది. మనదేశంలో నూట పది కోట్లమంది మొబైళ్లను వినియోగిస్తున్నారు. అందులో నలభై కోట్లమంది స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నారు. అయితే నిరుద్యోగ యువతలో 75 శాతం అటాచ్ మెంట్ తో కూడిన ఒక ఈ మెయిల్ ను పంపలేక పోతున్నారు. 60 శాతం మంది కాపీ పేస్ట్ చేయలేరు. 90 శాతం మంది ఒక గణిత ఫార్ములాను స్ప్రెడ్ షీట్ లో చూపలేని స్థితిలో ఉన్నారు.

పెరుగుతున్న అక్షరాస్యత, చదువు, సాంకేతికత మన యువతకు నైపుణ్యాలను ఇవ్వలేకపోతున్నాయి. కోవిడ్ అనంతరం 2022 లో చదువులో గానీ, శిక్షణలో గానీ, ఉద్యోగంలో గానీ లేకుండా ఉన్న యువత సంఖ్య కూడా 28.5 శాతంగా ఉండటం కలవరం కలిగిస్తోంది. ఉన్నత చదువులు చదివిన యువత ఖాళీగా ఉంటున్నారే తప్ప, తక్కువ ఆదాయాలు ఇచ్చే ఉద్యోగాల్లో చేరడానికి సుముఖత చూపడం లేదని నివేదిక వెల్లడించింది.

శ్రామిక మార్కెట్ లో ఆదాయాల, వేతనాల పరిస్థితి 2022 నాటికి దయనీయంగా ఉన్నదని నివేదిక స్పష్టం చేసింది. స్వయం ఉపాధి రంగంలో సగటు ఆదాయం పది వేల రూపాయలు ఉండగా, రెగ్యులర్ ఉద్యోగాలలో సగటు ఆదాయం 15,177 రూపాయలు ఉన్నది. ఇందులో మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉందని నివేదిక తేటతెల్లం చేసింది. స్వయం ఉపాధి రంగంలో మహిళల ఆదాయం నెలకు 4814 రూపాయలు కాగా, రెగ్యులర్ ఉద్యోగాలలో ఆదాయం నెలకు 10567 రూపాయలుగా ఉన్నది. ఆదాయాల్లోనూ, వేతనాల్లోనూ జెండర్ వ్యత్యాసాలు పెరిగాయని నివేదిక తెలిపింది.

ప్రభుత్వాలు రిజర్వేషన్ లాంటి రక్షణచర్యలు తీసుకుంటున్నా, ఎన్ని సాంఘిక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా వారి అవసరాల రీత్యా ఎస్సీ, ఎస్టీ కేటగిరి యువత పనిలో భాగస్వాములు అవుతున్నారు. కానీ వారు తక్కువ వేతనాలు ఇచ్చే తాత్కాలిక, క్యాజువల్ ఉద్యోగాలలో, అసంఘటిత రంగంలో మాత్రమే మిగిలిపోయారు. ఎస్సీ, ఎస్టీ యువత ఎక్కువమంది ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నా వారి సామాజిక హోదాలో పెద్దగా మార్పు రాలేదు. నిచ్చెనమెట్ల వ్యవస్థలో వారు అట్టడుగున ఉంటున్నారని నివేదిక గుర్తించింది. మొత్తంమీద దేశంలో నిరుద్యోగం పెరగడం, అసంఘటిత రంగం పెరగడం, వలస కార్మికుల సంఖ్య కూడా పెరుగుతూ ఉండటం, జెండర్ వివక్ష, సామాజిక వ్యత్యాసాలు కొనసాగడం మన ఆర్థిక వ్యవస్థలోని తీవ్ర లోపాలను వెల్లడిస్తున్నాయి.

వాటిని పరిష్కారం చేయకుండా "వికసిత భారత్" సాధ్యం కాదు. అంతర్జాతీయ కార్మిక సంస్థకు గణాంకాలు ఇచ్చింది ప్రభుత్వమే కాబట్టి సమస్యలకు తగిన పరిష్కారాలు చూడాల్సిన బాధ్యత కూడా మన పాలకులపై ఉంది. నిరంతరం ఎన్నికల ప్రచారహోరుతో జోరుగా తిరుగుతున్న మన నేతలకు నిరుద్యోగ యువత వేదనలు వినిపిస్తాయా ?!

డి. సోము సుందర్

# ఎలక్టోరల్ బాండ్లపై తీర్పు..
# సంచలనమా? సంస్కరణా?

**2018 ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగవిరుద్ధం అని సుప్రీంకోర్టు ప్రకటించటం డబ్బు రాజకీయాలపై మనం దృష్టి కేంద్రీకరించేందుకు ఓ అవకాశం. న్యాయస్థానం తీర్పుపై ప్రస్తుత చర్చంతా, ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఏ పార్టీకి ఎంత డబ్బు అందుకుంది అన్న అంశం చుట్టూనే ఎక్కువగా తిరుగుతోంది. రాజకీయంలో విపరీత పోటీ ఉన్న మన దేశంలో ఈ ధోరణిని అర్థం చేసుకోవచ్చు. కానీ భారత రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యాన్ని, పర్యవసానాల్ని అర్థం చేసుకోవాలంటే మనకు మరింత లోతైన పరిశీలన అవసరం. అప్పుడు మాత్రమే మన ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరచటానికి అవసరమైన రాజకీయ సంస్కరణల కోసం ప్రజాభిప్రాయాన్ని నిర్మించగలం.**

**డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**




ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యంలో చట్టబద్ధ రాజకీయ కార్యకలాపాలకు డబ్బు అవసరం. కానీ, లోపభూయిష్ట ప్రజాస్వామ్యంలో ఓట్ల కొనుగోలు సహా అక్రమ వ్యవహారాల కోసం లెక్కలుచూపని డబ్బు కూడా భారీ మొత్తాల్లో అవసరమవుతుంది. తమ ఓటుకి, తమ జీవితాల్ని ప్రభావితం చేసే పర్యవసానాలకి మధ్య సంబంధాన్ని ఓటర్లు స్పష్టంగా అర్థం చేసుకోలేనప్పుడు, వారు చెల్లించే పన్నుల డబ్బుకి, వారికి అందుతున్న సేవలకు మధ్య సంబంధం చాలామేర తెగిపోయినప్పుడు, ప్రజాస్వామ్యం ఓటింగ్, నిరసనలకే పరిమితమవుతుంది.

కేంద్రీకృత పాలన సాగుతూ, కనీస సేవలు సక్రమంగా అందని ఒక పేద దేశంలో, ఓటు వేయటానికి డబ్బు, బహుమతులతో ఓటర్లను ప్రలోభ పెట్టటం తప్పనిసరి అయ్యింది. అటువంటి పందేరం వల్ల ఓటు పడుతుందని గ్యారంటీ లేదు, కానీ ఆ రకంగా పంచితేనే ఆ అభ్యర్థి గానీ, పార్టీ గానీ ఓటర్ల దృష్టిలో అధికారం కోసం బలమైన, నిజమైన పోటీదారు. దీంతో పోటీ మొత్తం డబ్బు పంచే ప్రధాన పార్టీల మధ్యకే పరిమితమవుతోంది. అటువంటి చట్టవిరుద్ధ, లెక్కచూపని ఖర్చు దేశంలోని చాలా ప్రాంతాల్లో ఇప్పుడు అసాధారణ స్థాయిలకు చేరింది. అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన అభ్యరులు రూ.25-30 కోట్లు ఖర్చు పెట్టటం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో సర్వసాధారణం. లోక్‌సభ నియోజకవర్గానికి ఆ వ్యయం అభ్యర్థికి రూ.100 కోట్లు దాకా ఉంది. ఈ చట్టవిరుద్ధ, లెక్కలు చూపని వ్యయం, ఎన్నికల్లో చట్టబద్ధ, లెక్కలు చూపే వ్యయం కంటే సుమారు పది రెట్లు ఎక్కువ. అయితే, ఎలక్టోరల్ బాండ్లపై, పార్టీలు లెక్కలు చెప్పే నిధులపై జరుగుతున్న చర్చలో ఈ నిజమైన, రాజకీయాల్లో దాచిపెడుతున్న ఖర్చు ప్రస్తావన లేదు. చట్టవిరుద్ధ, లెక్కలు చూపని ఆ భారీ వ్యయం రాజకీయ ఆర్థిక వ్యవస్థని, పాలనను అస్తవ్యస్తం చేస్తోంది. దాంతో పోలిస్తే, ఎలక్టోరల్ బాండ్లు, ఇతర మార్గాల ద్వారా పార్టీలు సేకరిస్తున్న లెక్కచూపే ఖర్చు నామమాత్రం.

లెక్కలు చూపే ఖర్చులో భాగంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, లేదా స్థానిక పార్టీ నాయకులు, సంస్థ చేస్తున్న వ్యయం రెండు రకాలుగా ఉంటుంది. పార్టీని సంస్థాగతంగా నడపటానికి అవసరమైన వ్యయం. ఇది స్పష్టంగా కనిపించే ఖర్చు. పార్టీలు రకరకాల కార్యక్రమాలు చేస్తుంటాయి. ప్రజాస్వామ్య రాజకీయాలకు ఇవి ఎంతో కీలకం. వీటన్నిటికీ డబ్బు కావాలి. ఇదంతా చట్టబద్ధమైన, లెక్కలు చూపే ఖర్చు. పార్టీలు చేసే రెండో పెద్ద వ్యయం చట్టబద్ధ ఎన్నికల ప్రచారాలకు సంబంధించినది. ఇంతకుముందు పేర్కొన్నట్లు, భారత్‌లో చట్టబద్ధ ప్రచార వ్యయం వాస్తవ వ్యయంలో ఎంతో స్వల్పం.

పార్టీని సంస్థాగతంగా నడపటం, ఎన్నికల ప్రచారాల్ని నిర్వహించటం – ఈ రెండు రకాల వ్యయాలూ చట్టబద్ధమైనవి. ప్రతి ప్రజాస్వామ్య సమాజంలో పార్టీలు అటువంటి ఖర్చు చేస్తాయి. పరిణతి చెందిన ప్రజాస్వామ్యాల్లో, పార్టీ నడపటానికయ్యే ఖర్చుని సాధారణంగా సభ్యత్వ రుసుములు భర్తీ చేస్తాయి. బ్రిటన్, జర్మనీ వంటి కొన్ని దేశాల్లో పార్టీలు తమకొచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి కొంత డబ్బు ప్రభుత్వం నుంచి




గ్రాంట్ రూపంలో అందుకుంటాయి. ప్రభుత్వం నుంచి సమకూరే అటువంటి నిధులు సంస్థాగతంగా పార్టీని నడపటానికి సరిపోతాయి. ఎన్నికల ప్రచారాలకు డబ్బును విరాళాల రూపంలో సేకరిస్తారు. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ప్రచారాల నిర్వహణ కోసం మాత్రమే ప్రధాన పార్టీలకు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకునే వెసులుబాటు ఉంది. కానీ అటువంటి నిధుల్ని రెండు షరతులకు లోబడి ఇస్తారు: విరాళాల్లో ఎక్కువ శాతాన్ని అభ్యర్థులు చిన్న మొత్తాల్లో సేకరించాలి, వాళ్లు తమ వ్యయాన్ని నిర్దేశిత పరిమితికి లోబడే చేయాలి. చాలామంది అధ్యక్ష అభ్యర్థులు ఇటీవలి కాలంలో ప్రభుత్వం నుంచి నిధులు కోరటం లేదు. ఎందుకంటే, వాళ్ల ప్రచారం వ్యయ పరిమితుల్ని దాటేస్తోంది.

భారత్‌లోని ఎలక్టొరల్ బాండ్ల పథకం వెనక ఒక చరిత్ర ఉంది. రాజకీయ కార్యక్రమాల కోసం నగదు విరాళాల్ని తీసుకుంటూ 2001లో ప్రధాన రాజకీయ నేతలు టేప్‌లో దొరికారు. దాంతో చెలరేగిన దుమారం అప్పటి బీజేపీ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ రాజీనామాకు దారితీసింది. రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది. న్యాయ విచారణ కమిషన్ (జస్టిస్ ఫుకాన్) ఆయన పేరును కేసు నుంచి తొలగించాకే తిరిగి కేబినెట్‌లోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్య పీఠం, లోక్‌సత్తా ఉద్యమం ఆ అవకాశాన్ని ఒక ప్రధాన రాజకీయ సంస్కరణకు అవకాశంగా ఉపయోగించుకుంది. రాజకీయ పార్టీలకు చట్టబద్ధంగా విరాళాలిచ్చే పద్ధతి ఉండాలని వాదించింది. రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలపై వ్యక్తులకు (పరిమితి లేదు), కార్పొరేట్లకు (మూడు సంవత్సరాల లాభాల సగటులో 5%) పన్ను మినహాయింపు ఇచ్చేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసేలా ప్రభుత్వ, ప్రతిపక్షంలోని ప్రధాన నాయకులందరినీ నేను ఒప్పించాను.

ప్రచారంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం పెరుగుదలను అంచనా వేసి ఎన్నికల సమయంలో ప్రభుత్వ, ప్రయివేటు ఛానళ్లలో ఉచిత ప్రచారావకాశం కల్పించాలని కూడా మేం వాదించాం. అన్ని పార్టీలూ ఈ ఆలోచనను అంగీకరించాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలు, ఇతర సంబంధిత చట్టాల సవరణ చట్టం, 2003 రూపొందటంలో అప్పటి న్యాయ శాఖా మంత్రి అరుణ్ జైట్లీ కీలక పాత్ర వహించారు. పార్లమెంటు ఆ చట్టాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. అప్పట్నుంచి చెక్కు ద్వారా మాత్రమే విరాళాలు తీసుకోవాలని బీజేపీ నిర్ణయించింది. కానీ పూర్తి పన్ను రాయితీ ఉన్నా కూడా ప్రత్యర్థి పార్టీలు ఎక్కడ వేధిస్తాయో, ప్రతీకారం తీర్చుకుంటాయోనన్న భయంతో దాతలు చెక్కు ద్వారా విరాళాలివ్వటానికి ముందుకు రాలేదు. తమ పార్టీ సంకట స్థితిని జైట్లీ స్వయంగా పలు సందర్భాల్లో నాకు వివరించి వాపోయారు. బహుశా ఈ అనుభవం నుంచే 2018లో ఎలక్టొరల్ బాండ్లను జైట్లీ ప్రవేశపెట్టి ఉండొచ్చు. ఈసారి ఆర్థికమంత్రిగా. చట్టబద్ధ కార్యక్రమాలకు లెక్కలు చూపే డబ్బును సేకరించటం, అదే సమయంలో ప్రత్యర్థి పార్టీల చేతిలో బాధితులు కాకుండా దాతల వివరాల్ని గోప్యంగా ఉంచటం బాండ్ల లక్ష్యంగా కనిపిస్తుంది. ఆ పథకం లోపభూయిష్టమైనది, అసమగ్రమైనది అనటంలో సందేహం లేదు. ఆశ్రిత పక్షపాతానికి, బలవంతపు వసూళ్లకి అవకాశం కల్పిస్తుంది. విషయం న్యాయవ్యవస్థ ముందుకెళ్లాక, వివరాల్ని పూర్తిగా వెల్లడించాలనటం, పారదర్శకత ఉండాలనటం తప్ప సుప్రీంకోర్టుకు మరో మార్గం లేదు.

అయితే, ఈ తీర్పుని వాస్తవ విజయం కన్నా, ప్రతీక విజయంగా భావించవచ్చు. ఎందుకంటే, దీనివల్ల సమస్య మరింత జటిలమయ్యే అవకాశముంది. చట్టబద్ధ రాజకీయ కలాపాలకు కూడా నగదు చెల్లింపులు పెరిగి విరాళాలు రహస్యంగా చేతులు మారవచ్చు. 2004, 2012 మధ్య ఎనిమిదేళ్లలో మొత్తం పార్టీల నిధుల్లో వివరాలు వెల్లడించినవి కేవలం 8.9%. పార్టీలు లెక్కలు చూపిన మిగిలిన 90%కి పైగా నిధులు గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల నుంచే వచ్చాయి! రాజకీయ విరాళాల ప్రక్రియలో పారదర్శకత ఉండాలనటంలో సందేహం లేదు.

కానీ పార్టీల చట్టబద్ధ వ్యయాలకిచ్చే విరాళాల్లో కూడా 90%కి పైగా నగదు ద్వారా వస్తుంటే, అది మన ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరచటానికి ఉపయోగపడదు. మన రాజకీయ ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పుకి మనం సుదీర్ఘ కృషి చేయాల్సి ఉంది. వ్యక్తుల, కార్పొరేట్ల వ్యాపారాల్లో, ఇతర ఆర్థిక కలాపాలలో రాజకీయ పక్షపాతాలు, అనూహ్య నిర్ణయాలకు ఆస్కారం లేనప్పుడు మాత్రమే రాజకీయ కార్యక్రమాలకు దాతలు బహిరంగంగా విరాళాలివ్వగలుగుతారు. పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలలో తమ రాజకీయ ప్రాధాన్యతలను కార్పొరేట్లు బాహాటంగా చెబుతారు, ప్రతీకార చర్యలుంటాయనే భయం లేకుండా పార్టీలు, అభ్యర్థులకు విరాళాలిస్తారు. అటువంటి చట్టబద్ధపాలన వాతావరణం మనకు అవసరం.


# సరైన తీర్పు - కానీ 25 ఏళ్లు ఆలస్యం

**డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

జేఎంఎం ముడుపుల కేసుపై 1998 నాటి దురదృష్టకర తీర్పును తోసిపుచ్చుతూ మార్చి 5న సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా ఇచ్చిన తీర్పు స్వాగతించాల్సినది. నిజానికి ఎప్పుడో జరగాల్సిన దిద్దుబాటది. 1998 తీర్పు అత్యంత లోపభూయిష్టమైనది. 105 (2), 194 (2) అధికరణాలకు కోర్టు ఆరోజు వక్రభాష్యం చెప్పింది. చట్టసభ సభ్యులు పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభలో ఓటు వేసే లేదా ప్రసంగించే సందర్భాల్లో లంచం తీసుకుంటే నేర విచారణ నుంచి వారికి మినహాయింపు ఉంటుందని ప్రకటించింది. తద్వారా చట్టసభలో తమ ఓటును లేదా ప్రసంగాన్ని ప్రభావితం చేయటానికి సభ్యులు లంచం తీసుకున్నా ఎటువంటి చట్టపరమైన చర్యలూ తీసుకోకుండా 1998 తీర్పు సంపూర్ణ రక్షణ కల్పించింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఉండాల్సిన రక్షణకు ఇది దిగ్భ్రాంతికర వ్యాఖ్యానం. ఆ తీర్పు తప్పని చెప్పటం ద్వారా కోర్టు ఇప్పుడు సరైన రీతిలో వ్యవహరించింది.

రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు, నియమితులైన అధికారులు అందరూ ప్రజాసేవకులే. అధికారంలో ఉన్నారు కాబట్టి వారి చర్యలకు పూర్తిస్థాయి రక్షణ అంటే ఆమోద యోగ్యం కాదు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చేసిన పనులన్నిటికీ సంపూర్ణ రక్షణ ఉండాలని డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు. అమెరికా సుప్రీంకోర్టు వచ్చే కొన్నివారాల్లో ఆ కేసును విచారిస్తుంది. ట్రంప్ కేసు తీర్పులో కొత్తగా చేసే నిర్ణయం ఏమీ లేదు: అధ్యక్షుడు దైవాంశసంభూత చక్రవర్తి కాదు, ఎల్లకాలం సంపూర్ణ రక్షణ లభించదు.

దీనర్థం, ప్రభుత్వాధికారులు, చట్టసభ సభ్యులకు ఎటువంటి రక్షణా వద్దనటం కాదు. విధి నిర్వహణలో భాగంగా చట్టబద్ధంగా తీసుకునే నిర్ణయాలు, చర్యలకు సంబంధించి వారిపై సివిల్, క్రిమినల్ కేసులు దాఖలు చేయాలనటం కాదు. సభలో స్వేచ్ఛగా అభిప్రాయాల్ని చెప్పటం, లేదా ప్రశ్న




అడగటం, ఓటు వేయటం సందర్భాల్లో అటువంటి రక్షణ చట్టసభ సభ్యులకి వర్తిస్తుంది. కానీ ఒక నిర్దేశిత రీతిలో ఓటు వేయటానికి, లేదా సభలో మాట్లాడటానికి, ఓ ప్రశ్న లేవనెత్తటానికి లంచాన్ని అంగీకరిస్తే, ఆ రకంగా లంచం తీసుకోవటానికి చట్టపరమైన చర్యల నుండి రక్షణ లభించదు. లంచం తీసుకోవటం ప్రజాసేవకుడి అధికారిక బాధ్యతల్లో భాగం కాదు. లంచం తీసుకునే వ్యక్తి ఏ స్థాయి ప్రజాసేవకుడైనా, అది నేరం. రాజ్యాధినేత వంటి బాధ్యతల్లో ఉన్న కొందరు ప్రజాసేవకులకు వాళ్ల పదవీ కాలంలో ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ ఉండవచ్చు,కానీ అధికారం నుంచి వైదొలిగాక ఆ రక్షణ కొనసాగదు.

చట్టబద్ధ చర్యలు లంచాలకు మాత్రమే కాకుండా, సభ్యుల ఇతర చట్టవిరుద్ధ చర్యలకు కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు, జో బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ధృవీకరించకుండా అమెరికా కాంగ్రెస్‌ను అడ్డుకునే ఉద్దేశంతో జనవరి 6, 2021న మూకలతో అరాచకత్వాన్ని రెచ్చగొట్టాడని, క్యాపిటల్‌పై దాడిని ప్రేరేపించాడని ట్రంప్‌పై ఆరోపణ. రాజ్యాంగబద్ధ వ్యవస్థను కూల్చటానికి నేరాన్ని ఎగదోసేందుకు బరితెగించాడు. అటువంటి చర్యలకు ప్రాసిక్యూషన్ నుంచి ఎటువంటి రక్షణా ఉండదు. అయితే, అధికారంలో ఉన్నప్పుడు తీసుకునే కొన్ని రకాల చర్యలకు భవిష్యత్తులో న్యాయ విచారణ నుంచి రక్షణ ఉండాలి. ఉదాహరణకు, తమ దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేసే తీవ్రవాదులను చంపేందుకు అమెరికా అధ్యక్షులు కొన్ని సందర్భాల్లో ఆదేశాలివ్వొచ్చు. అటువంటి కేసులకు సంబంధించి కీలక నాయకత్వ స్థానాల్లో ఉన్న కొద్దిమందికి మాత్రం సమాచారం తెలియచేస్తుంటారు.




అందుకు ఎప్పటినుంచో ఓ పద్ధతి ఉంది. అదేవిధంగా, తీవ్రవాద ముప్పును తొలగించటానికి కొందరు వ్యక్తులు లక్ష్యంగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక ఆపరేషన్లకు భారత్‌లో ప్రధానమంత్రి అనుమతి మంజూరు చేయాల్సి ఉండవచ్చు. అటువంటి అధికారం ప్రధాని ప్రమాణ స్వీకారంలో భాగమైన అధికారిక చర్యే అవుతుంది. కాబట్టి భవిష్యత్తులో క్రిమినల్ న్యాయ విచారణ చర్యల నుంచి పూర్తిస్థాయి రక్షణ ఉండాలి.

సుప్రీంకోర్టు నిర్ణయం ఏ రకంగానూ ప్రభుత్వాధికారుల, చట్టసభ సభ్యుల అధికారాన్ని బలహీన పరచదు; అవినీతి, అధికార దుర్వినియోగాలకు సంబంధించి జవాబుదారీ తనాన్ని పెంచుతుంది. లంచం తీసుకోవటానికి సంబం ధించి మాత్రమే ప్రాసిక్యూషన్ వర్తిస్తుంది, ఆ తర్వాత చట్టసభ సభ్యుడు ఎవరికి ఓటు వేశారన్నది ఆ పరిధిలోకి రాదు. ఈ మొత్తం సుదీర్ఘ పరిణామంలో ఒకే ఒక్క బాధాకర అంశం– న్యాయ వ్యవస్థ అలసత్వం. ప్రజాజీవితంలో నిజాయతీ, జవాబు దారీతనానికి సంబంధించిన ఒక కీలక అంశంపై ఇంగి తజ్ఞానానికి సైతం అర్థమయ్యే తప్పుడు తీర్పుని తిరగ రాయటానికి 25 ఏళ్లు పట్టటం న్యాయ వ్యవస్థకి గౌరవం కాదు. శిబూ సోరెన్ (జేఎంఎం ముడుపుల కేసులో ప్రధాన నిందితుడు) కోడలు సీతా సోరెన్ న్యాయ విచారణ నుంచి తనకు రక్షణ కోరిన సందర్భం నుంచే ఆ కేసు రావటం యాదృచ్ఛికం. 2012 రాజ్యసభ ఎన్నికల్లో ఒక ఎమ్మెల్యేగా జార్ఖండ్ అసెంబ్లీలో ఒక స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేయటానికి సీతా సోరెన్ లంచం తీసుకున్నారన్నది ఆరోపణ. చివరికి తన పార్టీ అభ్యర్థికే ఆమె ఓటు వేశారు; కానీ లంచం తీసుకున్నారనటానికి ఆధారాలుంటే, ఎవరికి ఓటు వేశారన్నది ప్రాసిక్యూషన్‌కి అసంగతం. సీతా సోరెన్‌కి వ్యతిరేకంగా క్రిమినల్ న్యాయ విచారణ చర్యలను రద్దు చేయటానికి జార్ఖండ్ హైకోర్టు తిరస్కరించటం సరైన చర్య. దీనిపై 2012లో ఆమె సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఏ రకమైన గందరగోళం లేని అటువంటి కీలక కేసుపై నిర్ణయం తీసుకోవటానికి సుప్రీంకోర్టుకి 11 ఏళ్లు పట్టింది! ఇద్దరు జడ్జీల బెంచ్ (2012) నుంచి ఆ కేసు నత్తనడకన ముగ్గురు జడ్జీల బెంచ్‌కి (2014) మారింది. చివరికి విస్తృత ధర్మాసనం ముందుకి (2019) వచ్చి, ఇప్పుడు 2024లో తేలింది. ఈ అసాధారణ జాప్యం చెబుతున్న పాఠం సుస్పష్టం: అత్యున్నత రాజ్యాంగ కోర్టు తనను తాను సమీక్షించుకోవాలి, మార్గాన్ని సరిదిద్దుకోవాలి. ఇటువంటి కేసులపై నిర్ణయం కొన్ని వారాల్లో చేయవచ్చు. రాజ్యాంగపరంగా తలెత్తే పర్యవసానాల దృష్ట్యా ఇలాంటి కేసులకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ముఖ్యమైన అంశాలను త్వరితంగా, సమర్థంగా న్యాయం అందిస్తూ పరిష్కరించేలా ఒక శాశ్వత రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుకి బహుశా సమయం ఆసన్నమైంది.

❖

# BJP, TDP, జనసేన కూటమి
# NDAకి లోక్‌సత్తా మద్దతు - ఎజెండా అంశాలు

**ఆంధ్రప్రదేశ్‌లో జరగబోతున్న ఎన్నికలు నిర్ణయాత్మకమైనవని, దేశానికే దిక్సూచి వంటివని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అందువల్ల మునుపెన్నడూలేని రీతిలో అసాధారణ నిర్ణయం తీసుకుని బీజేపీ, తెలుగుదేశం, జనసేన భాగస్వాములుగా ఉన్న ఎన్‌డీయే కూటమికి లోక్‌సత్తా మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. ఎన్‌డీయే కూటమి ద్వారా లోక్‌సత్తా సాధించాలనుకుంటున్న ఎజెండాను ఈ సందర్భంగా ఆయన విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సీనియర్ నేతలు డాక్టర్ పట్టాభి రామయ్య, వజీర్ తదితరులు పాల్గొన్నారు. జేపీ ప్రకటించిన అంశాల స్థూల వివరాలివి:**



ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే ఎన్నిక మా దృష్టిలో ఒక నిర్ణయాత్మకమైనది. ఒక defining election. మామూలుగా ఇదేదో జగన్మోహన్‌రెడ్డి గారు, చంద్రబాబునాయుడుగారి మధ్య జరుగుతున్న పోరాటంగా, వైకాపాకి, తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమికి మధ్య పోరాటంగా, మరీ ఇంకా చెత్తగా మాట్లాడుకుంటే, రెడ్లకి, కమ్మవాళ్లకి, కాపులకి మధ్య పోరాటంగా భావిస్తుంటారు. ఇది గదా మన రాష్ట్రంలో చర్చంతా. కానీ ఇది కాదు. ఒక పేద దేశంలో, ఇప్పటికి కూడా అక్షరజ్ఞానం సరిగా అందని దేశంలో ఒక జాతి దీర్ఘకాలిక ప్రయోజనాలు కాపాడాలి అంటే, మన పిల్లలకి మంచి భవిష్యత్తుని ఇవ్వాలీ అంటే, 'కేవలం సంక్షేమమే సరిపోతుంది, సంక్షేమమే పరిపాలన అన్న తీరుకి – సంక్షేమం అవసరం, సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా అవసరం, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించాలి అన్న తీరుకి' మధ్య పోరాటంలో మనం సరైన నిర్ణయం తీసుకోవాలి.

ఏపీలో కేవలం సంక్షేమం సరిపోతుందని ఒక పార్టీ భావిస్తోంది. మన దగ్గర పన్నుల డబ్బులు వసూలు చేసి, ఆ పైన అప్పులు తెచ్చి, సగం డబ్బు జీతభత్యాలకి, వడ్డీలకి, ఇతరత్రా ఖర్చు పెట్టి, మరికొంత డబ్బు దుబారాకి తగలేసి, మరికొంత శుభ్రంగా కైంకర్యం చేసి (ఎలక్షన్‌లో ఖర్చు పెడుతున్నాం కదా బోలెడంత) ఆ మిగిలింది చాలా సమర్థంగా పంపిణీ చేస్తే అదే పరిపాలన. ఇక అంతకంటే పరిపాలన లేదు అన్నది ఆ పార్టీ తీరు. ఈ సంక్షేమానికి, అభివృద్ధికి సమతూకం పాటించాలా, వద్దా? మనకు స్పష్టత కావాలి.

**సంక్షేమం ఎవరి సొంత సొమ్ముతో ఇవ్వటంలా..**
**ప్రజలు ఎవరికీ రుణపడి ఉండనవసరంలా**

సంక్షేమం అవసరం. పేద సమాజంలో సంక్షేమం తప్పకుండా అవసరం. సంక్షేమం ఎవరి సొంత డబ్బుతో ఇవ్వటంలా. ఈ ప్రజలు ఎవరికీ కృతజ్ఞులుగా ఉండాల్సిన అవసరం లేదు. ఇది ప్రజల డబ్బు. ఏ పార్టీ సంక్షేమ పథకాలు అమలు చేసినా, ఏదో వాళ్లు సొంతంగా ఇచ్చినట్లుగా ఫీలయిపోతున్నారు. వాళ్లకు రుణపడి ఉండాలనుకుంటున్నారు. ఎవరూ ఎవరికీ రుణపడి ఉండనవసరంలా. ఏమన్నా రుణపడి ఉండాల్సి వస్తే, ఈ ప్రజలకు ఎన్నికైనవాళ్లు రుణపడి ఉండాలిగానీ, ఎన్నికైన వాళ్లకి ప్రజలు రుణపడి ఉండరు. మన పన్నుల డబ్బులు, మన ఓటు!

సంక్షేమం అవసరం. కానీ సంక్షేమమే పరిపాలన అనుకుంటే, ఆ దేశం, రాష్ట్రం భవిష్యత్తు అధోగతే. ఎల్లకాలమూ సంక్షేమం అనుకున్నట్లయితే, ఎల్లకాలమూ ఈ దేశంలో పుట్టిన పాపానికి పుచ్చుకునే చేతులే అయినట్లయితే పేదరికం నిరంతరం కొనసాగుతుంటుంది.

**ఆ దారి జాతికి ప్రమాదకరం**

ఈ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలనూ నేను మనసు విప్పికోరుతున్నాను. ఒక్కసారి కళ్లు మూసుకుని ఆలోచించండి. 25 ఏళ్లపాటు ఈ సంక్షేమం సమర్థంగా అమలైనా సరే, మనింటికి డబ్బులొచ్చినా, ఉచితంగా బియ్యం వచ్చినా, ఉచితంగా మరోటి వచ్చినా కూడా 25 ఏళ్ల తర్వాత మా పిల్లల భవిష్యత్తు అద్భుతంగా ఉంటుంది, వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడగలరు, తలెత్తుకుని తిరగగలరు, సొంతంగా ఆదాయం సంపాదించుకోగలరు అనే పరిస్థితి ఉంటే సంతోషం. కానీ





ఎల్లకాలం పుచ్చుకునే చెయ్యి అయినట్లయితే, నిరంతరం పేదరికం కొనసాగుతుంటే మలాం పూస్తున్నాం ఆ పేదరికం నొప్పి తగ్గటం కోసం తప్ప, పేదరికం పోయే ఏర్పాటు జరగటంలా. కచ్చితంగా ఆ జాతికి అది చాలా ప్రమాదకరం.

**ఈ రెంటికీ మధ్య పోరాటం ఈవేళ**

కాబట్టి ఈవేళ ఆంధ్రప్రదేశ్‌లో జరిగే పోరాటం సంక్షేమమే పరిపాలన, సంక్షేమమే రాజకీయం అనే దారికి, సంక్షేమంతోపాటు అభివృద్ధి ఎంతో అవసరమనే దారికి మధ్య.

సంక్షేమం అంటే ఏమిటి? వ్యక్తిగతమైన, తాత్కాలిక ప్రయోజనాలు. వ్యక్తిగతం, తాత్కాలికం! అభివృద్ధి అంటే ఏమిటి – దీర్ఘకాలంగా సమాజం మొత్తంలో సంపద సృష్టిని పెంచటం, మౌలిక సదుపాయాలు కల్పించటం, ఉపాధి పెరిగేందుకు ఏర్పాట్లు చేయటం, పెట్టుబడుల్ని ప్రోత్సహించటం, పారిశ్రామికీకరణ చేయటం. ఆ రూపంలో వ్యక్తుల ఆదాయాలు సొంతంగా పెరిగి వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడటం. ఈ రెంటికీ మధ్య పోరాటం జరుగుతోంది ఈవేళ. ఈ రెంటికీ మధ్య సమతూకం అక్కర్లేదా? సమతూకం లేకుంటే ఇక భవిష్యత్తు ఎలా సాధ్యం?

**తెలుగునాట చర్చలో ప్రజల భవిష్యత్తు ప్రస్తావన పూర్తిగా కరువైపోయింది**

మన దురదృష్టం కొద్దీ తెలుగునాట చర్చలో ఎంతసేపటికీ కులం ప్రస్తావన తప్ప, మతాల ప్రస్తావన తప్ప, పార్టీలను కూడా మతాలుగా మార్చేసి, ఆ పార్టీల ప్రస్తావన తప్ప ప్రజల భవిష్యత్తు ప్రస్తావన పూర్తిగా కరువైపోయింది. నాకు చాలా బాధనిపిస్తోంది.

**మహామహుల్ని ఆదర్శంగా తీసుకున్న సమాజంలో ఈవేళ..**

నేను పెరిగింది ఈ ప్రాంతంలో మారుమూల గ్రామంలో. తెలుగు మీడియంలో చదువుకున్నాను. పంచాయతీ సమితి స్కూల్‌లో, జిల్లా పరిషత్ స్కూల్‌లో. ఈ ప్రాంతంలో ఆనాడు మేం పెరిగిన నాడు, ఎవరు మాకు ఆదర్శంగా కనిపించారు– ఒక గోపరాజు రామచంద్రరావు గారు (గోరా). కులాన్ని వ్యతిరేకించి కుల నిర్మూలన కోసం హేతుబద్ధమైన ఆలోచన కోసం జీవితాన్ని అంకితం చేసి ఉద్యమాన్ని నిర్మించిన వారు. ఒక త్రిపురనేని రామస్వామి గారు. సామాజిక న్యాయం కావాలి కులానికి అతీతంగా, మూఢనమ్మకాలు పోవాలి అని జీవితమంతా పోరాడినవారు. ఒక కట్టమంచి రామలింగారెడ్డిగారు. హేతుబద్ధమైన ఆలోచన, సామాజిక న్యాయం. దాని కోసం కులరహితంగా పోరాడినవారు. ఆంధ్ర యూనివర్సిటీకి పితామహుడు. ఒక తాపీ ధర్మారావు గారు. కులానికి, మతానికి అతీతంగా మూఢ నమ్మకాల్ని చీల్చి చెండాడినవాడు. కులాన్ని నిర్జించటం కోసం పోరాడినవాడు. ఒక గిడుగు రామ్మూర్తి పంతులు గారు. మన చరిత్రను, సంస్కృతి, సాహిత్యాన్ని మన దగ్గరకు తీసుకొచ్చినవాడు. సామాన్యులకు దగ్గరగా తీసుకొచ్చినవాడు. అలాంటి మహామహులు వాళ్ల వాళ్ల పుట్టిన నేపథ్యాన్ని త్యజించి, సమాజం కోసం అద్భుతమైన కృషి చేసి స్ఫూర్తిగా ఆనాడు నిలిస్తే ఈనాడు కులం తప్ప, అక్రమ సంపాదన తప్ప అర్హత లేనటువంటి మూర్ఖులు, అజ్ఞానులు, సమాజ వినాశకారులు ప్రభావితం చేస్తున్నారు సమాజాన్ని. ఏ కులమైనా, ఏ పార్టీ అయినా నాకనవసరం. ఈ కులం, ఈ పార్టీ తేడాలే లేవు. వీళ్లే అక్కడుంటారు, వీళ్లే ఇక్కడుంటారు.

**మాకెవరికీ కులం, మతం, ప్రాంతం లేవు**

నాకు తెలిసి నేను ఇవాళ ఏం మాట్లాడినా కూడా వెంటనే కులం వస్తుంది, మతం వస్తుంది, ప్రాంతం వస్తుంది, మరోటి వస్తుంది. ఇక్కడ మాకెవరికీ కులం లేదు, మతం లేదు, ప్రాంతం లేదు. ఈవేళ దేశం, రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో మన పిల్లల భవిష్యత్తును ఎలా కాపాడుకోవాలి? అన్నదే లక్ష్యం.

**రాజకీయం, ప్రజలిచ్చే తీర్పు కీలకం..**
**అందుకే ఆలోచించాల్సిన సమయం**

ఒక జాతి భవిష్యత్తు నిర్మాణం చేయటంలో చాలా అంశాలు కీలక పాత్ర వహిస్తాయి. ఒక సమాజం పాత్ర వహిస్తుంది, నమ్మిన విశ్వాసాలు పాత్ర వహిస్తాయి. కానీ రాజకీయం కీలక పాత్ర వహిస్తుంది, ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు కీలక పాత్ర వహిస్తుంది. ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారనేది ముఖ్యం. అందుకే ఇది కీలక సమయం. ఈ నేపథ్యంలో ఆలోచించాలి.

***సంక్షేమం అవసరం, సంక్షేమంతోపాటు అభివృద్ధి అవసరం.***

**అథమస్థాయికి చట్టబద్ధపాలన**

మరొకటి, తెలుగునాట జరుగుతోంది ఏమిటంటే, ఎవరు అధికారంలో ఉన్నా ఇవాళ కొత్తగా వచ్చింది కాదు, 30–40 ఏళ్ల నుంచి ఉంది. బడితె ఉన్నవాడిదే బర్రె అయిపోతోంది.

అధికారంలో ఎవరు ఉంటే, మీ మనిషి ఉంటే మీ అందరికీ రాచమార్గం. మీ ప్రత్యర్థి ఉంటే మీ అందరికీ ముళ్లబాట. ఇది ప్రజాస్వామ్యబద్ధం కాదు. అన్నీ పార్టీలూ తప్పు చేస్తున్నాయి. కానీ అది శ్రుతి మించి పోయింది ఇప్పుడు. దానికి కూడా ఒక హద్దుండాలి. ఎక్కడోక చోట పరిమితి ఉండాలి. ఒక భయానక వాతావరణం నెలకొంది.

**ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం వస్తుందా అని భయపడటం మొదటిసారిగా వింటున్నాను**

చాలామందికి అసలు రాష్ట్రంలో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం వస్తుందా అనటం మొట్టమొదటిసారిగా నేను వింటున్నాను. నాకూ కాస్తోకూస్తో ఎన్నికల అనుభవం ఉంది. ఎన్నికల్లో గానీ, ప్రజాజీవితంలోగానీ ఒక పౌరుడిగాగానీ, దేశ చరిత్రలో ఎప్పుడూ కూడా ఒక పెద్ద రాష్ట్రంలో అసలు ఎన్నికలు సజావుగా జరుగుతాయా, స్వేచ్ఛగా ప్రజలు ఓటేసే అవకాశం ఉంటుందా లేదా అన్న సందేహం ఇప్పటిదాకా కలగలా. కొన్ని చిన్నచిన్నవి జరిగి ఉండొచ్చు. ఈశాన్య భారతంలో కొన్ని సందర్భాల్లో. జమ్మూ కాశ్మీర్‌లో కొన్ని సందర్భాల్లో జరిగుండొచ్చు. కానీ విస్తృతమైన ఈ విశాల భారతదేశంలో ఏనాడూ ఇలాంటి పెద్ద రాష్ట్రాల్లో కలగలా. మొట్టమొదటిసారిగా ఆ సందేహం కూడా వచ్చింది. అంటే ఏమిటి, చట్టబద్ధపాలన మరీ అధమస్థాయికి దిగజారిపోయింది. ఇంతకుముందు అంతా బాగుందని నేనటంలా. దేశంలో కూడా బాగోలేదు. దాన్లో కూడా ఒక గీత దాటిపోయింది. ఈ నేపథ్యంలో ప్రజలు నిర్ణయం చేసుకోవాలి.

**లోక్‌సత్తా దేని కోసం నిలబడుతుంది?**

మరి లోక్‌సత్తా దేని కోసం నిలబడుతుంది? ఇందాకే చెప్పాను. ప్రజలు ఎవరికీ రుణపడి ఉండాల్సిన అవసరం లేదు. ప్రతి పైసా ప్రభుత్వం నుంచి ఖర్చయ్యేది, ప్రభుత్వం నుంచి మనకొచ్చేది, మన డబ్బు, మన హక్కు. మనం పన్నుల రూపంలో ఇచ్చింది లేదా మన పిల్లల భవిష్యత్తును తాకట్టుపెట్టి అప్పుగా తెచ్చినది. రేపొద్దున చెల్లించేది మనం, వాళ్లెవరూ కాదు. ఎవ్వడి డబ్బులూ ఎవడికీ దానం ఇవ్వటంలా. ఏ పార్టీ, ఏ నాయకుడూ జాతీయ స్థాయిలో, రాష్ట్రంలో చెప్పుకున్నా, నేనిస్తున్నాను అన్నా కూడా అది ప్రజాస్వామ్యంలో బాధాకరం. దాన్ని గర్హించాలి, వ్యతిరేకించాలి, కాలక్రమేణా వాళ్లకు బుద్ధి చెప్పాలి. కానీ మనం కృతజ్ఞతతో, వాళ్లెవరో నాకు చేస్తున్నారు, రుణపడుతున్నాను అనేది ప్రజాస్వామ్యంలో చాలా ప్రమాదకరమైన భావం, బానిస భావం అది. దానికి అతీతంగా ఓటు వేయాలి. లోక్‌సత్తా నిర్ద్వంద్వంగా చెప్తోంది.

ఈ ప్రజాస్వామ్యంలో ఉన్న లోపాల్ని లోక్‌సత్తా ఎండగట్టినట్లుగా గత 30 ఏళ్లుగా ఎవరూ ఎండగట్టలా. పరిష్కారం కోసం మేం చేసిన కృషి ఇంకెవరూ చేయలా. ఫలితాలు కూడా ఇంకెవరూ సాధించనన్ని ఫలితాల్ని సాధించాం. కానీ ఇవి చాలవు ఈ దేశానికి. ఆ మాటలు చాలా నిజాయతీగా చెబుతున్నాం, వినమ్రంగా చెబుతున్నాం. చెట్లు లేని చోట ఆముదం చెట్టే మహావృక్షం కాబట్టి మేం సాధించినవి గొప్పగా అనిపిస్తాయి. ఇటీవల ఎలక్టొరల్ బాండ్స్ గురించి బోలెడంత చర్చ జరిగింది. అసలు దానికి మూలం పార్టీలకు విరాళాలిచ్చే దాతలకి నూటికి నూరుపాళ్లూ పన్ను రాయితీలు కల్పించటం. దాని కోసం పోరాడి సాధించింది లోక్‌సత్తా. లేకపోతే నేరస్తుల వివరాలు బయటపడటం, అభ్యర్థుల వివరాలు బయటపడటంపై బోలెడు చర్చ జరుగుతోంది. దానికి మూలం ఈ రాష్ట్రంలో లోక్‌సత్తా మీ అందరి సహకారంతో ప్రారంభించింది. 1999 ఎన్నికల్లో. మీరు ఈ దేశంలో ఏ మౌలికమైన విషయమైనా 20 ఏళ్ల తర్వాత చూడండి, ఏ చర్చలోనైనా, ఆ మూలం లోక్‌సత్తా చేసిన కృషిలో ఉంటుంది. పాలనా సమాచార హక్కు లోక్‌సత్తా పోరాడి సాధించింది. ఆ డ్రాఫ్టింగ్‌లో ప్రతి పదం, ప్రతి కామా నేను కూర్చుని సోదరి అరుణారాయ్‌తో కలిసి తయారు చేశాను. ఇంకా ఎన్నో రంగాలు. సాధించాం కానీ, సాధించాల్సింది చాలా ఎక్కువ ఉంది. అవన్నీ ఇవాళ ఒక్కరోజులో సాధించలేం. నిజంగా ఈదేశంలో ఈ మార్పులన్నీ కొన్నేళ్లలో వస్తాయని ఆశపడ్డవాడ్ని నేను. అనుభవం నేర్పిన పాఠం ఏమిటంటే, సమాజం మారాలంటే ఓపిక కావాలి, సహనం కావాలి. మహాత్మాగాంధీ చెప్పారు A reformer must have infinite patience. సమాజంలో సంస్కరణలు కోరేవాడికి అపారమైన ఓర్పు ఉండాలి. కానీ ఈలోగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి, ప్రజల భవిష్యత్తును కాపాడాలి. అంటే ఆర్థిక భవిష్యత్తు ఒక్కటే మన ముందున్న మార్గం.

**గత అయిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ అవకాశాన్ని పోగొట్టుకుంది।**

ఈ దేశానికి మంచి జరిగే అవకాశం ఏమన్నా రాజకీయం నుంచి పరిపాలన నుంచి ఉంది అంటే, చాలా తప్పులు జరిగినా పరిపాలనలో వివిధ పార్టీల వల్ల, గత 30 ఏళ్లూ కొన్నయినా మంచి చేయటం చేత, కొన్ని విధానాలను రూపొందించటం చేత, కొన్ని విజయాలను సాధించటం చేత వచ్చే 25-30 ఏళ్ల పాటు ఆర్థిక ప్రగతికి బాటలు పడుతున్నాయి. పునాదులు వేస్తున్నారు. గత అయిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవకాశాన్ని పోగొట్టుకున్నది. కీలకమైన సమయంలో. తీరప్రాంతంలో ఉన్న రాష్ట్రం, లక్షలాది మంది విద్యాధికులు, వృత్తినైపుణ్యం ఉన్నవారున్న రాష్ట్రం, దేశం నలుమూలలా, ప్రపంచం నలుమూలలా కూడా వారి ప్రభావాన్ని చూపెట్టి తలెత్తుకుని గర్వంగా నిలబడ్డ రాష్ట్రం, అత్యాధునిక భావాలకి, కొత్త పుంతలకి పేరెన్నిగన్న రాష్ట్రం గత అయిదేళ్లుగా నిద్రాణమైపోయింది ఆర్థికాభివృద్ధి విషయంలో. పెట్టుబడులు మందగించిపోయాయి. రిస్క్ తీసుకునే సామర్థ్యం ఉన్నా కూడా ఈ పరిస్థితుల్లో పెట్టుబడులు పెట్టం, పెడితే ప్రమాదం బారినపడతామనే భయానికి లోనవుతున్నారు. మౌలిక సదుపాయాలు పూర్తిగా పోయినాయి. ఎందుకంటే, సంక్షేమం తప్ప ఇంక ప్రభుత్వం చేయాల్సిన పనులు మర్చిపోయాం మనం. అసలు ప్రభుత్వాన్ని ఎందుకు పెట్టుకున్నాం అనే సంగతి మర్చిపోయాం. సంక్షేమం ఇచ్చాం గదా, ఇంకెందుకు మాట్లాడుతున్నాం, ఇంకేం అక్కర్లేదు,

సంక్షేమమే! అయితే దోపిడీ, లేకపోతే సంక్షేమం. అది పరిపాలన కాజాలదు. ఈ నేపథ్యంలో వచ్చే 25 ఏళ్లూ అభివృద్ధికి అవకాశం దేశంలో కనిపిస్తున్నప్పుడు దాన్ని అందుకోవలసిన బాధ్యత ఉన్నది.

**ఒడిశా, యూపీ ముందుకెళ్తుంటే ఏపీకి ఏమొచ్చింది।** మనలాంటి రాష్ట్రాలు వెనకబడితే ఒక పోటీతత్వమున్న ఫెడరల్ వ్యవస్థలో ఇతర రాష్ట్రాలు ముందుకు పోతున్నాయి. మన పక్కనే ఉంది ఉత్తరాంధ్ర దగ్గర. ఒడిశా ఒక పేద రాష్ట్రం. మనతో పోలిస్తే ఒడిశాకి స్వతంత్రానంతర భారతంలో అంత చరిత్ర లేదు. ఆదాయాలుగానీ, విద్యగానీ, సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యంగానీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌గానీ, నైపుణ్యంగానీ లేవు. మీకో విషయం తెలుసా– ఒడిశాకి ఇవాళ ఏడాదికి రూ.26,000 కోట్ల రెవెన్యూ మిగులు ఉంది. అంటే వాళ్లకొచ్చే పన్నుల ఆదాయం తీసుకుంటే, రోజువారీ ఖర్చులు, జీతభత్యాలు, వడ్డీలు, అన్ని రకాల సంక్షేమ పథకాలు కలిసి– ఆ ఖర్చు పోగా రూ.26,000 కోట్లు మిగులు కనిపిస్తోంది. ఆపైన వాళ్లు అప్పులు తీసుకొచ్చి, వాళ్లకు అర్హత ఉన్నమేరకు క్రమశిక్షణ పాటించి ఆర్థికంగా చాలా బలంగా ఉన్న రాష్ట్రంగా ఒడిశాను తీర్చిదిద్దుకున్నారు. మంచి అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. రాజకీయంగా కూడా ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆర్భాటం లేదు, ప్రచారం లేదు, హడావుడి లేదు. నవీన్ పట్నాయక్ గారు నాకు బంధువు కాదు, ఆయన్ను ఇంతవరకు కలవలా అసలు. బంధువు కాబట్టి నేను చెప్పటంలా. కానీ, అది సాధ్యం. ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పొదుపరితనం ప్రభుత్వ ధనంతో, ప్రజాధనంతో రాష్ట్ర భవిష్యత్తుని కాపాడటం, ప్రజల మన్ననల్ని అదే సమయంలో పొందటం సాధ్యం. సాధ్యం కాదన్నది అసమర్థులు, అవినీతిపరులు చెప్పేమాట.

ఒడిశా ముందుకెళ్తుంటే మనం నోట్లో వేలేసుకుని చూస్తున్నాం ఈవేళ. ఒడిశా ముందుకు పోవాల. అందుకు మనం గర్వపడాలి. అది ఈ దేశంలో భాగం. కానీ మనమెందుకు పోవటం లేదు? 1000 కిలోమీటర్ల తీరప్రాంతముండి, ఇంత గొప్ప చరిత్ర ఉండి.

ఉత్తరప్రదేశ్. దేశంలో తలసరి ఆదాయంలో సగం ఉంది యూపీ. అంతే. జనాభారీత్యా ప్రపంచంలో వేరే దేశమైతే అయిదో దేశమవుతుంది మన దేశంతో కూడా కలిపి. కులాలు, హింస, పీడన, దుష్పరిపాలన, అవ్యవస్థ రాజ్యమేలినటువంటి రాష్ట్రం. ఈవేళ ఉత్తరప్రదేశ్ రెవెన్యూ మిగులు, అంటే వాళ్లకొచ్చే పన్నుల ఆదాయం, వాళ్లు పెట్టే రోజువారీ ఖర్చు, సంక్షేమంతో కలిపి, జీతభత్యాలు, వడ్డీలు కలిపి, ఇవిపోగా రూ.74,000 కోట్ల మిగులు చూపెడుతున్నారు. ప్రజల ఆదరణ తక్కువైందా? ప్రజల ముందు అపారమైన ఆదరణ పొందుతున్నారు. రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తున్నారు, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నారు. ప్రజల ఆదరణ పొందుతున్నారు. మరి ఆంధ్రప్రదేశ్‌కి ఏమొచ్చింది? ఎందుకు జరగకూడదు మనకి? ఎందుకు వాళ్లందరినీ చూసి మనం ఆశ్చర్యపోవాలి? కాబట్టి కనీసం ఇప్పటికైనా ఈ నష్టాన్ని పూడ్చుకోవాలి. పూడ్చుకోవాలంటే ఈవేళున్న పరిస్థితుల్లో మనకు వేరే గత్యంతరం లేదు. ఆర్థికాభివృద్ధిని పెంచటమొక్కటే మార్గం.

**దేవతలు, రాక్షసుల మధ్య పోరాటం కాదు।** ఈవేళ దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ రాజకీయ పోరాటం దేవతలు, రాక్షసుల మధ్య కాదు. అందరూ అధికార కేంద్రీకరణ చేస్తున్నారు, అందరూ డబ్బులు పంచిపెడుతున్నారు. విజయవాడవాసులకు డబ్బుల పంపిణీ గురించి నేను చెప్పనక్కర్లేదు గదా! ఈ పార్టీ, ఆ పార్టీ తేడా లేదు. అందరివల్లా పొరపాట్లు జరుగుతున్నాయి. కానీ ఒకే ఒక్క మౌలికమైన తేడా.

**అందుకే ఎన్‌డీయే కూటమికి మద్దతు।** మిగతావన్నీ కాలక్రమేణా మారేందుకు సిద్ధపడ్డా కూడా, ఆర్థిక భవిష్యత్తును కాపాడేటువంటి రాజకీయ శక్తులేమిటి? పొదుపరితనాన్ని పాటించి ప్రజలకు అత్యంత మేలు చేసేవాళ్లెవరు? మన కాళ్ల మీద మనల్ని నిలబెట్టేవాళ్లెవరు? పెట్టుబడులు పెంచే వాళ్లెవరు? పారిశ్రామికీకరణ జరపబోయే వాళ్లెవరు? ఆ రకంగా చూస్తే ఇవాళున్న పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీ మోదీ గారి నాయకత్వంలో, ఎన్‌డీయే కూటమి భాగస్వాములు, అలాగే చంద్రబాబు నాయుడిగారి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ, అలాగే జనసేన, సోదరుడు పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో. ఈ మూడు పార్టీలూ కూడా ఒకపక్కన సంక్షేమం అందరు సామాన్యులకి అందించటం, దాంతో తృప్తి పడకుండా దీర్ఘకాల భవిష్యత్తుని కాపాడాలి, ఆర్థికాభివృద్ధిని పెంచాలి, పెట్టుబడులు పెంచాలి, మౌలిక సదుపాయాలు కావాలి, కొంతైనా చట్టబద్ధపాలన తీసుకురావాలి. పూర్తిగా బడితె ఉన్నవాడిదే బర్రె, సింహాసనం మీద కూర్చున్నవాడు ఏం చేసినా చెల్లుతుంది అన్న పద్ధతి పోవాలి అన్నదానికి కట్టుబడి ఉన్నాయి. వారి ఆలోచనను ఆహ్వానిస్తున్నాం, వారికి మద్దతు ప్రకటిస్తున్నాం. ఈ కారణాలుగా రాష్ట్రంలో అందరినీ కోరుతున్నాం.

**ఒక పార్టీ వస్తే ఒక కులం బాగుపడుతుందన్నది భ్రమ।** ఒక పార్టీ వస్తే ఒక కులం బాగుపడుతుందన్నది చాలా పొరపాటు వాదన. మనలో సాంప్రదాయంగా ఉన్నటువంటి ఆలోచనల్ని అవకాశంగా తీసుకుని, ఈ బలహీనతల్ని ఆసరాగా చేసి, అన్నీ కప్పెట్టేసి, ఈ పార్టీ వస్తే ఈ కులం బాగుపడుతుంది అనే భ్రమను కల్పిస్తున్నారు. ఏ పార్టీ వస్తే ఏ కులమూ బాగుపడదు. నేను కచ్చితంగా బస్తీ మే సవాల్ చేస్తున్నాను. ఏ పార్టీ వచ్చినా ఏ కులమూ పూర్తిగా బాగుపడదు. ఆ కులంలో కొందరికి, కొందరు బడా కాంట్రాక్టర్లకో, కొందరు అధికారులకో, మరికొందరికో అధికారంలో ఉన్నవాళ్లతో కొంత చనువు ఉండొచ్చు, లాభనష్టాలు వాళ్లకుండొచ్చు. కానీ సామాన్య ప్రజల జీవితాల్లో కావలసింది, ఎలాంటి పరిపాలన సాగుతోంది? ఆర్థిక ప్రగతి ఉందా, లేదా? కొంతమేరకైనా చట్టబద్ధపాలన ఉందా, లేదా? లేకపోతే పూర్తిగా బడితె ఉన్నవాడిదే బర్రె, గూండారాజ్యమైపోయిందా? ఆ పిల్లల భవిష్యత్తు బాగుంటుందా, లేదా? వాళ్లు వాళ్ల కాళ్ల మీద నిలబడగలుగుతారా, లేదా?

ఈవేళ మనం కష్టపడ్డా కూడా ఈ పేదరికం నుంచి బయటపడగలమా, లేదా? దాన్నుంచి ప్రజలు ఎదగటం ఉంటుందిగానీ కులాన్ని బట్టి ఉండదు. ఏ కులమైనా కూడా. ఫలానా కులం వాడు ఎమ్మెల్యే అయితే, ఫలానా కులంవాడు, ఫలానా పార్టీవాడు అధికారంలోకి వస్తే నా కులం బాగుపడుతుందనేది చాలా పొరపాటు ఆలోచన. కానీ ప్రజల్లో ఉన్న అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఈ కులాల పేరుతో మనం ఈ సమాజాన్ని వంచిస్తున్నాం. అన్ని పార్టీలనీ వినమ్రంగా కోరుతున్నాం. మళ్లీ ఇంకోసారి పెద్దల పేర్లను గుర్తుచేస్తున్నాను. ఒక గోరా గానీ, ఒక త్రిపురనేని రామస్వామి గానీ, ఒక కట్టమంచి రామలింగారెడ్డి గానీ, ఒక తాపీ ధర్మారావు గానీ, గిడుగు రామ్మూర్తి పంతులు గానీ, మరొకరు గానీ, వీళ్లంతా ఎలాంటి ఉదాత్తమైన ఆశయాలతో తెలుగు గడ్డ నుంచి వచ్చారు? ఎలాంటి వారసత్వం మనకున్నది? దాన్ని మర్చిపోయి సమాజాన్ని కులాలుగా విభజించి, ముక్కలు చేసి, వర్గాలుగా విభజించి ద్వేషాన్ని పెంచుతున్నారు. ఇంకో రకమైన రాజకీయం సాధ్యం కాక, నేర్పరితనంలేక, నాయకత్వంలేక సమాజానికి తీవ్ర హాని చేస్తున్నారు. నిజమైన నాయకత్వముంటే ఇలా చేయరు. కుహనా నాయకత్వాలు ఇవన్నీ కూడా. నిజమైన నాయకత్వం కాదు. దీంతో కులాన్నే సమీకరణకు వాడుతున్నాం.

**ఖర్మకొద్దీ ఈ దేశంలో పుట్టిన ప్రతివాడికీ కులం, మతం।**

నేను మళ్లీ చెబుతున్నా. ఈవేళ రేపొద్దున పత్రికల్లో, సోషల్ మీడియాలో రకరకాల దుమారాలు వస్తాయి, జేపీ గారు ఫలానా కులం, ఫలానా మతం అని. మన ఖర్మ కొద్దీ ఈ దేశంలో పుట్టిన ప్రతి వాడికీ ఒక కులం ఉంటుంది, ఒక మతం ఉంటుంది. కానీ మనందరం చూడవలసింది ఒక మనిషి చరిత్రని. మహాత్మాగాంధీని వైశ్యుడని, అంబేద్కర్‌ని దళితుడు అంటే, మనల్ని మనం అవమానం చేసుకుంటున్నాం. పుట్టుక మన చేతుల్లో లేదు, బతుకు మన చేతుల్లో ఉంది. పుట్టుకే బతుకుని శాసిస్తే ఇక ఆ జాతికి అర్థం లేదు. ఈ రాజ్యాంగానికి విలువ లేదు. మనం చూడాల్సింది ఒక మనిషి మాట్లాడినప్పుడు ఎలాంటి జీవితం, ఎలాంటి విశ్వసనీయత, ఆలోచనకి, మాటలకి, చేతలకి మధ్య ఏ మేరకు అంతరం ఉన్నది? అవి చూడాలి తప్ప, నువ్వు ఏ ఊళ్లో పుట్టావు? ఏ కులంలో పుట్టావు? అని కాదు. తెలంగాణలో నేను నివసిస్తున్నాను కాబట్టి కొన్ని సందర్భాల్లో కటువైన మాటలు చెబితే ఆయన ఆంధ్ర ప్రాంతంలో పుట్టాడు, ఆయనకు ఎందుకు ఇవన్నీ అవసరం? అంటుంటారు. మళ్లీ వాళ్లు మంచి పనిచేసినప్పుడు మీరు చేసేది మంచి పని అంటే, జేపీ గారు కూడా ఈ మాట అన్నారు అంటారు. అదే మనుషులు. మన నోటికి అర్థంపర్థం లేదు. నేను చాలా పచ్చిగా చెబుతున్నాను. ఎందుకంటే, పచ్చిగా చెప్పకపోతే అర్థం కాదు. చాలా ఫ్రాంక్‌గా చెబుతున్నాను. ఈ మాటలు అందరి మనసుల్లో ఉన్నాయి. ఎవడోకరు చెప్పాలి కదా. ఇజము తెలిసినవాడు నిజము చెప్పనినాడు ప్రజలకు జరుగును కీడు. ప్రతివారూ పైపైన సన్నాయి నొక్కి పైపైన మాట్లాడితే సమాజం చాలా నష్టపోతుంది. తెలుగునాడు చాలా నష్టపోయింది.

**విజయవాడలో ఆనాడే హెచ్చరించాను।** తొమ్మిదేళ్ల క్రితం విజయవాడ నగరంలో, ఇక్కడే చెప్పాను. మీరు కులాల కురుక్షేత్రంగా ఈ రాష్ట్రాన్ని మారుస్తున్నారని. అప్పుడు మరో పార్టీ ఈ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఈ పార్టీ, ఆ పార్టీ అనవసరం నాకు. బహిరంగంగానే చెప్పాను. విజయవాడ ప్రజల సమక్షంలో. కాబట్టి దీనిలో ఈ కులము, ఆ వర్గము లేదు. సమాజంలో కొంతమందైనా కులాన్ని, మతాన్ని, ప్రాంతాన్ని అధిగమించినవాళ్లు ఉన్నారు. ఉన్నారు కాబట్టే సమాజం బతుకుతోంది. ఆ కోణంలో నుంచి. మూర్ఖంగా చూసి, వాస్తవాల్ని పక్కన పెట్టారు. అన్ని వర్గాల ప్రజల్నీ కోరుతున్నాను. మీ గురించి, మీ కుటుంబాన్ని గురించి ఆలోచించండి. మీ కులం మీకు కూడు పెట్టదు. మీ కుటుంబం కావాలి, మీ పిల్లల భవిష్యత్తు కావాలి. మీ ఆదాయాలు కావాలి, మీకు అవకాశాలు కావాలి.

**నిర్భయంగా ఓటు వేయండని చెపాల్సిన వస్తుందనుకోలా**

ఇంకొక్కమాట చివరికొచ్చే ముందు. నిర్భయంగా ఓటు వేయండి, నచ్చిన పార్టీకి ఓటు వేయండి, కానీ నిర్భయంగా ఓటు వేయండి. ఈ మాట చెప్పాల్సిన అవసరం ఉంటుందని నేననుకోలా. ఎన్నికలు నిర్వహించినవాడ్ని నేను. అసెంబ్లీ స్థాయిలో కావచ్చు, పార్లమెంట్ స్థాయిలో కావచ్చు, అలాగే ఇతర రాష్ట్రాల్లో పరిశీలనలు కావచ్చు, దేశమంతా ఎన్నికలు చూసినవాడ్ని. ఎన్నికల్లో పాల్గొన్నవాడ్ని, పోటీచేసిన వాడ్ని, ప్రపంచంలో ఎన్నికల్ని పరిశీలించినవాడ్ని చాలా దేశాల్లో. నా దేశంలో, నేను పుట్టి పెరిగిన రాష్ట్రంలో నిర్భయంగా ఓటు వేయండి, భయం లేదు అని చెప్పాల్సి వస్తుందని నేను అనుకోలా ఇన్నేళ్ల తర్వాత. నిస్సంకోచంగా ఓటు వేయండి. విధిగా ఓటు వేయండి. ఇంట్లో కూర్చోకండి. ఇంట్లో కూర్చోవటం ప్రజాస్వామ్యానికి హాని చేస్తుంది. నేను చెప్పిన మాటలు ఇష్టం లేకపోతే వేరేవాళ్లకి వేయండి, మీ ఇష్టం. కానీ ఓటు వేయండి, భయం లేకుండా ఓటు వేయండి.

**అలాంటి మూర్ఖులు ఉంటే బుద్ధి చెప్పండి**

మన దేశంలో ఎన్ని పొరపాట్లున్నా కూడా, జాతీయ స్థాయిలో, రాష్ట్రంలో ఎన్నికలు, ఉప ఎన్నికలు రకరకాల విన్యాసాలు జరుగుతున్నాయి. మనందరికీ తెలుసు ఏం జరుగుతోందో. కానీ ఒకసారి రాష్ట్రం మొత్తంలో, జాతీయ స్థాయిలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఇప్పటిదాకా మన అనుభవం ఏమిటంటే, ఎన్ని పొరపాట్లున్నా కూడా మన యంత్రాంగం గానీ, ఎన్నికల సంఘం గానీ, ఎన్నికల సంఘం అంటే వేరే ఎక్కడో లేదు. పరిపాలనా యంత్రాంగమంతా ఆనాటికి ఎన్నికల సంఘం కింద పనిచేస్తుంది. వేరే సందర్భాల్లో ఎన్ని పొరపాట్లున్నా కూడా, మన పరిపాలనా యంత్రాంగం పక్షపాతాలకి అతీతంగా సమర్థంగా పనిచేసే చరిత్ర ఉంది మనకి. ఈవీఎంలలో ఏవైనా ఉంటాయి.. ఇవన్నీ కూడా పూర్తిగా అసత్యపు మాటలు. ఇదే ఈవీఎంలతో ఎన్నో పార్టీలు గెలిచాయి, ఎన్నో పార్టీలు ఓడిపోయాయి.

ఓడినవారు ఓడినప్పుడు ఈవీఎంల మీద దండయాత్ర చేశారు, మళ్లీ అదే ఈవీఎంలతో తర్వాత గెలిచినప్పుడు ఎవ్వరూ మాట్లాడలా. కాబట్టి ఇవన్నీ పిచ్చి మాటలు. నేను చెప్పినంత గట్టిగా ఈ దేశంలో లోపాల్ని గురించి ఎవరూ మాట్లాడలా. కానీ లోపాలు న్నప్పటికీ కూడా బలమైన, సజీవమైన ప్రజాస్వామ్యం. దాన్లో నాకు ఏమాత్రం సందేహం లేదు. కానీ ప్రజాస్వామ్యం లేదు, ఎన్నికల్లో ఫలితాల్ని నేను గుర్తించను అన్న పరిస్థితి వస్తే సమా జం చాలా ప్రమాదంలో పడుతుంది. అలాంటి మూర్ఖులు ఎవ రైనా ఉంటే, ఏ పార్టీవాడైనా బుద్ధి చెప్పండి, నోరు మూయించం డి. ఎందుకంటే సమాజం మొత్తానికీ వాళ్ల వ్యక్తిగత కాంక్షతో, అధికార లాలసతో, స్వార్థంతో తీవ్రమైన హాని తలపెడుతున్నారు. మరి ఎజెండా ఏమిటి?

**ఎన్‌డీఏను లోక్‌సత్తా అడుగుతున్న ఎజెండా ఏమిటి?**

**అభివృద్ధి।** కచ్చితంగా అభివృద్ధి కావాలి, పెట్టుబడులు కావాలి. సంక్షేమం, అభివృద్ధి సమతూకం కావాలి. ఆర్థిక క్రమశిక్షణ కావాలి. కానీ మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు ప్రత్యేకంగా, దానితోపాటు అనుబంధంగా ఆలోచించాలి.

**లోక్‌సత్తా నివేదిక పూర్తిగా అమలు చేయాలి।** ఒకటి, ఆంధ్రప్రదేశ్‌కి చాలా హామీలిస్తే కొన్ని జరిగినాయి, కొన్ని జరగలేదు. మధ్యలో అడ్డుపడింది. ఒకళ్ల మీద ఒకళ్లు ఆరోపణలు చేసుకుని ఎన్నికల అస్త్రంగా వాడుకున్నారుగానీ, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు సమర్థమైన ప్రయత్నం జరగలేదు. ఆ నేపథ్యంలో విభజన అనివార్యమైనప్పుడు ఏపీకి ఏం కావాలి? అని ఒక సమగ్రమైన నివేదికను ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా రూపొందించాయి. ఇది కేవలం తెలుగువాళ్లు కాకుండా దేశ స్థాయిలో తెలుగేతరులు, నిపుణులైనవాళ్లు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా పనిచేసిన వై.కె అలఘ్, సుప్రసిద్ధ ఆర్థికవేత్త, ప్రణాళికా మంత్రిగా పనిచేశారు జాతీయస్థాయిలో, అలాగే ప్రణాళికా సంఘం సభ్యులుగా పనిచేసినవాళ్లు ఇతర రాష్ట్రాలవాళ్లు, జాతీయ స్థాయిలో ఆర్థికవేత్తలు, సరే, మన రెండు రాష్ట్రాల్లో అనుభవం ఉన్నటువంటి పరిపాలనాదక్షులు, ఆర్థికవేత్తలు. వీరంతా నిష్పాక్షికంగా తయారుచేసిన నివేదిక. దీని ప్రాతిపదికన 2014-15 సంవత్సరానికి ఎంత మనకు బాకీ రావాలని ప్రామాణికంగా అంచనా వేశాం. నేను ఆనాడు అంచనా వేసింది మాకు రూ.10,493 కోట్లు రావాలని. కొద్ది నెలల క్రితం వచ్చింది. ఎంతొచ్చిందో తెలుసా, రూ.10,461 కోట్లు వచ్చింది. బస్తీ మే సవాల్. కాదంటే, మీరు చూసి చెప్పండి. 2019లో ఈ నివేదిక విడుదల చేశాం. దీనికి లోక్‌సత్తా కట్టుబడి ఉంది. ఇది సాధించాలి. అందునా ఈవేళ ప్రధానమంత్రి నాయకత్వం వహించే పార్టీ కూటమిలో భాగస్వామి కాబట్టి రేపొద్దున విజయం సాధిస్తే, ఇల్లలకగానే పండుగ కాదు. ఇది సాధించాలి.

**పోలవరం।** పోలవరం ప్రాజెక్టు ఉంది ఉదాహరణకి. నాలుగు రాష్ట్రాలకి పనికొచ్చే ప్రాజెక్టు. ఆ ప్రాజెక్టు వస్తే, గోదావరి నుంచి మనకి గ్రావిటీతో నీళ్లు వచ్చేస్తే, పట్టిసీమ ఎత్తిపోతలు అవసరం లేకుండా నిల్వ ఉంచుకునే అవకాశం వస్తే, ఈ కృష్ణా జలాల్ని ఎగువన పుష్కలంగా వాడుకోవచ్చు. రాయలసీమ, కోస్తాంధ్రల్లో నీళ్లు అవసరమైన ప్రాంతాలకు వాడుకోవచ్చు. అటు తెలంగాణకి లాభం, కర్ణాటకకి లాభం, మహారాష్ట్రకి లాభం. పనులు శరవేగంగా జరిగాయి, ప్రభుత్వం మారాక ఏమీ జరగకుండా ఆగిపోయింది. ఎంత విచిత్రం ఇది, ఎంత ఆత్మహత్యాసదృశం.

**మౌలిక సదుపాయాలు।** అలాగే ఇతర మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు ఎంత ఆగిపోయినాయి! రోడ్లు ఎంత నిస్సారంగా అయిపోయినాయి ఏ చోట చూసినా కూడా. 2024లో ఉన్నామా, లేకపోతే 1994లో ఉన్నామా అర్థంకాకుండా పోయింది. ఎంత సిగ్గుచేటు!

**ఆర్థిక క్రమశిక్షణ।** దాంతోపాటు ఆర్థిక క్రమశిక్షణ కావాలి. ఇందాక చెప్పాను, రెండు రాష్ట్రాల్ని ఉటంకించాను. దానిమీద జాతీయస్థాయిలో ప్రతి రాష్ట్రాన్నీ విశ్లేషిస్తూ ఒక సమగ్రమైన చర్చా పత్రాన్ని లోక్‌సత్తా వెలువరించింది. వెంటనే ఒక్కరోజున సాధ్యం కాకపోవచ్చు, కానీ రెండు మూడేళ్లలో ఆర్థిక పరిస్థితి చక్కబెట్టాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెవెన్యూలోటు రెండేళ్ల క్రితం రూ.43,500 కోట్లు ఉంది. 2023-24 అంకెలు, సవరించిన అంచనాలు 32,000 కోట్లు ఉంది. వచ్చే సంవత్సరం ఏం చేస్తుందో ఎన్నికైన ప్రభుత్వం నిర్ణయం చేస్తుంది. బడ్జెట్‌లో కొన్ని అంకెలు పెట్టారు. బడ్జెట్ అంకెలు వాస్తవాలకి సరిపోవచ్చు, సరిపోకపోవచ్చు. అప్పులు 20% ఉండాలి. ఒక రాష్ట్ర జీఎస్‌డీపీలో, స్థూల ఉత్పత్తిలో అప్పులు ఆ పరిధి దాటకూడదు. అది ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం కింద నిబంధన. అంతకంటే ఎక్కువైనట్లయితే, అప్పులు, వడ్డీల భారం పెరిగి రాష్ట్రం దివాలా తీస్తుంది. అందునా రెవెన్యూ లోటు ఉందంటే అర్థం ఏమిటి, అప్పులు చేసి పప్పు కూడు తింటున్నాం. అప్పులు ఈవేళ ప్రభుత్వం ప్రత్యక్షంగా చేసిన అప్పులు గానీ, ప్రభుత్వం ప్రత్యక్షంగా చూపెట్టకుండా, ఆఫ్ బడ్జెట్ రుణాలు అంటారు, వేరే సంస్థల పేరుతో, కానీ వాటికేమీ ఆస్తులు లేవు, ప్రభుత్వమే చెల్లించాలి, అవన్నీ గానీ కలిపితే ప్రభుత్వ లెక్కల ప్రకారమే 43% ఉన్నాయి. 20% ఉండాలి. 2022-23 తర్వాత లెక్కలు ఇవ్వలా ప్రభుత్వం. దీన్లో ఇంకా కొన్ని అంకెలు లేవు. ఏమిటి అంకెలు లేనిది, బాకీలు. నాకు అందిన సమాచారం ప్రకారం, విశ్వసనీయ సమాచారం ప్రభుత్వం బయటపెట్టాలి ఇవాళగానీ, ఎన్నికల తర్వాత గానీ, లక్ష కోట్ల రూపాయల పైచిలుకు బాకీలున్నాయి. చిన్న చిన్న కాంట్రాక్టర్లు పనులు చేసిన వాళ్లకు డబ్బులివ్వలేదు. పాపం వాళ్లు కోటి రూపాయలు రాకపోతే ముని గిపోతారు, ప్రభుత్వం నుంచి ఉపాధిని కోరకుండా చాలా కష్టపడి పెట్టుబడి పెట్టి పనులు పూర్తి చేస్తే ప్రభుత్వం నుంచి డబ్బులు ఇవ్వలా. అలాగే ఇతరత్రా బకాయిలు చెల్లించాల్సినవి ఉన్నాయి. ఉద్యోగులకు సంబంధించి కావచ్చు, ఇంకొకటి కావ చ్చు, లక్ష కోట్ల పైచిలుకు ఉన్నాయి. ఎంతున్నాయో సరిగ్గా తెలి యదు. ఇవన్నీ కలిపితే భారం 50% దాటుతోంది. 20% ఉండాలి. ఒక్కరోజు దీన్ని అదుపు చేయలేకపోవచ్చు. కానీ కచ్చితంగా

అదుపు చేసి తీరాలి. ఆర్థిక క్రమశిక్షణ కావాలి. దానికి లోక్ సత్తా పూర్తిగా జాతీయ స్థాయిలోగానీ, రాష్ట్రాల్లోగానీ కట్టుబడి ఉంది.

**అమరావతి గ్రీన్‌ఫీల్డ్ సిటీ।** మూడోది, అభివృద్ధి కేవలం హైదరాబాద్ నగరానికో, అమరావతి నగరానికో పరిమితమైతే చాలదు. అమరావతి కచ్చితంగా కావాలి. రాజధానిగా మాత్రమే కాదు. మన చర్చంతా రాజధాని చుట్టూ తిరుగుతోంది. మన దృష్టిలో రాచరిక ప్రభావం ఉంది. రాజధాని కన్నా గ్రీన్‌ఫీల్డ్ సిటీ ముఖ్యం. ఆధునిక యుగంలో మీకొక గ్రీన్‌ఫీల్డ్ సిటీ లేకపోతే పెట్టుబడులు రావు. ప్రపంచ స్థాయి టాలెంట్ మీ రాష్ట్రంలోకి రాదు. వాళ్లు ఎక్కడ బాగుంటే అక్కడికి పోతారు. డాక్టర్లు కూడా విదేశాల్లో నైపుణ్యం ఉంటే హైదరాబాద్ పోతున్నారు తప్ప విజయవాడ రావటం లేదని చెబుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో టాలెంట్, పెట్టుబడులు కావాలంటే అత్యున్నత ప్రమాణాలతో ఒక సిటీ ఉండటం అవసరం. ఉన్న సిటీని బాగు చేయటం కష్టం. విజయవాడ గొప్ప సిటీ. మనందరం గర్వించే నగరం. మా అందరికీ సిటీ అంటే విజయవాడ చిన్నప్పుడు. కానీ ఇవన్నీ కూడా గ్రామాల నుంచి పెరిగినాయి. కాబట్టి మౌలిక సదుపాయాల్ని ఒక స్థాయి మించి మీరు బాగు చేయలేరు. ఇరుకైన రోడ్లు, సందులుగొందులు, ఇది అనివార్యం. ప్రతి పట్టణంలో అంతే. హైదరాబాద్‌లో ఎప్పుడైతే మీకు హైటెక్ సిటీ వచ్చిందో పోటీ ఆర్థిక వ్యవస్థలో అవకాశాల్ని అందిపుచ్చుకుంది. హైటెక్ సిటీ నిర్మాణంలో నేను కీలక పాత్ర వహించాను. చంద్రబాబు నాయుడు గారు అద్భుతమైన కృషి చేశారు దేశానికే తల మానికంగా. తర్వాత వచ్చిన నాయకులు రాజశేఖరరెడ్డిగారు గానీ, టీఆర్ఎస్/ బీఆర్ఎస్ నాయకులుగానీ బ్రహ్మాండంగా చేశారు. హైటెక్ సిటీ కావచ్చు, లేకపోతే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కావచ్చు, ఇతరమైనవి కావచ్చు, అక్కడ చూస్తే మీకు ఈ దేశంలో ఉన్నారా, అమెరికాలో ఉన్నారా, జపాన్‌లో ఉన్నారా తేడా తెలియదు. కాబట్టి కచ్చితంగా ఆ స్థాయిలు కావాలి.

**100 చిన్న పట్టణాల అభివృద్ధి।** కానీ దాంతోనే తృప్తి పడితే చాలదు. అంచేత 100 చిన్న పట్టణాలు అభివృద్ధి కావాలి. అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి, చిన్న చిన్న నైపుణ్యాలున్న యువతకి, గ్రామాల నుంచి వచ్చిన యువతకి ఉపాధి అవకాశాలు కల్పించాలి. అందరూ పొలోమంటూ అమరావతో, విజయవాడో, హైదరాబాదో, చెన్నపట్టణానికో తరలిపోవాల్సిన అవసరం లేకుండా అక్కడే ఉపాధి దొరికిందనుకోండి, మనకి సౌకర్యాలు, బంధువులు, ఆలనాపాలనా ఉంటాయి, అక్కడ రూ.15,000 వచ్చినా హాయిగా బతకొచ్చు. మహానగరానికి పోతే రూ.30 వేలు వచ్చినా మిమ్మల్ని పట్టించుకునేవాళ్లు లేరు. మీకు బంధువులు లేరు, కష్టం వస్తే ఆదుకునేవాళ్లు లేరు. ఆ కొవిడ్ నేపథ్యంలో మీకు గుర్తుందో లేదో, మీడియాలో బ్రహ్మాండంగా రాశారు, లక్షల మంది గ్రామాల నుంచి వలస వచ్చినవాళ్లు ఎన్ని కష్టాల పాలయినారో. రోజువారీ ఆదాయం కోసం మహానగరాల్లో ఉండేవాళ్లు కూడా కుటుంబాలతో ఉండే అవకాశాలు లేదు. నూటికి 90 మంది తక్కువ స్కిల్స్‌తో వచ్చినవాళ్లు, ఎక్కడోకచోట ఒక పంచన తలదాచుకోవటం. పదేళ్లు, పదిహేనేళ్లు. అలాంటి పరిస్థితి సమాజానికి చాలా అరిష్టం, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంది, రాజకీయాన్ని అస్థిరపరుస్తుంది. కాబట్టి మహానగరాలు కొన్ని కావాలి, గట్టిగా కోరుతున్నాను, దానితోపాటు చిన్న పట్టణాలు అభివృద్ధి కావాలి. అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించటం, అక్కడ ముఖ్యంగా రవాణా సులభంగా అందే ఏర్పాటు చేయటం, రోడ్లు, విద్యుత్తు, మురుగునీటి పారుదల, మంచినీళ్లు, వరద నీటి పారుదల వసతులు కల్పించటం ముఖ్యం. ఉన్నకొద్దీ వర్షాలు పెరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో అకాల వర్షాలు. అవి సమస్యగా మారకూడదు. వీటితోపాటు మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం, చిన్న చిన్న పరిశ్రమలు, ఉపాధి కల్పన కోసం ఏర్పాట్లు ఉంటే, మిగతాది ప్రైవేటు రంగం నుంచి వచ్చేస్తుంది. ఇప్పుడు ఎక్కడ చూసినా అవకాశం రాగానే లే అవుట్లు వేసేస్తున్నారు. పల్లెటూళ్లలో కూడా. భవన నిర్మాణ పరిశ్రమ వస్తుంది, మిగతావాళ్లు వస్తారు. పల్లెటూరు జీవితం బాగుంటుంది, ఊళ్లో పొలం చూసుకుంటుండవచ్చు, పని చూసుకోవచ్చు, పట్టణంలో ఖర్చును కుంటే ఊళ్లోనే ఉండొచ్చు, పది నిముషాల్లో ఇక్కడికి వచ్చేయొచ్చు. మొత్తం పరిస్థితి ఇంకో రకంగా ఉంటుంది. ఈ దయనీయం ఉండదు, ఈ భయం ఉండదు. కాబట్టి 100 చిన్న పట్టణాలు. ఈ మూడు పార్టీల నాయకుల్ని కోరుతున్నాను, కేవలం యథాస్థితి కొనసాగిస్తే లాభం లేదు. ఒక పార్టీ మారి ఇంకో పార్టీ వస్తే ఏదో అద్భుతం జరుగుతుందని అనుకోకూడదు. వంద చిన్న పట్టణాలు కావాలి. వచ్చే అయి దేళ్లూ మన శక్తి మొత్తాన్నీ కూడా చిన్న చిన్న పట్టణాల్ని పెంచి, ప్రతి గ్రామీణ ప్రాంతంలోని యువతలో చిన్న చిన్న నైపుణ్యాలతో హాయిగా ఇక్కడ నేను బతకగలను, ఇక్కడ ఉపాధి దొరుకుతుంది, ఈ ఊళ్లో వ్యవసాయం చూసుకుంటూనే ఎదగొచ్చనే పరిస్థితి కల్పించాలి.

**వ్యవసాయం।** వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది. ప్రస్తుతం రైతులు కొన్ని ప్రాంతాల్లో ఉద్యమాలు చేస్తున్నారు. ఆ ఉద్యమాల నుంచి వాళ్లు కోరుతున్నది అసంబద్ధమైనది, నేను బహిరంగంగానే నా భావాల్ని వ్యక్తం చేశాను దేశవ్యాప్తంగా, తెలుగు రాష్ట్రాల్లో. కానీ ఆ వేదన నిజమైనది. సమస్య పరిష్కారం అర్థంకాక ఏదో గతంలో కొనసాగినట్లుగా సాంప్రదాయబద్ధంగా కొన్ని కోరవచ్చుగానీ, రైతులు, వ్యవసాయ రంగం, గ్రామీణ రంగం సంక్షోభం నిజమైనది. వ్యవసాయ రంగం, గ్రామీణ రంగం కలిపి చూడాలి. సమగ్రమైన ఏర్పాట్లు ఉండాలి. వివరాల్లోకి వెళ్లటానికి టైం లేదు కాబట్టి దాంట్లోకి వెళ్లను. ఆ సమగ్ర వ్యూహం లోక్‌సత్తా దగ్గర ఉన్నది, మరికొందరి దగ్గర కూడా ఉన్నది. ఏదో మనకి ఒక ఉద్యమం వస్తే, రాస్తారోకో వస్తే ఆనాడు పట్టించుకొని, అది తేలిపోగానే గాలి పీల్చుకుని మామూలు అనుకుంటే, ఇంకో సంక్షోభం కోసం ఎదురుచూస్తే అది పరిపాలన కాజాలదు.

**కనీస ప్రమాణాల చట్టబద్ధపాలన।** కనీస ప్రమాణాల చట్టబద్ధపాలన. ఈ దేశంలో ఏ పార్టీ ఎక్కడ అధికారంలో ఉన్నా కూడా చట్టం అధికారంలో ఉన్నవాడి చుట్టమైన మాట వాస్తవం.

ఇప్పుడు మరీ అడ్డగోలుగా మారింది. కాబట్టి కనీసం కొంత. ఒక్కరోజు దీన్ని మార్చలేరు మీరు. ఇది జాతీయ స్థాయిలో జరగాలి, రాష్ట్రంలో జరగాలి. కనీసం అడ్డగోలుగా ప్రవర్తించదు చట్టం, పోలీసు యంత్రాంగం, కనీసం తగాదాల పరిష్కారానికి వేగంగా ఒక సమగ్రమైన ఏర్పాటు ఉంటుంది అనే భరోసా కావాలి. లేకపోతే పెట్టుబడులు రావు. తగాదాలకు గూండాలను పెట్టుకోవాల్సి వస్తే, రాజకీయంగా పరపతి కావాల్సి వస్తే, పోలీసుల అండ కావాల్సి వస్తే, ఎవరూ పెట్టుబడి పెట్టరు. వాడెందుకు పెడతాడు? పిచ్చోడా? కోట్లు పెట్టుబడి పెట్టేవాడు మీ దగ్గరికి వస్తాడా, మీ కాళ్లు పట్టుకుంటాడా? ఇంకో చోటికి పోతాడు. తగాదాల పరిష్కారం కావచ్చు, ఆస్తి హక్కుల రక్షణ కావచ్చు, కాంట్రాక్టుల ఎన్‌ఫోర్స్‌మెంట్ కావచ్చు. కనీసం ఇంత వరకైనా చట్టం సమర్థంగా పనిచేస్తుందనే విశ్వాసం కలగాలి.

**దీర్ఘకాలిక ఎజెండా।** దీర్ఘకాలిక ఎజెండా ఉంది, దాన్లోకి వెళ్లక్కర్లా. లోక్‌సత్తా తొలి నుంచీ పోరాడుతోంది. అది దేశంలో జరగాల్సి ఉంది. రాజకీయ పార్టీల సంగతి గానీ, ఎన్నికల వ్యవస్థ సంగతి గానీ, అధికార వికేంద్రీకరణ గానీ, చట్టబద్ధపాలనలో మౌలిక మార్పులు తీసుకొచ్చి ఈ దేశంలో నేరపరిశోధనలో మౌలికంగా ఎవరూ జోక్యం చేసుకునే అవకాశం లేకుండా చేయటం గానీ, ఈవేళ జరిగితే సంతోషమే కానీ ఒక్క రోజులో జరగవు. దాని గురించి ప్రస్తుతం నేను మాట్లాడటం లేదు.

**తెలుగు ప్రజలంతా మనసు పెట్టి ఆలోచించండి, అవకాశాలు అందని యువతా మేలుకోండి**

అంచేత దయచేసి తెలుగు ప్రజలంతా మనసు పెట్టి ఆలోచించండి, మీ కుటుంబాలు, మన పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించండి. మన కులము, మన వర్గము, మన ఊళ్లో ఉన్న ఫ్యాక్షన్ దీని చుట్టూ మన ఆలోచనలు తిరిగితే, సంకుచితమైపోతే సమాజం అల్లకల్లోలమైపోతుంది, నష్టపోయేది పేదలు అత్యధికంగా. డబ్బున్నవాడు ఎట్లాగొట్లా తట్టుకుంటాడు, పెట్టుబడులు రాకపోయినా ఇంకో రాష్ట్రానికి పోతాడు, అవకాశాలు లేకపోయినా పిల్లల్ని ఇంకో దేశానికి పంపించుకుంటాడు. నష్టపోయేది చివరకు పేదలు. ఏ పేదల పేర్లు చెప్తున్నామో, ఆ పేదల పొట్ట కొడుతున్నాం, ఆ పేదల పిల్లలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నాం. అందుకనే మళ్లీ ఇంకొక్కసారి, సమాజంలో పుట్టుకతో అసమానతలకి గురైన వర్గాలు, కేవలం ఫలానా కుటుంబంలో పుట్టిన పాపానికి అవకాశాలు లేక అలమటిస్తున్న యువతను నేను కోరుతున్నాను. ఒక్కసారి కళ్లు మూసుకుని ఆలోచించండి. యథాస్థితి కొనసాగినట్లయితే నా జీవితం పదేళ్ల తర్వాత ఎట్లా ఉంటుంది, ఆలోచించుకోండి. ఇరవయ్యేళ్ల తర్వాత ఎట్లా ఉంటుంది మీరే ఆలోచించుకోండి. ఇదే కావాల్నా? కాదు అన్నట్లయితే ఏం కావాలి? ఫలానాది కావాలి అంటే, దానికి ఉన్నంతలో ఉన్నటువంటి, ఇవాళ రాజకీయ శక్తుల్లో ఏ పద్ధతి అయితే మీకు సరిగ్గా ఉంటుంది? అద్భుతమేమీ లేదు. ఇది దేవతలు, రాక్షసుల మధ్య పోరాటమేమీ కాదు. నేను మళ్లీ మళ్లీ చెబుతున్నాను, కానీ ఉన్నంతలో. ఎందుకంటే ఈ మనుషులే గదా, మనుషులు ఎక్కడి నుంచో రావటం లేదు గదా, పోటీ చేసేవాళ్లు వాళ్లే, రాజకీయంలో పాల్గొనేవాళ్లు వీళ్లే, గ్రామాల్లో నాయకత్వం ఇచ్చేవాళ్లూ వీళ్లే, కాబట్టి అక్కడ పెద్ద అద్భుతమైన మార్పు వస్తుందనుకోవద్దు. కానీ ఏ పంథా చూపెడుతున్నాం? ఈ దారా? ఆ దారా? దాన్ని బట్టి భవిష్యత్తు నిర్ణయమవుతుంది. ఆ నిర్ణయానికి కీలక ఘట్టం ఇది.

**క్లాస్‌వార్ అనడం..ప్రజాస్వామ్య రాజకీయంలో ప్రమాదకరం ఎన్నికల్లో పోటీ చేసేవాళ్లు శత్రురాజులు కాదు**

రాజకీయ పార్టీలకి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజలని ఆవేశంలోకి నెట్టబోకండి. విద్వేషాలను రెచ్చగొట్టబోకండి. ఆలోచించేరీతిన చర్చను పెట్టండి. మీ భావాల్ని మీరు బలంగా చెప్పండి. ప్రజాస్వామ్యంలో ఆ స్వేచ్ఛ ఉన్నది, ఆ బాధ్యతా ఉన్నది. నేను ఈవేళ భావాల్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాను. కానీ ఎక్కడా ఎవర్నీ అవమానించాలని కాదు, కోపం కాదు, కసి కాదు. ప్రజల పట్ల ప్రేమతో ప్రవర్తించండి, ఇతరుల పట్ల ద్వేషంతో కాదు. ద్వేషాల్ని, కులాల్ని, వర్గాల్ని రెచ్చగొట్టబోకండి. కొన్ని సందర్భాల్లో ఈ రాష్ట్రంలో కొందరి మాటలు వింటుంటే ఒక క్లాస్ వార్‌లాగా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నట్లుంది. వర్గ పోరాటం, పూర్వకాలం సాయుధ పోరాటం చేస్తున్నకాలంలో కమ్యూనిస్టు సిద్ధాంతం. వర్గ పోరాటం, వర్గ శత్రువులు. కొందరిని వర్గ శత్రువులుగా భావించేటువంటిది చాలా ప్రమాదకర రాజకీయం ప్రజాస్వామ్యంలో. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేసేవాళ్లు శత్రు రాజులు కాదు. విభిన్న భావాలతో ప్రజల మద్దతు కోసం ప్రజల ముందుకు వచ్చేవాళ్లు. అది మర్చిపోయి మీడియాలోగానీ, సోషల్ మీడియాలోగానీ, లేకపోతే పార్టీల ప్రవర్తన, మాటల్లోగానీ చివరికి దాని వల్ల మన బజారులో చర్చల్లోగానీ, ఇదేదో బస్తీ మే సవాల్ లాగా ఉంది. బస్తీ మే సవాల్ కాదు ఇది. వర్గ పోరాటం కాదు. వర్గ శత్రువులు ఎక్కడా లేరు. మీరెవరూ శత్రు రాజులు కాదు. ప్రజల డబ్బుతో ప్రజల భవిష్యత్తు కోసం మీరు కొన్ని భావాల్ని ప్రజల ముందు పెట్టి మద్దతు కోరుతున్నారు. లక్ష్యాలు ఒకటే అని నేను నమ్ముతున్నాను. మనసులో మీకేమున్నా కూడా కనీసం మీరు చెప్పే లక్ష్యాలు అందరి బతుకులూ బాగుపడాలనే కదా! అందరికీ న్యాయం జరగాలనే కదా! ఇంక శత్రు రాజ్యాలు ఎట్లా అవుతుంది?

**ఆవేశాల్ని, విద్వేషాల్ని రెచ్చగొట్టేవారికి బుద్ధి చెప్పండి**

అంచేత సామాన్య ప్రజల్ని కోరుతున్నాను. వాళ్లందరూ కూడా మన అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని మనల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. రెచ్చగొట్టవద్దని పార్టీల్ని కోరుతున్నాను, రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే బుద్ధి చెప్పండి వాళ్లందరికీ అని ప్రజలందరినీ మనసారా కోరుతున్నాను వినమ్రంగా. సుదీర్ఘంగా చెప్పాల్సి వచ్చింది ఎందుకంటే, ఈ విషయం కూలంకషంగా చెప్పకపోతే, తెలుగు రాష్ట్రాల్లో అమ్మా అంటే బూతుమాట అయ్యే పరిస్థితి వచ్చింది ఈవేళ. నేను ఫ్రాంక్‌గా చెబుతున్నాను. కాబట్టి కనీసం మాట చెప్పేటప్పుడు విశదీకరించి కారణాన్ని చెప్పి ఊరికే ఏదో గుడ్డెద్దు చేలో పడ్డట్టు కాకుండా ప్రజల ముందు వాస్తవాల్ని చెప్పే బాధ్యత మనందరికీ ఎక్కువ ఉంది. కాబట్టి నేను కాస్త ఎక్కువ సమయం తీసుకున్నాను. ❖

# అంబేద్కర్ - రాజకీయ సమానత్వం

సంతోషిణి

**భారతదేశం ఏప్రిల్ నుంచి 18వ లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఇదే సమయంలో కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగబోతున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు సుమారు 96.88 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారని ఎన్నికల సంఘం తెలిపింది. ప్రపంచంలోనే అతి పెద్ద ఎలక్టొరేట్‌గా మన దేశం నిలుస్తోంది. ఈ స్థాయిలో ఓటర్ల నమోదు దేశంలో ఏ రకమైన వివక్షలేని రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఎటువంటి వివక్షా లేకుండా అందరికీ ఓటు హక్కును స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఇచ్చిన తొలి దేశం భారత్. ఒక వ్యక్తి - ఒక ఓటు, ఒక ఓటు - ఒక విలువ అనే సూత్రంపై రాజకీయ సమానత్వాన్ని హక్కుగా అందించేలా రాజ్యాంగ పరిషత్ సభ్యుల్ని ఒప్పించటంలో కీలక పాత్ర పోషించిన నాయకుడు డా॥ బి.ఆర్ అంబేద్కర్.**

అంబేద్కర్ దృఢమైన ప్రజాస్వామ్యవాది, రాజ్యాంగవాది. విలువల వ్యవస్థీకరణను విశ్వసించిన దార్శనికుడు. 1949 నవంబర్ 25న జరిగిన చివరి రాజ్యాంగసభ సమావేశంలో అంబేద్కర్ చరిత్రాత్మక ప్రసంగం చేశారు. భారత ప్రజాస్వామ్యం గురించి తన ఆలోచనల్ని విస్తృత స్థాయిలో వివరించారు. చరిత్రలో ఎన్నడూలేని రీతిలో ఒక సువిశాల ప్రజాస్వామ్య దేశంగా ప్రస్థానం మొదలుపెట్టిన స్వతంత్ర భారతదేశం ఆ ప్రజాస్వామ్యాన్ని నిలుపుకోవటం అంత సులభం కాదని స్పష్టం చేశారు. దేశ ప్రజాస్వామ్యం రూపాన్ని నిలుపుకుంటుందిగానీ, సారంలో నిరంకుశత్వానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. భారతీయ సమాజాన్ని, అదేవిధంగా స్వతంత్ర పోరాటం తీరుని లోతుగా అధ్యయనం చేసిన అంబేద్కర్ వ్యక్తిపూజపై గట్టి హెచ్చరిక చేశారు. రాజకీయంలో భక్తి లేదా వ్యక్తిపూజ ప్రజాస్వామ్య పతనానికి, నియంతృత్వానికి దారితీస్తుందన్నారు.

తాజా సార్వత్రిక ఎన్నికలవేళ ఓటు హక్కు రూపంలో రాజ్యాంగం పౌరులకు అందించిన రాజకీయ ప్రజాస్వామ్యం, రాజకీయ సమానత్వం ఏ మేరకు సాధ్యమయ్యాయో అంబేద్కర్ ఆనాడు వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో పరిశీలించటం అవసరం. ప్రతి పౌరునికీ కులం, మతం, ప్రాంతం, భాష, డబ్బుతో సంబంధం లేకుండా సమాన విలువ ఓటు ఇవ్వటం వల్ల ప్రజలు తమ గొంతు వినిపించటానికి, తాము సార్వభౌములమని బలహీనంగానైనా చాటుకోవటానికి ఓటు కీలక రాజకీయ సాధనంగా మారింది. ఇంతవరకూ అంబేద్కర్, ఇతర రాజ్యాంగ సభ్యుల లక్ష్యం నెరవేరిందిగానీ, సమాజంలోని వ్యక్తిపూజ, అందుకు కారణమైన ఫ్యూడల్ సంస్కృతి పోలింగ్ బూత్ బయట అంబేద్కర్ భయపడిన దుష్ప్రభావాన్ని కలిగించాయి. ఓట్ల కొనుగోలు, మద్యం వంటి ప్రలోభాలు ఎన్నికల్ని ఖరీదైనవిగా మార్చాయి. ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలిచినట్లు, తక్కువ వస్తే ఓడినట్లు అనే మన ప్రస్తుత ఎన్నికల విధానం వీటికి తోడవటంతో చట్ట విరుద్ధమైన డబ్బు ప్రభావం పెరిగింది. ఇవీ చాలక సంక్షేమం పేరుతో తాత్కాలిక పథకాల్ని పోటాపోటీగా ప్రకటిస్తుండటంతో



సంక్షేమమే పరిపాలనగా మారి, చాలా రాష్ట్రాల్లో అభివృద్ధి దెబ్బతింటోంది. ఎన్నికల్లో గెలవటానికి రాజకీయ అవినీతి తప్పనిసరి అనే పరిస్థితి నెలకొంది. దీంతోపాటు రాజ్యాంగ నిర్మాణ సమయంలోనే కొంత గందరగోళం కారణంగా స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించకుండా వాయిదా వేయటం వల్ల ఎక్కువమంది ప్రజలకు తమ ఓటుకు, దాని వల్ల తమ జీవితంలో కలిగే ఫలితం ఏమిటో అర్థంకాక ఓటుకు డబ్బు, తాత్కాలిక పథకాలు తీసుకుంటే తప్పేంటి అనే భావం పెరిగింది.

ఈ పరిణామాలన్నీ పార్టీలు కొన్ని కుటుంబాల ఆస్తులుగా మారటానికి, అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడటానికి దారితీశాయి. పైన పేర్కొన్న రీతిలో ఓట్ల కొనుగోలు, ప్రలోభాల ద్వారా ఆకట్టుకున్న ఓటర్లు కూడా ఎన్నికల్లో గెలుపుకి సరిపోరు అనుకుంటే, కులం, మతం, ప్రాంతం వంటి భావోద్వేగాలను రెచ్చగొట్టటం, ప్రజల్ని విభజించటం చేస్తున్నారు. డబ్బు, భావోద్వేగాలు, వ్యక్తిపూజ రాజకీయం నుంచి నేరస్తులు కూడా ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు.

రాజకీయ ప్రజాస్వామ్యం బలంగా ఉండటంలో, నిజమైన రాజకీయ సమానత్వం సాధ్యం కావటంలో సామాజిక ప్రజాస్వామ్యం పాత్ర చాలా ముఖ్యమని అంబేద్కర్ భావించారు. సామాజిక న్యాయాన్ని సాధించటంలో, అణగారిన వర్గాల్లో ఆ రకమైన భరోసా కల్పించటంలో భాగంగా రిజర్వేషన్లను ఆయన ప్రతిపాదించారు. రిజర్వేషన్ల వల్ల ఫలితాలకున్న పరిమితిపై స్పష్టత ఉన్నందున ఒక తాత్కాలిక విధానంగా, పది, ఇరవై ఏళ్ల వరకు మాత్రమే వాటిని కొనసాగించాలని సూచించారు. అయితే రిజర్వేషన్ల ద్వారా అంబేద్కర్ ఆశించిన నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలను అందించే ప్రయత్నం చేయకుండా ఆ రిజర్వేషన్లను రాజకీయ సాధనంగా ఉపయోగిస్తున్నారు.

(మిగతా 31వ పేజీలో)

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## జుగాడ్ 50:50 రాజనీతి

## నమూనామార్పుకి సమయం ఆసన్నమైంది.

**మన పొలిటికల్ పార్టీలు మనని 1) డబ్బు 2) మద్యం ద్వారా blackmail చేస్తూ మనపై పెత్తనం చేస్తున్నాయి. దేశంలో జరుగుతున్న పరిణామాలే అందుకు సాక్ష్యం!**

మే 2017 జనబలం 24 వ పేజీ లో జుగాడ్ 50-50 ఆలోచనా విధానం అనే శీర్షికన

"2004-05 నుండి 2014-15 వరకు (అప్పుడు అధికారంలోఉన్న UPA ఓటర్ల హయాంలో) మన రాజకీయ పార్టీలు సేకరించిన విరాళాలు 11,500 కోట్ల రూపాయలని ADR అనే సంస్థ చేసిన విస్లేషణాత్మక సర్వేలో తేలింది. (TNIE dt. 31-01-2017). అందులో 8200 కోట్లరూపాయలు గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా లభించినదేనట! జాతీయ పార్టీలయిన కాంగ్రెస్ మరియూ బీజేపీల వద్ద 5500 కోట్లరూపాయల అజ్ఞాత నిధులుండగా, మిగతా అజ్ఞాత నిధులు స్థానిక పార్టీల వంతు. 'నల్లడబ్బు' ప్రభావంతో పరిపాలన సాగినంతకాలం మనకు న్యాయంగా రావలసిన అభివృద్ధిని సాధించలేము. ప్రస్తుత ధనరాజకీయ చదరంగపుక్రీడలో 'నల్ల' సైన్యానికి దీటుగా జుగాడ్ ఓటర్ల కష్టార్జితంతో 'తెల్ల' సైన్యం ఏర్పడాలి. జుగాడ్ ఓటరే తెల్లసైన్యపు సైనికుడిగా మొదటి అడుగు వెయ్యాలి" అంటూ రూ. 10,000 విరాళమిచ్చి జుగాడ్ ఓటరుగా నేనొక ప్రతిపాదన చేయడం జరిగింది:

తత్ఫలితంగా నేడు ఒక మహేశ్వరం అనే MLA నియోజకవర్గంలో నేను ఎన్నికలలో పోటీ చేయకపోయినా, నాతోసహా 10 మంది రూ. 10,000 చొప్పున, మరొక 30 మంది ( రూ. 2,000 కానీ రూ. 5,000 కానీ) జుగాడ్ ఓటర్ల విరాళముతో "Cooperation based on trust" ("నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం") అనే మౌలికసూత్రం ప్రాతిపదికగా ఎక్కువమంది ఓటర్లకు ఆమోదయోగ్యమైన నమూనా మార్పు కి అవకాశం ఏర్పడింది. (see August 2023 జనబలం). అనునిత్యం ఏదో విధంగా ప్రభుత్వం ద్వారా నష్టపోతున్న, వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న ఒక 30 మంది విరాళదాతలు ప్రతిపాదిత ద్విపక్షపార్టీనుండి అవినీతిలేని సుపరిపాలన కోసం ఎదురుచూస్తున్న, ప్రతిఫలాపేక్షలేని సామాన్య పేద మధ్యతరగతి ఓటర్లు.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

ఆ తరువాత 2014 లో అధికారంలోకి వచ్చిన NDA ఓటర్ల సమూహం "తోసి రాజు" అంటూ బాండ్ల రూపేణా పొలిటికల్ పార్టీలకు "విరాళదాతలతో డబ్బు సమీకరణ" "చట్టబద్ధం" చేసింది. తత్ఫలితంగానే ఈ మధ్య గౌరవ సుప్రీం కోర్ట్ "పారదర్శకత ముసుగులో లొసుగులతో కూడిన ఎలక్టోరల్ బాండ్స్ స్కీముని" రద్దు చేసింది. పొలిటికల్ పార్టీలకు విరాళమిచ్చిన వ్యక్తుల వివరాలన్నీ తెలియజేయాలని చెప్పి సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది బాండ్ల ద్వారా స్వీకరించబడిన డబ్బు ఎన్నికల సమయంలో ఓట్ల కొనుగోలుకే అన్న సంగతి తేటతెల్లమైంది. అంతేకాదు ! మరొక 2700 ప్రశ్నించదగ్గ పొలిటికల్-ముఠాలు (కొత్త పార్టీలు) ఎన్నికల కమిషన్ ద్వారా అత్యంత చట్టబద్ధంగా పుట్టుకొచ్చాయి. మరి వీటి పేర్లు బహిర్గతం చేయమని సుప్రీం కోర్టు ఎందుకు ఆదేశించలేదు. ఓటర్లకు రక్షణ కరువైంది.

అవినీతి అంతం, లొసుగులులేని చట్టబద్ధ పాలన, అధికార వికేంద్రీకరణ, ఆర్థిక వనరుల వికేంద్రీకరణ మౌలిక వసతుల కల్పన, రైతులకు గిట్టుబాటు ధరలు పుట్టిన ప్రతి బిడ్డకు వివక్ష లేని నాణ్యమైన విద్య, దేశ పౌరులందరికీ కానీ ఖర్చు లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా సంపూర్ణ లొసుగులులేని ఆరోగ్య వ్యవస్థ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ద్వారా ఎన్నికలు ఇవన్నీ ఒక మంచి పొలిటికల్ పార్టీ చేయవలసిన పనులు. సురాజ్యపాలనకు ఒక విశ్రాంత IAS ఆలోచనాపరుని కల.

ఇకపోతే మద్యం గురించి రెండు మాటలు : మద్యపానం వంటి సామాజిక రుగ్మతలను ఎవరి కుటుంబంలో వారు చక్కదిద్దుకోవాలి. మద్యపానాన్ని ఏ పొలిటికల్ పార్టీ ఐనా పురుషులను బ్లాక్ మెయిల్ చేస్తూ స్త్రీల ఓట్లు దండుకుంటూ మద్యాన్ని పార్టీ యొక్క ఆదాయ వనరుగా భావించే ప్రభుత్వం ఓటర్లకు అనవసరం ఒక చేత్తో పెన్షన్, నిరుద్యోగ భృతి ఇస్తూ మరొక చేతితో ఆ డబ్బులు వెనక్కి లాక్కుంటున్నాయి. మద్యాన్ని ఆర్థిక వనరుగా భావించే పార్టీ యజమానులకు చరమగీతం పాడాలి నాడు స్త్రీలసంక్షేమం కోసం ఒక పేదమహిళ "సంపూర్ణ మద్యపాన నిషేధానికి" ఉద్యమిస్తే, నేడు మరొక సాక్షాత్తు స్త్రీమూర్తి "మద్య-కుంభకోణంలో" ఇరుక్కుంది.

మనదేశంలోని వివిధ రాష్ట్రాలలో కొత్తగా వస్తున్న పొలిటికల్ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించడం వల్ల ఆయా పార్టీల అధినేతలు కానీ కార్యకర్తలు కానీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత నిరంకుశ ధోరణి ప్రదర్శించే అవకాశం ఉంది.

"మన ఓటు-మన డబ్బు-మన పార్టీ, మన స్వాధికార ప్రభుత్వం" ప్రాతిపదికన, జుగాడ్ ఓటర్ల ఉద్యమం శాంతియుతంగా నిర్మించబోతున్న స్వజాతీయ, ద్విపక్ష పొలిటికల్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యంతో ఓటర్ల యొక్క ఏకీకృత ఎజెండాతో పని చేసే ప్రభుత్వాలు వస్తాయనే సంకల్పంతో ఈ నూతన ఓటర్ల ఉద్యమ సమూహం "లోక్ సత్తా ఉద్యమ స్ఫూర్తితో" ఆవిర్భవించింది. కాస్త "పచ్చిగా మాట్లాడినందుకు" యావత్ భారత దేశంలోని ఓటర్ల జాతికీ, మీలో ఒకడిగా నన్ను క్షమించమని నా ప్రార్థన !

Advt

# అంబేద్కర్ - ఆర్టికల్ 293, కేరళ సర్కార్ వర్సెస్ యూనియన్ ప్రభుత్వం

**జాతీయస్థాయి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం సక్రమంగా అందటం లేదని పలు దక్షిణాది రాష్ట్రాలు, కొన్ని ఉత్తరాది రాష్ట్రాలు ఇటీవలికాలంలో పెద్దఎత్తున ఆరోపణలు చేస్తున్నాయి. కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు ఢిల్లీ వెళ్లి మరీ నిరసన తెలియచేశాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కోల్‌కతాలో రెండు రోజుల పాటు ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు.**

**యూనియన్ నుంచి పన్నుల వాటా బదిలీ, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు, ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి సాయం, ప్రాజెక్టుల నిర్మాణంలో నిధులు, రాష్ట్రాలు అప్పులు తెచ్చుకునేందుకు యూనియన్ ప్రభుత్వ అనుమతి మొదలైన అంశాలకు సంబంధించి ఆ నిరసనలు వ్యక్తమవుతున్నాయి.**



ఈ ఆరోపణల్లో, యూనియన్ ప్రభుత్వం నుంచి పన్నుల వాటాకు సంబంధించి నిధుల బదిలీ విషయంలో వివక్ష ఉందనటానికి ఆధారాలు లేవు. ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ఆయా రాష్ట్రాలకు ఇవి విధిగా బదిలీ అవుతున్నాయి. అదే విధంగా కేంద్ర పథకాలకు సంబంధించి, రాజ్యాంగబద్ధ సంస్థ కాగ్ నివేదికలు, రాష్ట్రాలు సకాలంలో సమర్పించే అధికారిక పత్రాలు వంటి వాటి ఆధారంగానే నిధుల విడుదల జరుగుతోంది. ఈ విషయాన్ని ప్రభుత్వం కూడా లోక్‌సభలో విస్పష్టంగా తెలియచేసింది. అయితే పదిహేనవ ఆర్థిక సంఘం సిఫార్సుల వల్ల తమకు అన్యాయం జరిగిందని, పన్నుల వాటా పెంచాలని, సెస్సులు యూనియన్ ప్రభుత్వ విచక్షణకు పరిమితం కాకుండా వాటిల్లోనూ రాష్ట్రాలకు అధికారిక వాటా ఇవ్వాలని వంటి డిమాండ్లపై మాత్రం రాష్ట్రాల అభ్యంతరాలపై చర్చించటం అవసరమని నిపుణులు చెబుతున్నారు.

ఇక మిగిలినవాటిల్లో అత్యంత కీలకమైనది, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు తెచ్చుకోవటానికి యూనియన్ ప్రభుత్వం అనుమతులివ్వటం. ఈ అప్పులపై జాతీయ స్థాయి ప్రభుత్వం పరిమితులు విధిస్తుండటం తరచూ వివాదాస్పదమవుతోంది.

ఎన్.టి రామారావు, బిజూపట్నాయక్, కరుణానిధి, రామకృష్ణ హెగ్డే తదితర నేతల చొరవతో 1980వ దశకం నుంచి దేశంలో ఫెడరలిజం బలపడి రాష్ట్రాలకు స్వయంనిర్ణయాధికారం గణనీయంగా పెరిగాక పలు వివాదాలు సద్దుమణిగినా, రాష్ట్రాల ఆర్థిక నిర్వహణపై యూనియన్ ప్రభుత్వ జోక్యంపై ఎన్నడూలేని విధంగా ఇటీవల ఆరోపణలు పెరిగాయి. వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ప్రభుత్వానికి స్పష్టమైన మెజారిటీ లేకున్నా, పలు రాష్ట్రాలలో ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నా అందరినీ ఒప్పించి బడ్జెట్ క్రమశిక్షణ కోసం 2003లో ఎఫ్ఆర్‌బీఎం చట్టం తెచ్చారు. అన్ని రాష్ట్రాలూ ఈ చట్టాన్ని అసెంబ్లీలో చేశాయి. రాష్ట్రాలు సొంతంగా అప్పులు తెచ్చుకుంటుంటే, యూనియన్ ప్రభుత్వం పెత్తనమేంటని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆ సమయంలో విమర్శలు చేసినా, అది అవగాహనా రాహిత్యమని, రాష్ట్రాల అప్పుల్ని నియంత్రించాల్సిన బాధ్యత యూనియన్ ప్రభుత్వానికి ఉందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ స్పష్టంగా తెలియచెప్పటంతో ఆ వివాదం సద్దుమణిగింది.

అప్పట్నుంచి రాష్ట్రాలు ఒక మేర ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ వస్తున్నాయి. ఆ తర్వాత ఆదాయాలు పెరిగినా, ఎన్నికల రాజకీయంలో పోటీ పెరిగి ఓటర్లను ఆకర్షించటానికి ఉన్నకొద్దీ భారీ తాత్కాలిక పథకాలను పోటాపోటీగా ప్రకటించటం మొదలైంది. దీనికితోడు ఓట్ల కొనుగోలుకి, అధికారాన్ని కాపాడుకోవటానికి ఎమ్మెల్యేల కొనుగోలు వంటి చర్యలకు, అధికార కేంద్రీకరణలో భాగంగా వ్యక్తిగత ప్రచారానికి భారీగా లెక్కలుచూపని డబ్బు అవసరమైంది. ఇందుకోసం కమీషన్లకు వీలుగా అసంబద్ధ భారీ ప్రాజెక్టులు వంటివి ప్రభుత్వ రాజకీయంగా మారింది. ఈ మొత్తం కారణాల వల్ల పలు రాష్ట్రాల్లో ఆర్థిక వ్యయం అదుపుతప్పటం మొదలైంది.

ముఖ్యంగా 2014 ఎన్నికల నుంచి ఉచితాల హామీలు విపరీతమవటంతో మెరుగైన రాష్ట్రాల్లో కూడా డబ్బుల కటకట మొదలైంది. అప్పుల కోసం వెతుకులాట ఎక్కువైంది. రాష్ట్రాల అప్పులకు యూనియన్ ప్రభుత్వం నుంచి అనుమతి

తీసుకోవాల్సిరావటం ఒక ప్రతిబంధకంగా కనిపించసాగింది. 2019లో కొవిడ్ వచ్చి లాక్‌డౌన్ విధించటంతో ఆర్థిక వ్యవస్థ స్తంభించిన నేపథ్యంలో రాష్ట్రాల ఆర్థిక నిర్వహణలో యూనియన్ జోక్యం, రాష్ట్రాలకు బదిలీ చేసే నిధుల వాటా చర్చ తీవ్రమైంది. ఈ సందర్భంగా రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ దేశాల నుంచి ఆర్థిక వేత్తల నుంచి విపరీత ఒత్తిడి వచ్చినా, యూనియన్ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తూ కొవిడ్ కాలంలో చేసిన సుమారు రూ.25 లక్షల కోట్ల ఉద్దీపన వ్యయంలో మౌలిక వసతులు, ఉత్పాదక రుణాలకు ప్రాధాన్యత, ఆహారధాన్యాల సరఫరా వంటి సంక్షేమ చర్యలకు తప్ప నగదు బదిలీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వలేదు. అది సరైన నిర్ణయమని ఆ తర్వాత ద్రవ్యోల్బణం, అభివృద్ధి గణాంకాలు వెల్లడించాయి. అదేవిధంగా ఎఫ్ఆర్‌బీఎం చట్ట పరిధిలో రాష్ట్రాల ద్రవ్యలోటు 3% మించకూడదు. కానీ కొన్ని ప్రగతిశీల విధానాల అమలు షరతుతో ద్రవ్యలోటును పరిమితిని 3.5% మేర పెంచి అప్పులు చేసుకునేందుకు యూనియన్ ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. అయితే అధికారమే సర్వస్వమైన దేశం కావటంతో యూనియన్ ప్రభుత్వ షరతుల అంశం పార్టీ రాజకీయ రంగు పులుముకుని చర్చ బదులు రచ్చ చోటు చేసుకుంది. యూనియన్‌లో అధికార పార్టీ/ కూటమికి వెలుపల ఉన్న పార్టీల ప్రభుత్వాలున్న చాలా రాష్ట్రాలు ఈ రకమైన ఆందోళనలను తీవ్రం చేశాయి. రాష్ట్రాల అప్పులపై జాతీయ స్థాయి ప్రభుత్వ నియంత్రణపై విమర్శనల్ని తీవ్రతరం చేశాయి.

రాష్ట్రాల అప్పులపై యూనియన్ జోక్యానికి వ్యతిరేకంగా పోరాటంలో మిగతా రాష్ట్రాల కంటే కేరళ ఒక అడుగు ముందుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 293 కింద తనకున్న పర్యవేక్షణ అవకాశాన్ని యూనియన్ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తూ రాష్ట్రాలు తెచ్చుకునే అప్పులపై 'ఏకపక్షంగా' పరిమితులు విధిస్తోందన్న కేరళ ప్రభుత్వ వాదనకు తమిళనాడు రాష్ట్రం సంఘీభావం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి స్టాలిన్ కేరళ సీఎం పినరయి విజయన్‌కి లేఖ రాశారు. భారత ప్రభుత్వ సంచిత నిధి నుంచి గ్యారంటీతో ఎంతవరకు అప్పు తెచ్చుకోవచ్చో నిర్ణయించే అధికారాన్ని రాష్ట్ర అసెంబ్లీకి ఈ అధికరణం ఇస్తుంది. అయితే యూనియన్ నుంచి ముందస్తు ఆమోదం ఉండాలన్న నిర్దేశాన్ని జాతీయ స్థాయి ప్రభుత్వం నిర్బంధ నిబంధనగా మార్చిందని స్టాలిన్ విమర్శించారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం నిర్దేశించిన పరిధిని దాటి లోటు భర్తీకి అప్పులు చేయాలంటే అడ్డుకుంటోందన్నారు. దీనివల్ల, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఆర్థిక ఫెడరలిజం ప్రమాదంలో పడిందన్నారు.

పదిహేనవ ఆర్థిక సంఘం సిఫార్సుల వల్ల తమకు బదిలీ అయ్యే నిధులు తగ్గటంతోపాటు, అప్పులు తెచ్చుకోకుండా యూనియన్ ప్రభుత్వం పరిమితులు విధించిందని మూడు దక్షిణాది రాష్ట్రాలూ ఆరోపించాయి.

కేరళ అప్పు తెచ్చుకోగలిగిన అదనపు నిధులపై పరిమితి విధించాలన్న యూనియన్ ప్రభుత్వ నిర్ణయంపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టికల్ 131 కింద డిసెంబర్‌లో సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేసింది. ఆర్థిక ఫెడరలిజం సూత్రాలను యూనియన్ ప్రభుత్వం ఉల్లంఘించినట్లు అందులో వాదించింది. అప్పులపై పరిమితి తగ్గించటం రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుందని తెలిపింది.

**కేరళ పిటిషన్ – కొన్ని ప్రధానాంశాలు**

రాష్ట్ర జీఎస్‌డీపీలో 1% మేర అదనంగా అప్పు తెచ్చుకోవటానికి 2023–24కి నిర్దేశించిన ఆర్థిక పరిమితికి అదనంగా అనుమతి ఇవ్వాలని యూనియన్ ప్రభుత్వాన్ని కోరినట్లు కేరళ ప్రభుత్వ న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. తక్షణ ఆర్థిక అవసరాలకు రాష్ట్రానికి రూ.26,000 కోట్లు అవసరమన్నారు. దీనిపై యూనియన్‌తో కేరళ ప్రభుత్వం చర్చించినా సానుకూలంగా స్పందించలేదని తెలిపారు.

ఇతర రాష్ట్రాలకు విద్యుత్ సంస్కరణలకు సంబంధించి రూ.5000 కోట్లు ఇస్తుంటే, యూనియన్‌పై వ్యాజ్యం దాఖలు చేసిందని కేరళకు ఆ నిధుల్ని ఆపారని వాదించారు.

కేరళ విషయంలో అధిక అప్పు విద్య, ఆరోగ్యంలో వ్యయం వల్ల అవసరమైంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మేం మానవాభివృద్ధి సూచిలో ముందున్నాం. వందశాతం అక్షరాస్యత సాధించాం. యూనియన్ నుంచి అదనపు డబ్బు రాకపోతే రాష్ట్రం దివాలా తీస్తుంది. రాజ్యాంగపరంగా ఆర్థిక ఎమర్జెన్సీని ప్రకటించాల్సిరావచ్చు అని న్యాయవాది తెలిపారు.

బహిరంగ మార్కెట్ సహా అన్ని రకాల మార్గాల నుంచి రాష్ట్రం అప్పులు తెచ్చుకోవటంపై నికర పరిమితిని నియంత్రించటంతోపాటు రాజ్యాంగంలోని ఆర్టికల్ 293 పరిధిలోకి రాని అంశాలను చేర్చటం ద్వారా అప్పు తీసుకునే అవకాశాన్ని మరింత పరిమితం చేసిందని కేరళ తెలిపింది. ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి చేసిన కొన్ని సవరణలు కూడా రాష్ట్ర అప్పులకు అవరోధంగా మారాయి.

రాష్ట్రం తెచ్చుకునే అప్పులపై ఆర్టికల్ 293 (3), 293 (4) కింద నియంత్రించే, జోక్యం చేసుకునే, అడ్డుకునే, పరిమితం చేసే, ఏ రకమైన షరతులను విధించే, ఆదేశాలనిచ్చే హక్కు, అధికారం యూనియన్ ప్రభుత్వానికి లేదు. రాజ్యాంగేతర రీతిలో వ్యవహరిస్తూ, రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ యూనియన్ ప్రభుత్వం వ్యవహరిస్తానంటే సాధ్యమవుతుందా? అటువంటి జోక్యం వల్ల వార్షిక బడ్జెట్‌లలో ఇచ్చిన హామీల్ని రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చుకోలేకపోతున్నాయి. ఆర్టికల్ 293(2) కింద తాను ఇచ్చిన అప్పులు లేదా గ్యారంటీ ఇచ్చిన అప్పుల విషయంలో మాత్రమే యూనియన్ ప్రభుత్వం జోక్యం చేసుకోగలదు.

రాష్ట్రాల అప్పుల్ని యూనియన్ నియంత్రించలేదు, కేరళ అప్పులపై పరిమితి విధించటానికి యూనియన్ ప్రభుత్వం చేస్తున్న వాదనలు తప్పు, విపరీత వ్యాఖ్యానాలు అని వాదించింది.

దేశం మొత్తం అప్పుల్లో 60% దాకా యూనియన్ ప్రభుత్వానివేనని అఫిడవిట్‌లో కేరళ ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రాలన్నిటి అప్పులూ కలిపితే దేశం అప్పుల్లో 40% మాత్రమే. 2019-23 మధ్యకాలంలో యూనియన్, రాష్ట్రాల మొత్తం అప్పుల్లో కేరళ వాటా కేవలం 1.70-1.75 %. కాబట్టి రాష్ట్రాలన్నీ ఆర్థికంగా దివాలా తీస్తాయి, దేశ ఆర్థిక వ్యవస్థ మీద ప్రతికూల ప్రభావం చూపుతాయి అనే వాదన వాస్తవ విరుద్ధం, మితిమీరిన ఊహాగానం, లోతైన పరిశీలన లేకుండా వివిధ అంశాల మధ్య యధాలాపంగా చేసిన సూత్రీకరణ. ఈ నేపథ్యంలో:

1) యూనియన్ పర్యవేక్షణ లేకుంటే రాష్ట్రాలు అనివార్యంగా ఇష్టారాజ్యం అప్పులు తెచ్చుకుంటాయనేది సరికాదు

2) రాష్ట్రాల అప్పులు మార్కెట్ శక్తుల నేతృత్వంలో ఉంటాయి. ఇష్టమొచ్చినట్లు నిర్లక్ష్యంగా అప్పులు తెచ్చుకునే అవకాశాన్ని మార్కెట్ ఇవ్వదు

3) తమ శాసనసభలు నిర్దేశించిన ద్రవ్య నిబంధనలకనుగుణంగానే రాష్ట్రాలు అప్పులు తెచ్చుకోగలుగుతాయి

రాష్ట్రాలకు ఆర్థిక వనరులు అందుబాటులో ఉండటంలో యూనియన్ ఆర్థిక ఆరోగ్యం కూడా కీలక పాత్ర పోషిస్తుంది, ఆర్థిక వ్యవస్థపై విస్తృత, దీర్ఘకాల ప్రభావం చూపుతుంది.

యూనియన్ ప్రభుత్వానికి అప్పుల నియంత్రణలో అంతర్జాతీయంగా తక్కువ రేటింగ్ ఉంది. యూనియన్‌కి ఉన్న రేటింగ్ వల్ల అంతర్జాతీయంగా రాష్ట్రాల పరపతి రేటింగ్‌పై ప్రతికూల ప్రభావం పడుతోంది. కేరళ మౌలిక వసతుల పెట్టుబడుల బోర్డు విదేశీ వాణిజ్య రుణాల ద్వారా అప్పు సమీకరించాలనుకున్నప్పుడు, జాతీయ స్థాయి ప్రభుత్వానికి ప్రపంచ మార్కెట్‌లో ఉన్న తక్కువ రేటింగ్‌కు అనుగుణంగానే రేటింగ్ ఇచ్చింది అని కేరళ సర్కార్ వాదించింది.

యూనియన్ ప్రభుత్వం అందించిన నిర్దిష్ట రుణాల షరతులకు సంబంధించినవి మినహాయించి రాష్ట్రాల మిగిలిన అప్పులకు సంబంధించి యూనియన్ అధికారాలను కుదించాలన్నది కేరళ ప్రభుత్వ పిటిషన్ లక్ష్యం. ఈ ఏడాది ప్రారంభంలో పంజాబ్ ఇదే తరహా వాదన వినిపించింది. ఆహారధాన్యాల సేకరణపై చట్టబద్ధ ఛార్జీల రీఇంబర్స్‌మెంట్‌కి యూనియన్ ప్రభుత్వం తిరస్కరించటంపై ఆ రాష్ట్రం విమర్శ చేసింది. రాష్ట్రం రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తున్నా మార్కెట్, గ్రామీణాభివృద్ధి ఫీజుల్ని యూనియన్ బదిలీ చేయటం లేదని వాదించింది.

**యూనియన్ ప్రభుత్వ వాదనలు**

పంజాబ్, పశ్చిమ బెంగాల్‌తోపాటు ఆర్థిక నిర్వహణలో దేశంలోనే అధ్వాన్నంగా ఉన్న రాష్ట్రం కేరళ అని అటార్నీ జనరల్ వాదించారు. కేరళ ప్రభుత్వ వ్యయం గణనీయంగా పెరుగుతోంది. 2018-19 మధ్య రాష్ట్ర వ్యయం రెవెన్యూ ఆదాయంలో 78% దాకా ఉంది. ద్రవ్య లోటు 2017లో 2.4 % నుంచి 2021-22లో 3.1 %కి పెరిగింది. పెట్టుబడులు, లాభదాయక మౌలిక వసతులు వంటి ఆస్తులు పెంచేందుకు కాకుండా అప్పు తెచ్చిన డబ్బుని రాష్ట్రం జీతాలు, పెన్షన్లు వంటి రోజువారీ ఖర్చులకు ఉపయోగిస్తోంది.

12వ ఆర్థిక సంఘం నుండి 15వ సంఘం వరకు వరుస ఫైనాన్స్ కమిషన్లు కేరళ ఆర్థిక ఆరోగ్యంపై ప్రతికూల అభిప్రాయాల్ని వ్యక్తం చేశాయి. కేరళ ఆర్థికంగా అనారోగ్యకర రాష్ట్రాల్లో ఒకటని, నిర్వహణలో అనేక లొసుగులు ఉన్నాయని ఆర్థిక సంఘాలు, కాగ్, ఆర్‌బీఐ నివేదికలను చూపుతూ అటార్నీ జనరల్ తెలిపారు.

అప్పులు పెరిగి ఒక రాష్ట్రం దివాలా తీస్తే అంతర్జాతీయంగ దేశ ప్రతిష్టకు భంగం కలుగుతుంది, దేశ పరపతి రేటు ప్రమాదంలో పడుతుంది. కొన్ని రాష్ట్రాల వల్ల యూనియన్ ప్రభుత్వ క్రెడిట్ రేటింగ్ దెబ్బతింటోంది.

అనుత్పాదకమైన, పెద్దగా ప్రయోజనం చేకూర్చని సంక్షేమ పథకాల అమలు కోసం రాష్ట్రాలు భారీగా అప్పులు చేయటం వల్ల మార్కెట్‌లో ప్రయివేటు అప్పుల లభ్యత కూడా తగ్గిపోతుంది. ఫలితంగా ప్రయివేటు పరిశ్రమలకు అప్పులు తీసుకోవాలంటే వడ్డీలు అధికమవుతాయి. మార్కెట్‌లో వస్తువులు, సేవల ఉత్పత్తి, సరఫరాపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుంది. దీనివల్ల రాష్ట్రాల ఆదాయాలు, తద్వారా జాతీయ ఆదాయం దెబ్బతింటుంది. 293 (4) అధికరణం కింద రాష్ట్రాలు ఎక్కడ్నుంచి అప్పు తెచ్చుకోవాలన్నా యూనియన్ అనుమతి ఉండాలి. దేశ సూక్ష్మ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సమగ్రంగా అంచనా వేసి రాష్ట్ర అప్పు పరిమితిని జాతీయ స్థాయి ప్రభుత్వం నిర్ణయిస్తుంది.

ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు పారదర్శకంగా, వివక్ష లేకుండా రూపొందించిన నిబంధనలకనుగుణంగా రాష్ట్రాల అప్పుల పరిమితులపై యూనియన్ నిర్ణయం ఉంటుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేరళ అప్పు పరిమితిని రూ.47,762.58 కోట్లుగా యూనియన్ ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో రూ.29,136.71 కోట్లు బహిరంగ మార్కెట్ ద్వారా సేకరించుకోవచ్చని, మిగతావి ఇతర మార్గాల ద్వారా సమీకరించుకోవచ్చని తెలిపింది. కేరళ అప్పులు రూ.32,000 కోట్లకు పరిమితం కావాల్సి ఉండగా, రూ.49,000 కోట్ల వరకు

**యూనియన్ ప్రభుత్వం అందించిన నిర్దిష్ట రుణాల షరతులకు సంబంధించినవి మినహాయించి రాష్ట్రాల మిగిలిన అప్పులకు సంబంధించి యూనియన్ అధికారాలను కుదించాలన్నది కేరళ ప్రభుత్వ పిటిషన్ లక్ష్యం. ఈ ఏడాది ప్రారంభంలో పంజాబ్ ఇదే తరహా వాదన వినిపించింది. ఆహారధాన్యాల సేకరణపై చట్టబద్ధ ఛార్జీల రీఇంబర్స్‌మెంట్‌కి యూనియన్ ప్రభుత్వం తిరస్కరించటంపై ఆ రాష్ట్రం విమర్శ చేసింది. రాష్ట్రం రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తున్నా మార్కెట్, గ్రామీణాభివృద్ధి ఫీజుల్ని యూనియన్ బదిలీ చేయటం లేదని వాదించింది.**

అనుమతించామని అదనపు సొలిసిటర్ జనరల్ తెలిపారు. నిజమైన ఫెడరలిజం స్ఫూర్తితో కేరళ వ్యాజ్యాన్ని ఉపసంహరించుకోవాలని యూనియన్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

**యూనియన్ ప్రభుత్వానికి బాధ్యత ఉందన్న సుప్రీంకోర్టు**

రాష్ట్రాల ఆర్థిక నిర్వహణ లోపభూయిష్టంగా ఉంటే అది జాతీయ స్థాయి ఆర్థిక వ్యవస్థ మీద కూడా ప్రభావం చూపుతుందని, కాబట్టి రాష్ట్రాల ద్రవ్య నిర్వహణను పట్టించుకోవాల్సిన అవసరం యూనియన్ ప్రభుత్వానికి కూడా ఉంటుందని వాదనలు విన్న అనంతరం మార్చి మొదటివారంలో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రుణ సేకరణపై పరిమితి విధింపు విషయంలో తమ మధ్య నెలకొన్న విభేదాలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని కేరళ, యూనియన్ ప్రభుత్వాలకు సూచించింది. వ్యాజ్యం పెండింగ్‌లో ఉన్నంత మాత్రాన చర్చలు, సంప్రదింపులు నిలిపివేయవద్దని ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఉభయ పక్షాలకూ హితవు పలికింది. నిర్ణయం తీసుకోవటంలో భాగస్వాములైన సీనియర్ అధికారులందరూ సమస్య పరిష్కారానికి యత్నించాలని తెలిపింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉన్నప్పటికీ యూనియన్ ప్రభుత్వ వైఖరి వల్ల అది సాధ్యం కావటం లేదని కేరళ తెలిపింది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాష్ట్రానికి తక్షణ ఉపశమనం అవసరమని తెలిపింది. అదనపు రుణ సేకరణకు విధించిన షరతులను యూనియన్ ప్రభుత్వం ఎత్తివేసేలా ఆదేశించాలని కోరింది. యూనియన్ అధికారాన్ని ప్రశ్నిస్తూ కేరళ దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటేనే రాష్ట్ర అభ్యర్థనను పరిశీలిస్తామంటూ అదనపు సొలిసిటర్ జనరల్ అంతకుముందు అందచేసిన నోట్‌పై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. పిటిషన్ ఉపసంహరణకు యూనియన్ ఒత్తిడి తేవటం సరికాదని పేర్కొంది. రాజ్యాంగ అధికరణం 131 ప్రకారం రాష్ట్రానికి ఆ హక్కు ఉందని స్పష్టం చేసింది. ద్రవ్య లోటు నివారణకు, ఆర్థిక సుస్థిరతకు భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోందని అదనపు సొలిసిటర్ జనరల్ తెలుపగా, ఈ అభిప్రాయంతో తాము ఏకీభవిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. న్యాయ సదస్సుల కోసం విదేశాలకు వెళ్లినప్పుడు భారత ఆర్థిక సుస్థిరతకు సంబంధించిన ప్రస్తావనకు తమ దృష్టికీ వచ్చాయని పేర్కొంది. యూనియన్, కేరళ రాష్ట్ర అధికారులు మరోసారి వెంటనే సమావేశమై చర్చించాలని సూచించింది.

**అయిదుగురు సభ్యుల ధర్మాసనానికి**

అనంతరం ఏప్రిల్ 1న కేరళ ప్రభుత్వం పిటిషన్‌ను అయిదుగురు సభ్యుల ధర్మాసనానికి కోర్టు నివేదించింది. రాష్ట్రాల రుణ సేకరణ 293 అధికరణ పరిధిలోకి వస్తుందని, దీనిపై సుప్రీంకోర్టు ఇంతవరకు సాధికార భాష్యమేదీ ఇవ్వలేదని ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. యూనియన్ నుంచి గానీ, మరే ఇతర సంస్థల నుంచి గానీ నిర్దేశిత పరిమితికి మించి రుణాలు తీసుకునే హక్కు ఉందా? అన్నది తేల్చే బాధ్యతను అయిదుగురు సభ్యుల ధర్మాసనానికి అప్పగించాలని తీర్మానించింది.

**అంబేద్కర్ రాజ్యాంగంలో ముందుచూపుతో ఏర్పాటు చేశారు..**

**యూనియన్ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం తరహా చట్టం తేవాలి**

అమెరికాలాంటి దేశాల్లో కొన్ని నగరాలు దివాలా తీసిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు, ఉద్యోగులు, ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఉద్యోగి సర్వీసు కాలంలో జమ చేయకుండా నిరంతరం భారీగా పెరుగుతూ ప్రజల పన్నుల డబ్బు మీద, భావి తరాల మీద అన్యాయమైన భారం వేసే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు వల్ల అక్కడ డెట్రాయిట్ నగరం దివాలా తీసింది. కానీ భారత్‌లో అలా కాదు. రాష్ట్రం దివాలా తీయటం ఉండదు, రాష్ట్రాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతే దేశం దివాలా తీస్తుంది. రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు యూనియన్ ప్రభుత్వ పరిధిలో ఉంచారు. తమ వనరుల్ని తమ నిర్ణయాలకనుగుణంగా ఖర్చు చేసుకునే హక్కు రాష్ట్రాలకు ఉంది. అయితే తాత్కాలిక, అనుత్పాదక పథకాలు, ఓపీఎస్ వంటి అసంబద్ధ పథకాలతో అభివృద్ధిని పణంగా పెట్టి రోజువారీ ఖర్చులకు కూడా అప్పులు చేస్తుంటే యూనియన్ ప్రభుత్వం నియంత్రించటానికి ఆర్టికల్ 293ని అంబేద్కర్ ఎంతో ముందుచూపుతో రాజ్యాంగంలో ఏర్పాటు చేశారు.

రిజర్వేషన్లు కావచ్చు, మరో ఉపశమనం కావచ్చు, అంబేద్కర్ తాత్కాలిక అవసరాలకి, దీర్ఘకాలిక ప్రయోజనాలకి మధ్య చాలా సమతుల్యతను పాటించారు. ప్రజాస్వామ్య మనుగడకు ఆర్థికాభివృద్ధిని అత్యంత కీలకాంశంగా గుర్తించారు. ఆర్టికల్ 293తోపాటు రాష్ట్రాల్లో తీవ్ర ఆర్థిక సంక్షోభం తలెత్తితే, ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించి ఉద్యోగుల జీతాల దగ్గర్నుంచి మిగతా అన్ని రకాల ప్రభుత్వ వ్యయాన్నీ నియంత్రించేలా ఆర్థిక ఎమర్జెన్సీని ప్రకటించే అధికారం యూనియన్‌కు కల్పించారు. ఇందుకోసం ఆర్టికల్ 360ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో జేపీ కొన్నేళ్లుగా చెబుతున్నట్లు, రాష్ట్రాల అప్పుల్ని నియంత్రించే బాధ్యత యూనియన్‌కు ఉందన్నది సుస్పష్టమైనా ఆర్టికల్ 293 ద్వారా రాష్ట్రాల ఆర్థిక క్రమశిక్షణను అభివృద్ధి దిశగా పరిరక్షణను ఇప్పటిదాకా యూనియన్ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. యూనియన్ సవ్యంగా పట్టించుకుంటే కొన్ని రాష్ట్రాలు ఇష్టారాజ్యం అప్పులు తెచ్చుకునేందుకు గ్యారంటీలు ఎలా వచ్చేవి?

కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలు సంక్షేమం పేరుతో మితిమీరి తాత్కాలిక పథకాలు, దుబారా వల్ల అప్పుల్లో కూరుకుపోయాయి. కర్ణాటక ఆర్థికంగా బలమైన రాష్ట్రమైనా ఇటీవల భారీ తాత్కాలిక పథకాల వల్ల సంకట స్థితిని ఎదుర్కొంటోంది. ఇప్పటికైనా యూనియన్ ఈ విషయంలో కళ్లు తెరవాలి. ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని కచ్చితంగా అమలు చేయటంతోపాటు అప్పులు చేసిన డబ్బు జీతభత్యాలు, పెన్షన్లు, తాత్కాలిక పథకాలు వంటి రోజువారీ ఖర్చులకు

మళ్లించకుండా చట్టం తీసుకురావాలి. అప్పు చేసిన డబ్బు పూర్తిగా పెట్టుబడులు, భవిష్యత్ అవసరాలకే ఉపయోగించాలి.
ఈ చట్టం కేవలం రాష్ట్రాలకే కాకుండా యూనియన్ ప్రభుత్వానికి కూడా వర్తించాలి. వచ్చే పాతికేళ్లలో భారత్ ప్రపంచ అగ్రస్థాయి దేశంగా ఎదిగేందుకు ఒక గొప్ప అవకాశం అందుబాటులో ఉంది. ఆ అవకాశాన్ని సద్వినియోగం గావించుకోవాలంటే మనం తప్పులు చేయకుండా, కొన్ని రంగాల్లో సరైన చర్యలు తీసుకుంటే చాలు. మనం చేయవలసిన పనుల్లో అత్యంత కీలకమైనది ఆర్థికాభివృద్ధిని పరిరక్షించుకోవటం. తప్పులు చేయకుండా సమతూకాన్ని పాటిస్తే ఏటా 7-8 శాతం వృద్ధి రేటును పాతికేళ్లపాటు చైనా తరహాలో నిరంతరాయంగా సాధించగలం.
ప్రజాస్వామ్యంలో, అందునా మనలాంటి దేశంలో సంక్షేమం తప్పనిసరి. అయితే ఆ సంక్షేమం కోసం అమలు చేసే తాత్కాలిక పథకాలు ప్రజలకు తక్షణ ఉపశమనం కలిగించటంతోపాటు నిజంగా ప్రయోజనం కలిగించే విధంగా, భవిష్యత్తులో వారు స్వావలంబన సాధించటానికి తోడ్పడే విధంగా ఉండాలి. వీటికి కేటాయించే డబ్బు ప్రజలు శాశ్వత ప్రాతిపదికన ఎదిగేందుకు, వారి కుటుంబాలు ఎవరినీ అర్థించాల్సిన అవసరం లేకుండా సొంతంగా సమాజానికి ఉపయోగపడుతూ సంపాదించుకోగలిగేందుకు ప్రభుత్వం నిర్వర్తించాల్సిన బాధ్యతలకు, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల నిధులకు గండి కొట్టకూడదు. ఈ సమతూకానికి ఏర్పాటు ఎంత త్వరగా చేస్తే మన దేశాభివృద్ధికి భరోసా అంత వేగంగా లభిస్తుంది.

**రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తే రాజకీయంగా నష్టపోతాయన్న వాదన అసంబద్ధం. ఉదాహరణకి, పేద రాష్ట్రమైన ఒడిశా, వెనుకబడిన రాష్ట్రంగా ఉన్న ఉత్తరప్రదేశ్ సంక్షేమాన్ని సమర్థంగా అమలు చేస్తూనే, పెట్టుబడులను ప్రోత్సహిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూనే ఆర్థికంగా క్రమశిక్షణ పాటిస్తున్నాయి , బడ్జెట్‌లో మిగులును చూపిస్తున్నాయి.**

రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తే రాజకీయంగా నష్టపోతాయన్న వాదన అసంబద్ధం. ఉదాహరణకి, పేద రాష్ట్రమైన ఒడిశా, వెనుకబడిన రాష్ట్రంగా ఉన్న ఉత్తరప్రదేశ్ సంక్షేమాన్ని సమర్థంగా అమలు చేస్తూనే, పెట్టుబడులను ప్రోత్సహిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూనే ఆర్థికంగా క్రమశిక్షణ పాటిస్తున్నాయి, బడ్జెట్‌లో మిగులును చూపిస్తున్నాయి. అప్పులు చేసి తాత్కాలిక పథకాలు, పందేరాలు చేయకపోవటం వల్ల అక్కడ అధికార పార్టీలేమీ ఎన్నికల్లో ఓడిపోవటం లేదు. ఆ రాష్ట్రాల నుంచి నేర్చుకోకుండా తాత్కాలిక పథకాలనే పరిపాలనగా మార్చేసి దానికి సంక్షేమం అని ముసుగు వేసుకోవటం అసమర్థ రాజకీయం, ప్రజలను దగా చేయటం అవుతుంది తప్ప నాయకత్వం అవదని ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు గుర్తించాలి.
అదేవిధంగా యూనియన్ రుణాల్ని రాష్ట్రాల రుణాలతో పోల్చటం తగదు. కచ్చితంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో రుణాలు అవసరమవుతాయి. భారత ప్రభుత్వం చేసిన రుణాలను ఈ నేపథ్యం నుంచి చూడాలి. ఆ రుణాలు మన ఆర్థిక స్తోమతుకు తగ్గట్లు ఉన్నాయా, అదే విధంగా తెచ్చిన రుణాల్ని సద్వినియోగం చేస్తున్నారా, అంటే అప్పు చేసి పప్పుకూడు కాకుండా అభివృద్ధి కోసం వినియోగిస్తున్నారా అన్నవి పరిశీలించటం ముఖ్యం. ఆ కోణంలో చూస్తే యూనియన్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తోంది. సుస్థిరావృద్ధి కోసం నిధుల్ని సద్వినియోగం చేస్తోంది. కాబట్టి కేరళ ఆరోపణ అసంబద్ధం. అయితే యూనియన్ అప్పులు కూడా అంతర్జాతీయంగా ప్రభావం చూపుతాయి కాబట్టి, రాజకీయ విమర్శలకు ఆస్కారం లేకుండా, రాజకీయాలకు అతీతంగా క్రమశిక్షణ పాటించేలా రాష్ట్రాలకు వర్తించే రోజువారీ ఖర్చులకు అప్పులు చేయకూడదు అనే చట్టం యూనియన్‌కి కూడా వర్తించాలి.
ఫెడరలిజాన్ని విస్తరించే పోరాటంలో ఎన్.టి.ఆర్ కూడా మార్కెట్ రుణాల్లో రాష్ట్రాల వాటా పెంచాలని యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే చట్టబద్ధ ఏర్పాట్లను ఏనాడూ ఉల్లంఘించలేదు. యూనియన్ పాత్రను తోసిపుచ్చలేదు. అదేవిధంగా భారత ప్రభుత్వంపై సుప్రీంకోర్టులో కేరళతోపాటు ఇటీవల కరవు నిధుల సాయానికి సంబంధించి కర్ణాటక ప్రభుత్వం కూడా ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. అత్యున్నత న్యాయస్థానానికెళ్లే హక్కు రాష్ట్రాలకుంది. కానీ పరిస్థితి అంతదాకా రాకుండా సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకునే పరిణతిని, సానుకూల వైఖరిని, పార్టీలకతీతమైన రాజనీతిజ్ఞతని యూనియన్, రాష్ట్రాలు ప్రదర్శించటం దేశానికి దీర్ఘకాలికంగా ఎక్కువ ప్రయోజనకరమని దేశహితం కోరేవారు సూచిస్తున్నారు. పరోక్షంగా సుప్రీంకోర్టు కూడా ఇదే మాట చెప్పింది. సహకార ఫెడరల్ స్ఫూర్తిని మన పాలకులు చేతల్లో పాటించాలి. తాత్కాలిక అవసరాల కోసం రాష్ట్ర, దేశ దీర్ఘకాల ప్రయోజనాల్ని తాకట్టు పెట్టకూడదు.
భారత్ ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశం కాబట్టి తాత్కాలిక పథకాలు వెర్రి తలలు వేయకుండా ఇప్పుడున్న మేరకు వాటిని పరిమితం చేసినా మనం అభివృద్ధిని కాపాడుకోగలం. ఇందు కోసం 293 అధికరణాన్ని యూనియన్ సమర్థంగా వినియోగించాలి. అందులోనూ ఎఫ్ఆర్‌బీఎం చట్టం, అప్పులు రోజువారీ ఖర్చులకు ఉపయోగించకుండా నియంత్రించే చట్టం సక్రమంగా అమలు చేయాలి. రెవెన్యూ లోటు లేకుండా చేయాలి. ఈ మేరకు చేస్తే, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమ తూకం సాధించగలం, యువ జనాభా సానుకూలతను పూర్తిగా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందిన దేశం కాగలం.

❖

# వానొస్తే వరదలు.. ఎండొస్తే మంచినీటి కరవు, హైదరాబాద్ సైతం మేలుకోవాలి

**మొత్తం భూమ్మీద ఉన్న నీటిలో కేవలం 3% మాత్రమే మంచినీరు కాగా, అందులో 0.4% మాత్రమే మానవాళి వినియోగించుకోవటానికి అనువైనది. జనాభా పెరుగుదల రేటు కన్నా నీటి వినియోగం రేటు రెట్టింపు ఉందని గత శతాబ్దంలోనే ఐక్యరాజ్యసమితి నివేదిక తెలిపింది. భారత్‌లో 2030 నాటికి నీటి అవసరాలు రెట్టింపు అవుతాయని 2018లో నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది. సరఫరా విషయంలో మెరుగుపడినా నీటి నిర్వహణ, సంరక్షణ విషయంలో ఇప్పటికీ మనం తాత్కాలిక ధోరణులతోనే వ్యవహరిస్తున్నాం తప్ప విజ్ఞత, ముందుచూపు పాటించటం లేదు. నీటి వనరుల సంరక్షణ అంతర్జాతీయ ఒప్పందంపై 1970లలోనే సంతకం చేసినా, ఇన్ని దశాబ్దాల్లో అందుకోసం సరైన చర్యలు తీసుకోలేదు.**




ఎంతో విలువైన, పరిమితమైన నీటి వనరు పట్ల మన నిర్లక్ష్యానికి మేఘాలయలోని చిరపుంజి గొప్ప ఉదాహరణ. అక్కడ రుతుపవన కాలంలో 11,430 మిల్లీమీటర్ల వర్షపాతం పడుతుందని అంచనా. అంటే, ఆ నీటిని ఒకచోట పేరిస్తే ఓ పెద్ద భవనమంత ఎత్తుంటుంది. అయితే వేసవికాలం వస్తే అక్కడ తాగటానికి సైతం నీటిని వెతుక్కోవలసి ఉంటుంది. వర్షం వస్తే వరదలు, ఎండలొస్తే నీటికి కటకట.

వాతావరణ మార్పుల వల్ల ఇటీవలికాలంలో మన దేశంలోని పలుచోట్ల కుంభవృష్టి కురుస్తోంది. వర్షపాతం తీరుతెన్నుల్లోని మార్పులు ప్రపంచవ్యాప్తంగా కొన్ని సమస్యల్ని సృష్టిస్తున్నా, మన దేశంలో సగటున చూస్తే అనావృష్టి కాకుండా అధిక వర్షం పడుతుండటం సానుకూల పరిణామం. అయితే ఈ పెరిగిన వర్షపాతమేమీ మహానగరాల్ని సైతం వరదల్లో ముంచెత్తేంత భయంకరమైనది కాదు. కనీస సౌకర్యాలు కల్పించలేని పాలనా వైఫల్యం వల్ల తప్ప ప్రకృతి వల్ల మన నగరాలు నీటి మునిగి జనజీవనాన్ని అస్తవ్యస్తం చేయటం లేదు. అదే వైఫల్యం వేసవి నీటిఎద్దడిలోనూ కనిపిస్తుంది. ఎంత వర్షం కురిసినా ఎండాకాలం చిరపుంజి తరహాలోనే తాగునీటి సమస్య ఎదురవుతుంటుంది. నీటి కొరత ఎదురైనప్పుడు తాత్కాలిక ప్రాతిపదికన స్పందించటం తప్ప, మౌలిక వసతులు, పాలనా పరంగా సరైన దిద్దుబాటు లేకపోవటం వల్ల మహానగరాల్ని నీటికొరత వెన్నాడుతోంది. బెంగళూరు తాజా ఉదాహరణ.

బెంగళూరు అయిదు శతాబ్దాలకు పైగా చరిత్ర గల నగరం. ఇప్పుడు దేశానికి ఐటీ రాజధానిగా ఉంది. దేశంలోనే అత్యంత సంపన్న మునిసిపాలిటీలలో ఒకటి. వాననీటిని ఒడిసిడుతూ ఎప్పటికప్పుడు ఎగువనీటితో ప్రక్షాళన చేసే రీతిలో వందల సరస్సులను తొలితరంలో అక్కడ స్థిరపడినవారు, ఆ తర్వాత వలసలు వచ్చినవారు నిర్మించుకున్నారు. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం వరకూ సరస్సులే అక్కడ మంచినీటికి ఆధారంగా ఉంటూ వచ్చాయి. కానీ ఆ తర్వాత జనాభా పెరగటంతోపాటు పైపుల ద్వారా నీటిని తెచ్చుకునే ఏర్పాటు ప్రారంభమవటంతో క్రమంగా సరస్సులను మంచినీటి వనరుగా వినియోగించటం పాతకాలపు పద్ధతిగా మారింది. ప్రాచీన శాసనాల్లో ఉన్న పెద్ద నీటి సరస్సులు కూడా అదృశ్యమై వాటి స్థానంలో భవనాలు, వాణిజ్య సముదాయాలు వెలిశాయి. 1974లో నగరానికి కావేరి నదీజలాల సరఫరా పథకాన్ని రూపొందించిన తర్వాత మంచినీటి బావుల, సరస్సుల ఆక్రమణ పెరిగింది. గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి లేకుండా కేంద్రీకృత నగరీకరణ నమూనాను అనుసరించటం వల్ల జనాభా అనేక రెట్లు పెరిగింది. ఇప్పుడు కోటిన్నరకు చేరి వేగంగా పెరుగుతోంది. దీంతో కావేరీ జలాల సరఫరా ఉన్నా కూడా మంచినీటి అవసరాలు తీరని పరిస్థితి. బెంగళూరులో వాల్‌మార్ట్ మొదలుకొని గూగుల్ వరకు పలు అంతర్జాతీయ సంస్థలున్నాయి. సగటున రోజుకు 185 కోట్ల లీటర్ల నీరు లభిస్తుండగా, కనీసం మరో 168 కోట్ల లీటర్లు అవసరమని అంచనా. మన పట్టణీకరణ నమూనాలోని లోపంతోపాటు నగరాల అభివృద్ధిలో కూడా ప్రణాళిక, శాస్త్రీయత కొరవడటం వల్ల కనీస మౌలిక వసతులు కూడా కరువయ్యాయి. దశాబ్దాలపాటు కేవలం అభివృద్ధిపై దృష్టి పెట్టి జీవావరణం, పర్యావరణాల్ని నిర్లక్ష్యం చేయటం వల్ల వర్షపాతం వంటివి కూడా ప్రభావితమయ్యాయి. దీనికితోడు వాతావరణ మార్పుల వల్ల వర్షపాత ఒడిదుడుకులు దీర్ఘకాల పరిణామంగా కనిపిస్తున్నా నగర పాలన అందుకు తగ్గట్లు వనరుల్ని పెంపొందించుకోవటం,

విస్తరించుకోవటానికి తగిన చర్యలు తీసుకోలేదు.

2016లో కర్ణాటకలో జరిగిన అంతర్జాతీయ సరస్సుల సదస్సు పట్టణ ప్రాంత అడవుల్ని, తడినేలల్ని డీనోటిఫై చేస్తున్నారని, దీనివల్ల బెంగళూరుకు నష్టం జరుగుతుందని హెచ్చరించింది. అయినా పచ్చదనం, చెరువుల పరిరక్షణ కోసం చురుగ్గా చర్యలు లేవు. 1960ల నాటికి నగరంలో 250కి పైగా మంచినీటి చెరువులుండగా, ప్రస్తుతం అవి 60కి చేరాయి. వీటిలో 30 పై చిలుకు మాత్రమే జీవంతో ఉన్నాయని, సీజనల్ సరస్సులు ఎండిపోగా, శాశ్వత సరస్సుల్లోని నీటిలో చాలామేర వినియోగానికి వీల్లేకుండా కలుషితమయ్యాయని అధ్యయనాలు చెబుతున్నాయి. పెరుగుతున్న జనాభా అవసరాలు, అభివృద్ధి, నీటి వనరుల పరిరక్షణ మధ్య సమతుల్యత పాటించటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తమై స్థానికంగా ఉండే చెరువుల్లోకి మురుగునీరు వదులుతుండటం వల్ల ఆ నీరుతోపాటు భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. మురుగునీటి పారుదల, శుద్ధి తగిన స్థాయిలో విస్తరించకపోవటంతో వలయ నీటి ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని పునర్వినియోగం పరిమితమై కాలుష్యం ఎక్కువైంది.

ఇటీవల కావేరీ పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గటంతో బెంగళూరు నగరానికి వచ్చే నీరు తగ్గింది. సరఫరా బాగున్న సమయంలో కూడా సరిపోక భూగర్భ జలాల వినియోగం, ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో పెద్దఎత్తున ఉండటంతో ఇప్పుడవి అడుగంటాయి. ప్రస్తుతం బెంగళూరులో 60% మంది ట్యాంకర్లపై ఆధారపడి ఉన్నారు. మితిమీరి నీటి వినియోగం, వృధాకు రూ.5,000 జరిమానా విధిస్తున్నారు. దీంతో ఐటీ సహా పలు సంస్థల కార్యాలయాలు వర్క్ ఫ్రం హోం అమలు చేస్తుండగా, రెస్టరెంట్లు వంటివి నీటి వినియోగం పెద్దగా అవసరంలేని పద్ధతుల్ని అవలంబించాయి.

ఆర్థికాభివృద్ధి కేంద్రం, ప్రముఖులకు నిలయం కాబట్టి బెంగళూరు గురించి ఎక్కువ చర్చ వస్తోంది కానీ, కర్ణాటకలో 7,000కి పైగా గ్రామాలు కూడా నీటిఎద్దడికి గురయ్యాయి. అదేవిధంగా నగరాలపరంగా ఈ సంక్షోభం కేవలం బెంగళూరుకు పరిమితం కాదు. దేశంలోని ప్రతి మహానగరం ఈ సంక్షోభం బారిన పడే పరిస్థితులున్నాయి. 2019లో చెన్నైకి రైల్వే వ్యాగన్ల ద్వారా నీటిని తరలించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ నేపథ్యంలోనే వేసవి తీవ్రంగా ఉండే అవకాశమున్నందున తాగునీటి సమస్య ముంచుకొస్తోందని, ఇప్పటి నుంచే అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జల సంరక్షణ చర్యలు చేపట్టని పక్షంలో హైదరాబాద్ నగరం కూడా మరో బెంగళూరులా మారి నీటి కటకట ఏర్పడవచ్చని హెచ్చరించింది. నీటి సంరక్షణకు పలు చర్యలను సూచించింది.

**హైదరాబాద్‌లో పరిస్థితి**

బెంగళూరులోలా హైదరాబాద్‌లోనూ సరైన పట్టణీకరణ ప్రణాళిక లేదు, ఉల్లంఘనలు ఎక్కువ, పర్యావరణ స్పృహ తక్కువ. వలసలు పెరుగుతున్నా విస్తరణ సవ్యంగా లేదు. కాస్త వర్షం కురిసినా వరద నీరు రోడ్ల మీద పారుతుంది. పెద్ద వర్షం పడితే నివాస ప్రాంతాలు మునిగిపోతుంటాయి.

- బెంగళూరు తరహా నీటి సంక్షోభం ఇక్కడ ఇప్పటికిప్పుడు వచ్చే పరిస్థితి లేదని అంచనాలు చెబుతున్నాయి. జలమండలి కూడా ఈ విషయమై ఓ ప్రకటన చేసింది. సంక్షోభం లేకున్నా హైదరాబాద్‌లో తాగునీటికి వేసవి మొదలయ్యాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తీవ్ర ఎండాకాలం ఇంకా రాకముందే జంట నగరాలకు మంచినీరు అందించే అయిదు ప్రధాన రిజర్వాయర్లలో మార్చి తొలినాళ్లలో నీటి అందుబాటు పోయిన సంవత్సరం కంటె రెండు టీఎంసీలు తక్కువగా ఉందని మీడియా రిపోర్టులు పేర్కొన్నాయి. నాగార్జునసాగర్‌లో గతేడాది ఇదేసమయానికి 200 టీఎంసీల నీరు విడుదలకు అందుబాటులో ఉండగా ఇప్పుడు కేవలం 140 టీఎంసీలు ఉంది. శ్రీశైలంలో పోయిన సంవత్సరం ఇదే సమయంలో 42 టీఎంసీలు విడుదలకు సిద్ధంగా ఉండగా, ఇప్పుడు కేవలం 36 టీఎంసీలు ఉంది.
- తగినంత నీటి సరఫరా లేకపోవటంతో అనేక ప్రాంతాల్లో తక్కువ పీడనతో నీటి సరఫరా జరుగుతోంది.
- 1985లో వర్షాభావం వల్ల హైదరాబాద్‌లో నీటికి కటకట ఏర్పడితే విజయవాడ నుంచి వ్యాగన్ల ద్వారా సరఫరా చేశారు. దీంతో పాలకులు తర్వాత సింగూరు రెండు, మూడు దశలు చేపట్టి అదనపు నీటిని సరఫరా చేశారు. అనంతరం కృష్ణా నాలుగు దశలు, గోదావరి నుంచి నీటిని తరలిస్తున్నారు. నాగార్జునసాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల ద్వారా దాదాపు 160-180 కిలోమీటర్ల నుంచి నగరానికి నీటిని తీసుకొస్తున్నారు. ఇందుకోసం విద్యుత్ ఛార్జీలకే నెలకు రూ.100 కోట్లు వెచ్చిస్తోంది. ఇంత విలువైన నీరు బిల్లులు చెల్లించగలిగేవారికి కూడా ఉచితంగా ఇచ్చి ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరించింది.
- అదేవిధంగా, హైదరాబాద్‌లో సరఫరా చేస్తున్న నీటిలో 20 శాతం లీకేజీలు, వాడకంలో వృధా అని జలమండలి గతంలో లెక్కేసింది. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రోజువిడిచి రోజు 2,547 మిలియన్ లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఇందులో 20 శాతం అంటే 509 మిలియన్ లీటర్లు. పైప్‌ల ద్వారా సరఫరా చేస్తున్న నీటి వృధా 40% వరకు ఉండొచ్చని నిపుణుల అంచనా. పాత పైపులైన్ల వ్యవస్థ, లీకేజీలు, సర్వీసు రిజర్వాయర్లు పొర్లి ప్రవహించటం, ఇంటి ముందు రహదారులను పైపులు పెట్టి కడగటం, పబ్లిక్ నల్లాలకు ట్యాప్‌లు లేకపోవటం తదితర కారణాల వల్ల ఎక్కువగా వృధా పోతోంది.
- రాజధానిలో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటాయి. జనవరి లెక్కల ప్రకారం మహానగర వ్యాప్తంగా 1.31 మీటర్ల

## హైకోర్టు హెచ్చరిక

జల సంరక్షణ చర్యలు చేపట్టని పక్షంలో హైదరాబాద్ నగరం కూడా మరో బెంగళూరులా మారి నీటి కటకట ఏర్పడుతుందని తెలంగాణ హైకోర్టు ప్రభుత్వాన్ని మార్చిలో హెచ్చరించింది. నీటి సంరక్షణకు తీసుకోవాల్సిన పలు చర్యలను సూచించింది.

రాష్ట్రంలో, హైదరాబాద్-సికింద్రాబాద్ నగరాల్లో నీటి కొరతపై తగిన చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలంటూ పి.ఆర్ సుభాష్‌చంద్రన్ 2005లో రాసిన లేఖను అప్పట్లోనే హైకోర్టు పిటిషన్‌గా స్వీకరించింది. దానిపై పలుమార్లు విచారణ జరిపింది. తాజాగా ప్రధాన న్యాయమూర్తి సహా ఇద్దరు జడ్జీల ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. గతంలో హైకోర్టు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక, ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్లతోపాటు కోర్టు సహాయకుడి (అమికస్ క్యూరీ)గా నియమితులైన సీనియర్ న్యాయవాది డి.ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన నివేదికను న్యాయస్థానం పరిగణలోకి తీసుకుంది. భవిష్యత్తులో నీటి కొరత రాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి నివేదించారు. భవన నిర్మాణాలన్నింటినీ తనిఖీ చేసి, ఇంకుడు గుంతల ఏర్పాటును పరిశీలించాలని చెప్పారు. నీటి పునర్వినియోగానికి చర్యలు తీసుకోవాలన్నారు. బోర్ల తవ్వకాల్లో వాల్టా చట్టం నిబంధనలు అమలయ్యేలా చూడాలని కోరారు. భూగర్భ జలమట్టం ఏ స్థాయిలో ఉందో అధ్యయనం చేయాలని, దాని పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. జల సంరక్షణ, వృధా నివారణపై పిల్లల్లో చైతన్యం తీసుకొచ్చేలా పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టాలని చెప్పారు. నివేదికలోని అంశాలపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్పందిస్తూ.. ప్రస్తుతం అలాంటి పరిస్థితి ఏమీ లేదనగా ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది ప్రజలకు సంబంధించిన సమస్య అని, దానిపై ప్రభుత్వం వ్యతిరేక ధోరణిలో మాట్లాడటం సరికాదంది. అమికస్ క్యూరీ ఇచ్చిన నివేదిక సూచనలన్నింటినీ అమలు చేస్తామని ప్రభుత్వం సానుకూలంగా స్పందించాల్సి ఉండగా అందుకు భిన్నంగా సమాధానం వస్తోందని వ్యాఖ్యానించింది.

**హైకోర్టు మార్గదర్శకాలివే..**

- భవన నిర్మాణాలన్నింటినీ పరిశీలించి, ఇంకుడు గుంతలు లేనివాటిని గుర్తించి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి తగిన చర్యలు చేపట్టాలి.
- పట్టణ స్థానిక సంస్థల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు నిబంధనలు అమలయ్యేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోనూ అమలు చేయాలి.
- భవన నిర్మాణ నిబంధనలకు సవరణ తీసుకొస్తూ గత ఏడాది మార్చి 31న జారీ చేసిన జీవో అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చిన్న చిన్న నిర్మాణాల్లోనూ నీటి రీసైక్లింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి.
- 2002 వాల్టా ( వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్) చట్టంలోని సెక్షన్-11 అమలుకు చర్యలు తీసుకోవాలి. ఈ చట్టం కింద నియమితులైన అధికారి.. భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. వర్షపాతం, భూమి నుంచి నీరు తోడటం.. ఇలా అన్ని అంశాల్నీ అధ్యయనం చేశాక బోర్లకు అనుమతించాలి. బావులు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బోర్లు వాల్టా చట్ట నిబంధనలకు లోబడి ఉన్నాయో లేదో భూగర్భ జలశాఖ అధ్యయనం చేయాలి. నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవాలి.
- జల సంరక్షణ, పంపిణీ, పునర్వినియోగం అంశాన్ని 3 నుంచి 5వ తరగతి వరకు, ఆ పైస్థాయి వివరాలను 6వ తరగతి నుంచి పాఠ్యాంశాలుగా చేర్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలి.

\+ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 43(6)(2) అమలయ్యేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి చర్యలు తీసుకోవాలి. దీని ప్రకారం.. ప్రతి ఇంటి యజమానికి కనీసం 6 మొక్కలు సరఫరా చేయాలి. వాటిని నాటి, సంరక్షించటం ఇంటి యజమాని బాధ్యత. ఇంటి యజమాని ఇందులో విఫలమైతే ఆస్తిపన్నుకు సమానంగా జరిమానా విధించాలి.

- జల సంరక్షణకు జారీ చేసిన ఆదేశాల అమలును పర్యవేక్షించడానికి 'వాచ్‌డాగ్ కమిటీ'ని ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలి.
- భూగర్భ జలమట్టాల పరిస్థితిని ప్రభుత్వం సమీక్షించి.. తోటల పెంపకానికి తాగునీటి వినియోగంపై పరిమితులు విధించే అంశాన్ని పరిశీలించాలి.

వరకు అడుగంటాయి. సికింద్రాబాద్ ప్రాంతంలో 1.41 మీటర్ల వరకు తగ్గుదల కనిపించింది. ఎండలు పెరుగుతుండటంతో వచ్చే రెండు నెలల్లో మరింత తగ్గనున్నాయి.

- పదేళ్లుగా చూస్తే వాన నీటి సంరక్షణ మీద జీహెచ్ఎంసీ, జలమండలి కోట్లలో ఖర్చు చేస్తున్నామంటూ లెక్కలు చూపుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించదు. కొత్తగా ఇంకుడు గుంతలు తవ్వించటానికి కూడా అధికారులు ప్రణాళికలు రూపొందించటం లేదు.
- హైదరాబాద్‌లో దాదాపు 5 లక్షల వరకు అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వాన నీటి సంరక్షణ కోసం ప్రతి అపార్ట్‌మెంట్‌లోనూ రెండు నుంచి నాలుగు వరకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్న నిబంధన ఉంది. కొన్నేళ్ల కిందట ఈ నిబంధనను బాగానే అమలు చేసిన అధికారులు.. అయిదేళ్లుగా నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారు. ఎనభై శాతం అపార్ట్‌మెంట్లలో అసలు

ఇంకుడు గుంతల ఆనవాళ్లే లేవు. ఫలితంగా భారీ వర్షాలు కురిసినప్పుడు వాననీరు భూమిలో ఇంకటానికి బదులుగా రోడ్ల మీదకు చేరుతోంది.

- తెలంగాణ ఏర్పడ్డాక ఇంకుడుగుంతల్లో ఇసుక, కంకర వంటివి వినియోగించాల్సిన అవసరం లేకుండా విధానాన్ని ప్రముఖ ఇంజినీర్ హనుమంతరావు గారు రూపొందించి ఇచ్చినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ఆ రకమైన గుంతల వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ పరిమాణంలో నీరు నిల్వ చేయవచ్చని, ప్రమాదాలు జరగకుండా వాటిపై ఇనుప జల్లెడ వంటివి ఏర్పాటు చేస్తే చాలని ఆయన నివేదికలో తెలిపారు.
- హైదరాబాద్ నగర రోడ్లపై నిలిచిన నీరు భూగర్భంలో ఇంకడం కోసం పల్లపు ప్రాంతాల్లో అధికంగా ఇంకుడుగుంతలు తవ్వాలని మూడేళ్ల కిందట జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు బల్దియాకు నివేదిక ఇచ్చారు. దానిని అప్పటి బల్దియా కమిషనర్ పరిశీలించారు. ఆ తర్వాత పట్టించుకోవటం మానేశారు.
- జీహెచ్‌ఎంసీ గతంలో 100 రోజుల పథకంలో భాగంగా జలమండలి కాలనీలు, పార్కుల్లో విడతలవారీగా 20 వేలకు పైగా గుంతలు ఏర్పాటు చేసింది. జియో ట్యాగింగ్‌తో అనుసంధానం చేశామని చెప్పారు. ఆ తర్వాత అధికారులు వీటిని పట్టించుకోవటం మరచిపోయారు. నిర్వహణ లేకపోవటంతో ఇంకుడు గుంతల్లో చాలావరకు పూడిపోయి పలుచోట్ల ఆనవాళ్లు కూడా కనిపించటం లేదు.

మహానగరాల్లో నీటి కరవు వస్తే ఎలాంటి దుర్భర పరిస్థితులుంటాయో 2018లో దక్షిణాఫ్రిక్ కేప్‌టౌన్ నీటి కరవును చూస్తే ఇంకా బాగా అర్థమవుతుంది. ఇళ్లకు, దుకాణాలకు, కార్యాలయాలకూ నీటి సరఫరా పూర్తిగా నిలిపివేశారు. 200 నీటి కేంద్రాల వద్ద రోజుకు మనిషికి 25 లీటర్లు సరఫరా చేశారు. 2050 నాటికి ప్రపంచంలో నీటి కోసం అలమటించే నగరాల్లో 30 భారత్‌లోనే ఉంటాయని అంచనా. అందువల్ల మన మహానగరాలు అప్రమత్తం కావాలి.

హైదరాబాద్ జనాభా కోటి దాటింది, 2050కి రెండు కోట్లు దాటనుంది. నీటి సరఫరాకు తక్కువ ఖర్చుతో విస్తరణ చర్యలు తీసుకోవటంతోపాటు నీటి సంరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. అసంబద్ధమైన ఉచిత సరఫరాలకు స్వస్తి చెప్పాలి. వృథాను, ట్యాంకర్ల సరఫరాలో అవినీతిని అరికట్టటానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. వాన నీటి సంరక్షణ, చెరువులు వంటి సంప్రదాయ నీటి వనరుల్ని పరిరక్షించటం, వాటిల్లోకి కాలుష్య నివారణ, భూగర్భ జలాల్ని పెంచటం, నీటి పొదుపు, మొదలైన చర్యల్ని విస్తృత ప్రచారంతో అమలు చేయాలి.

అందుకు అవసరమైన సాంకేతిక అంశాల్ని ఇంటింటికీ చేర్చాలి. ఇళ్లల్లో నీరు వృథా కాకుండా ట్యాప్‌లకు ఎయిరేటర్లు వంటి పరికరాలను బిగించాలి. వాషింగ్ మెషీన్లలో నీటి వృథాకు అవకాశం లేకుండా పూర్తి సామర్థ్యం మేరకు ఉపయోగించాలి. పొదుపుతోపాటు మురుగునీటి శుద్ధి, పునర్వినియోగానికి తగిన ఏర్పాట్లుండాలి. ప్రతి లీటరునూ సద్వినియోగం చేయాలి. అదేవిధంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా విస్తరించటంతోపాటు మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలి. వాటి నిర్వహణ, విస్తరణ ప్రణాళికల్లో ప్రజల భాగస్వామ్యం ఉండే రీతిలో స్థానిక ప్రభుత్వ పాలనను బలోపేతం చేయాలి. కనీసం ఈ మేరకు చర్యల్ని మన నగరాలన్నిటిలో అమలు చేయాలి.  వలస వచ్చేవారికి వసతుల్ని అందుబాటులోకి తేవటంతోపాటు నగరాల మీద మితిమీరిన భారం లేకుండా, స్థానిక ప్రజల అవసరాలకు తగ్గ నైపుణ్యాలున్నవారు నగరాలకు వలస పోయి దుర్భర జీవితం గడపాల్సిన అవసరం లేకుండా గ్రామాలను అనుసంధానం చేస్తూ చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. ఆ పట్టణాల్లో కనీస మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటి సదుపాయాలను అందుబాటులోకి తేవాలి.

**ప్రతి అవసరానికి తాగునీటినే వాడొద్దు**

**ప్రతి అవసరానికి తాగునీటినే వాడేస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఇతర అవసరాలకి రీసైక్లింగ్ వాటర్ వినియోగించాలి. మినీ ఎస్టీపీలు నిర్మించుకోవాలి. ప్రతి ఇంట్లో వర్షపునీరు ఇంకే ఏర్పాటు చేసుకోవాలి. చెరువుల కబ్జాతో వరద నీరు నిల్వ ఉండటం లేదు. పిల్లల్లో అవగాహన కలిగించాలి. ప్రభుత్వం, ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలి అని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పద్మనాభరెడ్డి అన్నారు.**

ప్రపంచ జనాభాలో 18% మన దేశంలో ఉన్నా నీటి వనరులు మాత్రం 4% ఉన్నాయి. నీటి అవసరాలు మరో నాలుగైదేళ్లలో రెట్టింపు కానున్నాయి. నీటి నిర్వహణ సక్రమంగా లేకుంటే దేశంలో 40 శాతం మంది 2040 నాటికి నీటి ఎద్దడి ఎదుర్కోవాల్సి ఉంటుందని అంచనా. అందువల్ల పట్టణ ప్రాంతాలతోపాటు దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ రక్షిత మంచినీటి సరఫరాకు శాశ్వత చర్యలతోపాటు నీటి పొదుపు, సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. తెలుగునాట గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య ఎండాకాలం తీవ్రంకాక ముందే ఇప్పటికే ఎక్కువైంది.

జలాశయాల్లో నీటిమట్టాలు ఆందోళనకరంగా తగ్గాయని గణంకాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాకు, రక్షిత మంచినీటికి దీర్ఘకాల చర్యలు తీసుకోవాలి. నదుల్ని శుద్ధి చేసి కాలుష్యం బారిన పడకుండా పకడ్బందీ ఏర్పాట్లు అమలు చేయాలి. నీరు వృథా కాకుండా వ్యవసాయ రంగంలో పంటల విధానంలో మార్పులు అమలు చేయాలి. రోజువారీ జీవితాన్ని, ఆర్థిక వ్యవస్థని అస్తవ్యస్తం చేసే నీటి సంక్షోభాన్ని నివారించేందుకు ఆలస్యం చేయకుండా ప్రభుత్వం, సమాజం ఉద్యమంలా సమగ్ర చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తును కాపాడుకోగలం.

❖

# జేపీ రైతు విధానాలపై హేతుబద్ధంగా ఆలోచించండి

## - శ్రీరామ్ ఎస్, ప్రజాస్వామ్య పీఠం బృందం



***పంజాబ్, చుట్టుపక్కల ప్రాంతాల రైతుల ఢిల్లీ చలో ఆందోళన నేపథ్యంలో రైతుల ఆదాయాలు పెంచటం లక్ష్యంగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఫిబ్రవరి 25న ఆంధ్రజ్యోతిలో రాసిన 'జబ్బు కంటే ప్రమాదకరం 'మద్దతు' ఔషధం' వ్యాసంపై రైతు స్వరాజ్య వేదిక నేత కన్నెగంటి రవి పలు ఆవేశపూరిత విమర్శలు చేశారు. 'కార్పొరేట్ ఎజెండాకు జెండా మోసిన జేపీ' పేరుతో మార్చి 5న ఆంధ్రజ్యోతిలో రవి గారు చేసిన విమర్శలకు సమాధానం ఇవ్వటం బాధ్యతగా భావిస్తున్నాం.***

మోదీ ప్రభుత్వానికి జేపీ వత్తాసు పలుకుతున్నారని ఒక రాజకీయ విమర్శతో రవి తన వ్యాసాన్ని ప్రారంభించారు. మోదీ ప్రధానమంత్రి కావటానికి ఎన్నో ఏళ్ల ముందునుంచే, అతి తక్కువ ఖర్చుతో సాగునీరు అందించటం దగ్గర్నుంచి పంటలకు అతి ఎక్కువ మార్కెట్ ధర లభించటం వరకు రైతుల తరపున పోరాడి జేపీ పలు విజయాల్ని సాధించారు. ఉదాహరణకు, తెలుగునాటే 2011లో పక్కరాష్ట్రాల్లో రేటున్నా రైతులు ధాన్యం అమ్ముకోకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధిస్తే, రైతులకు నాయకత్వం ఇచ్చి జేపీ కర్నూలు నుంచి కర్ణాటకకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు పాదయాత్రతో ఆందోళన నిర్వహించినప్పుడు జాతీయ స్థాయిలో మోదీ ఉనికే లేదు గదా! దమ్ముంటే అరెస్టు చేయండని బియ్యం మూటల్ని తీసుకెళ్లి జేపీ ఆ రాష్ట్రాల్లో అమ్మారు. అప్పట్లో బీపీటీ ధాన్యం క్వింటాలు బస్తా ధర మన వద్ద రూ.750 ఉంటే, కర్ణాటక, మహారాష్ట్రల్లో రూ.1200 వరకు ఉంది. జేపీ పోరాటంతో కొద్దిరోజుల్లోనే ఆంక్షలు తొలగిపోయి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు రూ.3,600 కోట్ల మేర లబ్ధి కలిగింది. ఇలా ఆంక్షలు లేని అమ్మకాలు ఉండాలని 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కూడా తన మ్యానిఫెస్టోలో పెట్టింది గదా! 2020లో అదే తరహా వ్యవసాయ చట్టాలను బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తే మాత్రం ఆ పార్టీ సహా ప్రతిపక్షాలు, మోదీ మొహం నచ్చని సంఘాలు రైతులు, దేశ ప్రయోజనాల గురించి ఆలోచించకుండా వాటిని వెనక్కితీసుకునేలా చేశాయి.

మోదీ ప్రభుత్వం చేతగానితనాన్ని ప్రదర్శించి వ్యవసాయ చట్టాలను వెనక్కితీసుకుందని జేపీ విమర్శించారని చెప్పటం ద్వారా రవి గారు యథాలాపంగా రెండు వాస్తవాల్ని అంగీకరించారు. ఒకటి, జేపీకి ప్రభుత్వాలు, పార్టీలు ముఖ్యం కాదు, విధానాలు, రైతులు, దేశ ప్రయోజనాలు ముఖ్యం. రెండు, రైతులతో చర్చలు జరిపి ఒప్పించే నాయకత్వ సామర్థ్యం మోదీకి కొరవడిందని జేపీ నిర్మొహమాటంగా భావిస్తున్నారు. ప్రజాస్వామ్యం అంటేనే చర్చలు, హేతుబద్ధ వాదనలతో ఇతరులను ఒప్పించటం, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయటం అని తన సుదీర్ఘ ప్రజాజీవితంలో జేపీ చేతల్లో నిరూపించారని, ఆ విధంగానే ఒక్క ఎంపీ కూడా లేకుండా మూడు రాజ్యాంగ సవరణల్ని, ఏడెనిమిది చట్టాల్ని, పలు విధాన మార్పుల్ని సాధించారని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు.

రాజకీయ పక్షపాతాలతోపాటు, పిడివాదాన్ని దాటి హేతుబద్ధంగా ఆలోచిస్తే రవి గారు చేసిన ఇంకో విమర్శపై కూడా స్పష్టత వస్తుంది. 1990వ దశకం నుంచి నూతన ఆర్థిక విధానాలను జేపీ సమర్థించారని, ఈ మూడు దశాబ్దాల్లో మూడు లక్షల మంది రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో ఆయన చెప్పరని విమర్శించారు. జనాన్ని చావగొట్టి చనిపోయాక ఎక్స్‌గ్రేషియా ఇచ్చే రాజకీయం జేపీ చేయరనే విషయం అలా ఉంచితే, ఆర్థిక సంస్కరణలకు ముందు రైతుల పరిస్థితిని ఒక్కసారి జాగ్రత్తగా చూడండి. అప్పట్లో రైతులు తాము పండించిన పంటలో తిండిగింజలు కాకుండా నాలుగు బస్తాలు ఇంట్లో

దాచుకోవాలన్నా ప్రభుత్వం అరెస్టు చేసేది. ఈవేళ్టి తరం ఊహించలేనిరీతిలో ఆరోజుల్లో ప్రభుత్వాల దాష్టీకం ఉండేది. అధికారులు వస్తున్నారంటే, రైతులు ఇళ్లు వదిలి పారిపోయేవారు. ప్రభుత్వం బలవంతంగా ధాన్యం సేకరించేది. పరిమితంగా ఉన్న బహిరంగ మార్కెట్‌లో రేటు ఎక్కువ ఉన్నా మిల్లర్లకు కూడా అమ్ముకునే స్వేచ్ఛ ఉండేది కాదు. ప్రభుత్వ సేకరణలో కూడా 26 రకాల లంచాల్ని మిల్లర్లు ఇవ్వాల్సి వచ్చేది. ఈ భారమంతా చివరికి భరించింది రైతులే. ఆ తర్వాత దేశం దివాళా తీసే పరిస్థితి వచ్చాక విధిలేని పరిస్థితుల్లోనైనా పి.వి నరసింహారావు హయాంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాక కూడా వ్యవసాయంలో సంస్కరణల్ని తేలేదు. మౌలిక మార్పులు తేకుండా, 2006 తర్వాత ఎం.ఎస్.పిని (కనీస మద్దతు ధర) ప్రధానంగా వరి, గోధుమ పంటలకు పెద్దఎత్తున పెంచే చిట్కాతో యధాతథ స్థితిని కొనసాగించారు. దీనివల్ల క్రమంగా మార్కెట్ ధర కంటే ఎంఎస్‌పి ఎక్కువైంది. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆ పంటల సాగునే విస్తరించారు. ఇదేసమయంలో ఆర్థిక సంస్కరణల వల్ల ప్రజల ఆదాయాలు పెరుగుతూ ఆహారపు అలవాట్లు మారుతూ వస్తున్నాయి. దీంతో వరి, గోధుమకు డిమాండ్ తగ్గి, పండ్లు, కూరగాయలు, గుడ్లు, మాంసం, పాలు మొదలైనవాటికి గిరాకీ పెరగసాగింది. మార్కెట్‌లో డిమాండ్‌లేని పంటలను పండిస్తూ ఎంఎస్‌పి ఉన్నా రైతు నష్టపోతూ వ్యవసాయం సంక్షోభం పెరుగుతుంటే, విఫలమైన విధానాన్నే చట్టబద్ధం చేయాలనటం ఏ రకమైన పరిష్కారం? మన దేశంలో రైతులు పండించిన ఉత్పత్తుల అంచనా విలువ 70-80 లక్షల కోట్లు. బడ్జెట్ ప్రకారం భారత ప్రభుత్వానికి వచ్చే 42.30 లక్షల కోట్ల ఆదాయంలో రాష్ట్రాలకు వివిధ రూపాల్లో బదిలీ చేసే 22,74,541 కోట్లు, జీతాలు, భత్యాలు, పెన్షన్లు, వడ్డీలు వంటివి పోగా రూ.3000 కోట్లు పైచిలుకు ప్రభుత్వానికి లోటు. ఒకవేళ ప్రభుత్వం కొత్తగా అప్పులు చేసి కొన్ని లక్షల కోట్లు ఖర్చు పెట్టి ధాన్యం, గోధుమలు కొనుగోలు చేసిందనుకుందాం. కాని ఏం చేసుకుంటుంది? గొడౌన్లలో ముక్కిపోతూ లంచగొండి అధికారులను మేపటం కోసమా? ప్రజాపంపిణీ పేరుతో రీసైక్లింగ్ దందా సాగటం కోసమా? రైతుల పిల్లల్లో అనేకమంది వ్యవసాయేతర వృత్తుల్లోకి వెళ్లాలనుకుంటున్నారు. అప్పు చేసిన డబ్బంతా అనుత్పాదక పద్ధతిలో వృధా చేస్తే, వారి ఉపాధి అవకాశాల కోసం మిగతా రంగాల్లో ఖర్చు పెట్టాలంటే ప్రభుత్వం వద్ద ఇక డబ్బెక్కడుంటుంది? కాబట్టి సంక్షోభానికి కారణం ఆర్థిక

**ఒకవేళ ప్రభుత్వం కొత్తగా అప్పులు చేసి కొన్ని లక్షల కోట్లు ఖర్చు పెట్టి ధాన్యం, గోధుమలు కొనుగోలు చేసిందనుకుందాం. కొని ఏం చేసుకుంటుంది? గొడౌన్లలో ముక్కిపోతూ లంచగొండి అధికారులను మేపటం కోసమా? ప్రజాపంపిణీ పేరుతో రీసైక్లింగ్ దందా సాగటం కోసమా? రైతుల పిల్లల్లో అనేకమంది వ్యవసాయేతర వృత్తుల్లోకి వెళ్లాలనుకుంటు న్నారు. అప్పు చేసిన డబ్బంతా అనుత్పాదక పద్ధతిలో వృధా చేస్తే, వారి ఉపాధి అవకాశాల కోసం మిగతా రంగాల్లో ఖర్చు పెట్టాలంటే ప్రభుత్వం వద్ద ఇక డబ్బెక్కడుంటుంది? కాబట్టి సంక్షోభానికి కారణం ఆర్థిక సంస్కరణలు కాదు, పారిశ్రామిక రంగంలోలా లైసెన్స్- పర్మిట్ వ్యవస్థ లేకుండా వ్యవసాయాన్నీ సంస్కరించి రైతు లాభం పొందే విధానాలను అమలు చేయకపోవటం!**

సంస్కరణలు కాదు, పారిశ్రామిక రంగంలోలా లైసెన్స్-పర్మిట్ వ్యవస్థ లేకుండా వ్యవసాయాన్నీ సంస్కరించి రైతు లాభం పొందే విధానాలను అమలు చేయకపోవటం! వ్యవసాయానికి సంకెళ్లు తొలగిస్తే మార్కెట్ విస్తరించి ఎక్కువ రేటు పొందే అవకాశాలు రైతుకి మెరుగవుతాయి. ఇంతకుముందే చెప్పినట్లు, పొరుగు రాష్ట్రాల్లో అమ్ముకునే అవకాశం రావటం వల్ల తెలుగునాట రైతులకి ఒక్క ఏడాదిలో, ఒక్క వెరైటీ ధాన్యానికి రూ.3,600 కోట్లు అదనంగా ఆదాయం వచ్చింది. అదే విధంగా, 2011లో జేపీ కృషి వల్లే బియ్యం ఎగుమతులపై ఆంక్షలు తొలగి మన దేశం ప్రపంచ నెంబర్‌వన్ అయ్యింది. ఉక్రెయిన్ యుద్ధం సాకుగా చూపి ఇటీవల బియ్యం ఎగుమతుల్ని మళ్లీ నిషేధించారు. ఒకటే మార్కెట్ కాకుండా, తెలంగాణలో పండిన పంటంతా ఇక్కడే అమ్మాలి, ఏపీలో ధాన్యం జిల్లా సరిహద్దు దాటకూడదు అంటే రేట్లు కుప్పకూలతాయి, పంట విరామాలు నిత్యకృత్యమైపోతాయి. విదేశాలకు ఎగుమతుల్ని ఆపితే రైతుకి రేట్లు కుంగుతాయి. కాబట్టి ఎగుమతులపై ఆంక్షల్ని తొలగించటంతోపాటు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే చౌక ఉత్పత్తుల మీద 30-40% దిగుమతి సుంకం విధించి ఆ డబ్బంతా మన రైతులకే ఇస్తే, ఇక్కడే పప్పు దినుసుల్ని, వంటనూనెల్ని ఉత్పత్తి చేసి కొన్నేళ్లలోనే మన రైతులు స్వావలంబన సాధించగలరు. మన దేశంలో 2 కోట్ల 70 లక్షల మంది రైతులు నూనెగింజల సాగులో ఉన్నా, గతేడాది రూ.1,60,000 కోట్ల వంటనూనెల్ని దిగుమతి చేసుకున్నాం. కొన్నేళ్ల క్రితం గోదావరి జిల్లాలో పామాయిల్ చెట్లను మన రైతులు తెగనరుకుతుంటే, అలాంటి పరిస్థితి రాకూడదని చౌక దిగుమతులపై సుంకం విధించాలని జేపీ చేసిన పోరాటం వల్ల 2017-18 నుంచి 30-40% దిగుమతి సుంకం విధించారు. ఆ తర్వాత ఉక్రెయిన్ యుద్ధం సాకుగా చూపి మళ్లీ 5%కి సుంకాన్ని దించేశారు. దీంతో ఆయిల్‌పామ్ పండ్లు ఇప్పుడు కిలోకి రూ.23 నుంచి రూ.12కి పడిపోయాయి. రైతులకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు పండించటం, ఎక్కడ రేటు ఉంటే అక్కడ అమ్ముకునే అవకాశం కల్పించటం, రేటు తక్కువ ఉంటే పెరిగేంత వరకు నిల్వ సౌకర్యం, కుళ్లిపోయే పంటలకు ప్రాసెసింగ్ సదుపాయం, పంట తనఖా రుణాలు (ప్లెడ్జి లోన్లు), సులభంగా బ్యాంకులు, ఇతర అధికారిక రుణ సదుపాయం, దళారీలు లేకుండా రైతులకు వినియోగదారులు చెల్లించే డబ్బులో ఎక్కువ రైతులకే దక్కేలా రిటైల్ చెయిన్లు మొదలైన చర్యలు అవసరం.

ఇక రవి గారు చేసిన ఇంకో ఆరోపణ, సహకార రంగం పాత్రను జేపీ గుర్తించలేదని. తెలుగునాట ఎన్‌టీఆర్ హయాంలో 'మ్యాక్స్' చట్టం రావటానికి, ఆ తర్వాత ప్రభుత్వాలు సహకార సంస్థల్ని కబళించకుండా న్యాయస్థానాల్లో పోరాటాలు కూడా చేసి కాపాడటానికి, చివరికి సహకార సంస్థల స్వయంప్రతిపత్తికి గ్యారంటీనిచ్చే చరిత్రాత్మక 97వ రాజ్యాంగ సవరణ రావటానికి మూలం జేపీ. కార్పొరేట్ సంస్థలకు బ్యాంకులు దోచిపెడుతున్నాయని, వారి రుణాలు మాఫీ చేస్తున్నాయని రవి విమర్శించారు. జేపీ చెప్పినట్లు బ్యాంకులు ప్రభుత్వ రంగంలో లేకుండా ప్రయివేటులో ఉంటే దోచిపెట్టటం ఉండదు గదా, దోచిపెడితే ఆ ప్రయివేటు వాళ్లు నష్టపోతారు తప్ప ప్రజలు కాదు గదా? ఒకపక్క బ్యాంకుల్ని ప్రభుత్వమే నడపాలని మొండిగా వాదిస్తూ, మరోపక్క దోచిపెడుతున్నారనటం ఎంత గడుసు వాదన! రైతులకు ఇంకా ఏం చేయాలో జేపీ సమగ్రంగా చెప్పలేదన్నారు. మన దేశంలో వ్యవసాయ ఉత్పత్తిని పెంచి, మార్కెట్ అవకాశాల్ని అందుకుంటే మన రైతులకు ఇప్పటికంటే ఎక్కువ ఆదాయం నిలకడగా వస్తుందనటంలో సందేహం లేదు. కానీ ఇప్పటిలా జనాభాలో 45% మంది వ్యవసాయం మీదే ఆధారపడితే 18-20% జీడీపీ వాటాతో మరింత ఎక్కువ ఆదాయాలనిచ్చే శక్తి ఈ రంగానికి లేదు. రైతులకు సంపన్న దేశాల్లో కూడా భారీ సబ్సిడీలు ఇస్తున్నారు. మనం కూడా ఇవ్వాలి. ఇప్పుడిస్తున్న దానికంటే ఎక్కువ డబ్బు ఇవ్వాలి. కానీ ఎంఎస్‌పికి చట్టబద్ధత వంటి పద్ధతుల్లో కాదు. సంపన్న దేశాల్లో వ్యవసాయం మీద ఆధాపడేవాళ్లు 3% దాకా మాత్రమే ఉంటారు. మిగతా 97% వారిని ఆదుకోవటం తేలిక. కానీ మనలాంటి పేద దేశంలో, మిగిలిన 55% మిగిలిన వారందరికీ సాయం చేయటం కష్టం. కాబట్టి వ్యవసాయం మీద ఆధారపడేవారిని వ్యవసాయేతర రంగాలకు మళ్లించటం, ఇందుకోసం గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి, అక్కడే మంచి విద్య, వైద్య సదుపాయాలు వంటివి అందుబాటులోకి తేవటం మొదలైన పరిష్కారాలను అమలు చేయాలి. గ్రామీణ, వ్యవసాయ సంక్షోభాలను వేర్వేరుగా చూడకూడదు. సమగ్ర పరిష్కారం అమలు చేయాలి. రైతులకు ఉపశమనం కోసం తాత్కాలికంగా వ్యవసాయోత్పత్తులను ప్రభుత్వం సేకరించటం, వారు పేదరికం నుంచి బయటపడేదాకా సంక్షేమ పథకాల అమలు అవసరం. కానీ రైతులు, కౌలు రైతులకు ఆదాయం పెరగటానికి చర్యలు, పేదరికం నుంచి వారి కుటుంబాలు బయటపడటానికి విధానాలు లేకుంటే ఎలా? నాణ్యమైన చదువు, ఆరోగ్యం లేకుండా తాత్కాలిక పథకాలతో పేదరికం పోయిన దాఖలాలు ప్రపంచ చరిత్రలో ఎక్కడున్నాయో ఒక్క ఉదాహరణ చూపండి. జేపీ రైతు పక్షపాతి. రైతుల సంకెళ్లు తెంచాలనటం తప్పా? ఈ విధానాల్లో ఏవైనా లోపాలున్నాయని మీరు హేతుబద్ధంగా, ఆధారాలతో నిరూపించగలిగితే సరిదిద్దు కోవటానికి మాకు ఎటువంటి భేషజాలూ లేవు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు అవసరంగానీ, వ్యవసాయ ఆదాయంతో సంబంధం లేకుండా భారీ సాగునీటి ప్రాజెక్టుల్ని చేపడితే రైతులకు, రాష్ట్రానికీ పెనుభారం అవుతాయని 2008 నుంచి ప్రాణహిత-చేవెళ్ల, కాళేశ్వరం విషయంలో జేపీ చేసిన హెచ్చరికలు ఎంత వాస్తవమో ఇప్పుడు అందరికీ అర్థమ వుతోంది. కానీ ఈలోగా రాష్ట్రం ఎంత భారీ ఆర్థిక మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చింది! కాబట్టి రైతులు ఇంకా నష్టపోక ముందే మేలుకొందాం. రవి గారూ! రైతుల పట్ల మీ చిత్తశుద్ధిపై మాకు పూర్తి గౌరవం ఉంది. ఈ వ్యాసంలో అన్ని అంశాల్నీ సమగ్రంగా వివరించటం సాధ్యం కాదు మీరు, మీ బృందం ఎఫ్‌డీఆర్ కార్యాలయానికి వచ్చినా లేదా మీరే ఏదైనా సమా వేశా న్ని ఏర్పాటు చేసినా అన్ని పరిష్కారాలనూ చర్చించవచ్చుని విజ్ఞప్తి చేస్తున్నాం. ❖

# అంబేద్కర్ - రాజకీయ సమానత్వం

**(17వ పేజీ తరువాయి)**

రిజర్వేషన్ల పరిధిలో ఉన్నవారు, ఆ పరిధిలోలేనివారు వీరిద్దరిలో రిజర్వేషన్ల పట్ల ఉన్న అసంతృప్తిని ఆసరాగా చేసుకుని చిచ్చురగిలిస్తూ ఓట్లు దండుకుంటున్నారు. పర్యవసానం రిజర్వేషన్లను పొడిగిస్తున్నా, విస్తరిస్తున్నా అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయం ఇప్పటికీ సాధ్యం కాలేదు. మంచి చదువుంటే కూలీ బిడ్డ కూడా మంత్రి, కలెక్టర్ బిడ్డలతో సమానంగా పోటీ పడగలరనటానికి అంబేద్కరే గొప్ప ఉదాహరణ. అందుకోసం ఆయన ఉదాత్తమైన రాజ్యాంగాన్ని అందించినా, అలాంటి వ్యవస్థను నిర్మించటంలో స్వతంత్ర భారత దేశ పాలకులు విఫలమయ్యారు. ఇప్పటికీ విఫల మవుతున్నారు. సమాజం, రాజ్యాంగం మధ్య అగాధం తొలగి అంబేద్కర్ ఆశించిన ప్రజాస్వామ్యం రావాలంటే ముఖ్యంగా నాలుగు అంశాల్లో మార్పులు రావాలి. మొదటిది, ప్రస్తుత రాజకీయాల్లో కులం, డబ్బు, నేరస్తుల ప్రభావాన్ని నియంత్రించటానికి దామాషా ఎన్నికల వ్యవస్థను తీసుకురావాలి. రెండు, సమర్థులు, నిజాయతీపరులు చట్టసభలకు ఎన్నికయ్యేలా పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యానికి ఏర్పాట్లు చేయాలి. మూడు, క్రియాశీల ప్రజాస్వామ్యంలో చట్టం ఉన్నవారికి చుట్టం కాదు అని ప్రజల్లో విశ్వాసం పెంచేలా ఆచరణలో రుజువు చేసేందుకు చట్టబద్ధపాలన అమలుకు సంస్థాగత చర్యలు తీసుకోవాలి. నాలుగు, ప్రతి బిడ్డకూ ఉత్తమ ప్రమాణాల నాణ్యమైన విద్యను అందించి నైపుణ్యాన్ని పెంచటం. ఈ మార్పులు ఆర్థికాభివృద్ధిలో సైతం అందరికీ అవకాశాల్ని అందించి నిజమైన రాజకీయ స్వేచ్ఛను పెంపొందించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. ❖

# సోషల్ మీడియాపై ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తత అవసరం

సాయి పృథ్వి

ఏ ప్రజాస్వామ్య దేశంలో అయినా రాజకీయ పార్టీలు ప్రజల మద్దతు కోసం అన్ని వర్గాలనీ సమీకరించాల్సుంటుంది. శక్తిమంతమైన సమాచార వ్యవస్థ అలాంటి సమీకరణలో కీలకపాత్ర వహిస్తుంది. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల్ని మీడియా విస్తృత స్థాయి ప్రజానీకంలోకి తీసుకెళ్తుంది. వందల మందితో నిర్వహించిన కార్యక్రమాలు కూడా వేలు, లక్షల మందికి చేరటంలో మీడియా పాత్ర కీలకం. వాటితోపాటు వార్తలు, వ్యాఖ్యలతో మీడియా ప్రజలకి, ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకి కీలక సమాచార యంత్రంగా పనిచేస్తుంది. అటుప్రభుత్వం చేసిన, చేయని, చేయాల్సిన పనులని ప్రజలతోపాటు ప్రతిపక్షాలకి తెలియచేయటంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఎన్నికల సమయంలో పార్టీలకతీతంగా ఒక లక్ష్యాన్ని ప్రతిపాదించి, అందుకు తగ్గ వాతావరణాన్ని నిర్మిస్తూ ఆయా అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచుతూ ఒక బలమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి మీడియా తోడ్పడుతుంది.



కానీ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా మన దేశంలో మీడియా చాలామేర రాజకీయ సాధనంగా, కొన్ని పార్టీల సొంత ఆస్తిలా మారింది. ఎన్నికల సమయంలో జనహితం దిశగా పార్టీలకి, ప్రజలకి మధ్య ఒక బలమైన లక్ష్యాన్ని ప్రతిపాదించి ప్రచారం చేయాల్సిన మీడియా రాజకీయ పార్టీలు, నాయకుల పక్షపాత లక్ష్యాలను ఎక్కువగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. దాంతోపాటు టీఆర్పీ వేటలో పడి, నిజమైన సమస్యలను పక్కనపెట్టి ప్రేక్షకులను, పాఠకులను ఆకట్టుకోవటం కోసం ఆకర్షణీయమైన వార్తల మీదే దృష్టి పెడుతోంది. మార్కెట్ భాషలో చెప్పాలంటే మీడియా అమ్మాల్సిన సరుకును కాకుండా, అమ్ముడయ్యే సరకును మాత్రమే అమ్ముతోంది. ఇది దీర్ఘకాలంతో దేశానికి తీవ్ర హానికర పరిణామం.

సోషల్ మీడియా యుగం మొదలయ్యాక, ప్రధాన స్రవంతి మీడియాలో ఉన్న లోపాలకి సోషల్ మీడియా విరుగుడు అవుతుందని చాలామంది భావించారు. కానీ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే సోషల్ మీడియా కూడా సమస్యలో భాగమైందన్న అభిప్రాయం కలుగక మానదు. ఎక్కడొచ్చింది సమస్య? ఆక్స్‌ఫర్డ్ అధ్యయనం ప్రకారం, వక్రీకరణల కోసం సంఘటిత స్థాయిలో సోషల్ మీడియాను వాడుతున్న దేశాలలో భారత్ కూడా ఒకటి అని తేలింది.

ఇందులో ముఖ్య పాత్ర పోషిస్తోంది రాజకీయ పార్టీలే. మనం మొదట అనుకున్నట్లు, ఒక ప్రజాస్వామ్య దేశంలో పార్టీలు అన్ని వర్గాల ప్రజలని సమీకరించటం అవసరం. కానీ సోషల్ మీడియా వచ్చాక ప్రజల్ని విభజించటం పార్టీలకి తేలికైంది.

ప్రస్తుత రాజకీయ పార్టీలని చూస్తే ప్రతి పార్టీకి ఒక బలమైన సోషల్ మీడియా విభాగం ఉంది. ఆ సోషల్ మీడియా ఎన్ని యూనిట్లుగా విభజితమై వికేంద్రీకృతమైందంటే, జాతీయ పార్టీలకి దేశం యూనిట్‌గా, ప్రాంతీయ పార్టీలకు రాష్ట్రం యూనిట్‌గా మొదలై గ్రామస్థాయి వరకు విస్తరించాయి.

ఇంత శక్తిమంతంగా ఉన్న సోషల్ మీడియా యంత్రాంగం ప్రజలని సమీకరించటానికి చాలా బలమైన సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తే, ప్రజల మధ్య చిచ్చు పెట్టటాన్నే సక్సెస్ మంత్రంగా పాటిస్తున్నాయి. ఉదాహరణకి, గాంధీ, అంబేద్కర్ అంటే ఎవరూ పట్టించుకోరు. అదే గాంధీ వర్సెస్ అంబేద్కర్ అంటే సమాజం రెండు వర్గాలుగా విడిపోయి మాటల యుద్ధం మొదలై వాడివేడి చర్చకు దారితీస్తుంది.

వీటితోపాటు సోషల్ మీడియాలో వ్యక్తులు నిజమైన పేర్లు వెల్లడించకపోవటం, వివరాల జాడ గుర్తించటం కష్టమవటం, జవాబు దారీతనం లేకపోవటం వంటి కారణాల వల్ల అడ్డూఅదుపు లేకుండా సమాజంలో విభజనల్ని ఎగదోసే యంత్రంగా సోషల్ మీడియా తయారైంది.

రాజకీయ పార్టీలు కూడా ప్రజలని తేలికగా చేరుకుని ఓట్లు సంపాదించటానికి సమాజాన్ని విభజించే అంశాలు, బలమైన సోషల్ మీడియా విభాగం తప్పనిసరి అనుకుంటున్నాయి.

దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా భద్రతా వలయాన్ని ఛేదించి పార్లమెంటులోకి చొరబడినవారు కూడా సోషల్ మీడియా వేదికగా పరిచయమై ఒక గ్రూప్‌లో వాళ్ల భావాల్ని పంచుకున్నారు. వారి చట్టవ్యతిరేక కలాపాలకి సోషల్ మీడియా కేంద్రమైంది. గత సంవత్సరం సతారాలో ఒక మరణానికి దారితీసి మత కలహాలకి కూడా ఓ సోషల్ మీడియా పోస్ట్ కారణమైంది. 2019-2020లో వ్యవసాయ చట్టాలు, సీఏఏ వ్యతిరేక ప్రదర్శనల్లో కూడా చాలా తప్పుడు సమాచారం వ్యాప్తి చేయటానికి సోషల్ మీడియాని బలమైన ఆయుధంగా వాడారు.

సోషల్ మీడియా ప్రధాన స్రవంతి మీడియాకి పోటీగా వచ్చినప్పుడు ప్రజాస్వామీకరణకి సహాయపడుతుందని అందరూ భావించారు. కాని ప్రస్తుతం చూస్తే అదే సమస్యగా మారినట్లు కనిపిస్తుంది. సానుకూలతల దృష్ట్యా సోషల్ మీడియాను

(మిగతా 34వ పేజీలో)

# ఏకకాల ఎన్నికలే పరిష్కారమా?

**భారత్‌లో ఏకకాల ఎన్నికలపై ఉన్నతస్థాయి కమిటీ ఇటీవల తన నివేదికను విడుదల చేసింది. జాతీయ, రాష్ట్ర, స్థానిక మూడు స్థాయిల ప్రభుత్వాలకూ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించాలని గట్టిగా సిఫార్సు చేసింది. మొదటి దశగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్ని నిర్వహించాలని, రెండవ దశగా మొదటి దశ పూర్తయిన 100 రోజులలోపు స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్ని నిర్వహించాలని ప్రణాళిక అందించింది. దేశమంతా ఏకకాల ఎన్నికల ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. 1983లో ఎన్నికల సంఘం మొదటి వార్షిక నివేదికతో మొదలై, దశాబ్దాలుగా పరిశీలనలో కొనసాగుతోంది. ఏకకాల ఎన్నికల ప్రతిపాదనను లా కమిషన్ (మూడుసార్లు), రాజ్యాంగ సమీక్షా సంఘం, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, నీతి ఆయోగ్ అధ్యయనం చేసి ఆమోదించాయి. అందువల్ల, 2020 వ్యవసాయ చట్టాల మాదిరిగా ప్రజాస్వామిక చర్చ జరగలేదని ఈ అంశంలో ఆరోపించలేం. ప్రతిపాదనపై దశాబ్దాలుగా వివిధ వేదికల మీద చర్చ జరిగింది.**

విస్తృత స్థాయి ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ ఏకకాల ఎన్నికల పూర్తిస్థాయి పర్యవసానాలపై స్పష్టత లేదు. ఎన్నికలను తప్పనిసరిగా ఏకకాలంలో నిర్వహించటానికి అవసరమైన రాజ్యాంగపరమైన మార్పు మన ప్రభుత్వ వ్యవస్థను, రాజకీయాలను మౌలికంగా ప్రభావితం చేస్తుంది. ఎన్నికల నిర్వహణకి ప్రభుత్వం పెట్టే ఖర్చు గణనీయంగా తగ్గటం, అంతరాయం లేకుండా పదవీకాలం స్థిరంగా ఉండటం వల్ల పాలన సజావుగా సాగటం రెండు ప్రధాన ప్రయోజనాలు. అయితే మన రాజకీయ ప్రక్రియ, ఫెడరల్ వ్యవస్థ, భారతదేశ ప్రజాస్వామ్య పరిణామక్రమంపై మాత్రం ఏకకాల ఎన్నికల ప్రభావాన్ని కచ్చితంగా తేల్చిచెప్పలేం.

ఒకేసారి ఎన్నికలను నిర్వహించటం వెనుక వివిధ కారణాలను, ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సు చేసిన నమూనాను నివేదిక నేపథ్యంలో పరిశీలిద్దాం. ప్రస్తుత జాతీయ స్థాయి ప్రభుత్వం ఏకకాల ఎన్నికలకు కట్టుబడి ఉంది. భారతీయ జనతా పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే, ఎన్ని ప్రశ్నలున్నా, ఏకకాల ఎన్నికల విధానాన్ని ప్రవేశపెట్టటం ఖాయంగా కనిపిస్తోంది. కమిటీ సిఫార్సు చేసిన పద్ధతి ప్రకారం, సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్ సభ మొదటిసారి సమావేశమైన రోజున రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. అంచేత స్పష్టత కోసం మనం ఎక్కువకాలం వేచి చూడాల్సిన అవసరం లేదు.

కమిటీ దృష్టిలో ఏకకాల ఎన్నికలు పరిష్కరించే ప్రధాన సమస్య ఎన్నికలు తరచూ జరగటం వల్ల ఖజానాపై పడే ఆర్థికభారం. ఆర్థిక ప్రభావం ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ ఉంటుంది. ఏకకాల ఎన్నికల సమర్థకులు పేర్కొనే ప్రత్యక్ష ప్రయోజనం – అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించటం ఖర్చు వృధాను నివారించటంతోపాటు వనరుల వినియోగాన్ని మెరుగుపరుస్తుంది. దీనివల్ల ప్రభుత్వ వ్యయం బాగా తగ్గుతుందని వారి వాదన. కానీ కమిటీ నివేదికలో ఆ వాదనకు మద్దతుగా ఎటువంటి విశ్లేషణా లేదు. ఏకకాల ఎన్నికల వల్ల పొదుపు ఎంత ఉంటుందనే ప్రస్తావన లేదు. భారత ఎన్నికల

సుమేధా కూరపర్తి



సంఘం 2015లో లోక్‌సభ, రాష్ట్ర/ కేంద్రపాలిత ప్రాంత అసెంబ్లీలకు ప్రస్తుత పద్ధతిలో ఎన్నికలను నిర్వహించటానికి మొత్తంగా దాదాపు రూ.4,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. దాంతోపాటు, అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించాలంటే, ఈవీఎంలు, ఇంకా వీవీప్యాట్లు కొనుగోలు చేయటానికి ప్రతి 15 సంవత్సరాలకు రూ.9,400 కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తుందని తెలిపింది. అంటే, ప్రతి అయిదేళ్లకోసారి జరిగే ఏకకాల ఎన్నికల్లో రూ.3,000 కోట్లకుపైగా ఈవీఎంలు, వీవీప్యాట్ల కొనుగోలుకే ఖర్చవుతుంది! ఈ యంత్రాలను నిల్వ చేయటానికి గోదాములు, ఎన్నికల సమయంలో సిబ్బంది, రవాణా, ఇతర మౌలిక సదుపాయాలపై వ్యయం అదనం. అంటే, ప్రస్తుత వ్యయం, ఏకకాల ఎన్నికల వ్యయం మధ్య అంతరం ఎక్కువగా ఉండదు. అందువల్ల, ప్రభుత్వ వ్యయంలో గణనీయంగా ఆదా అవుతుందనే వాదనకి బలమైన ఆధారం లేదు.

కమిటీ పేర్కొన్న పరోక్ష ప్రయోజనం ఏమిటంటే, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఎన్నికల ప్రచారం వల్ల కలిగే అంతరాయం లేకుండా ఏకకాల ఎన్నికల వల్ల మంచి పరిపాలనకి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఏర్పడుతుంది. పెట్టుబడులకు మరింత స్థిరత్వం ఏర్పడుతుంది. అనూహ్య పరిణామాలకు ఆస్కారం లేకపోవటంతో ప్రభుత్వ వ్యయంలో హేతుబద్ధత పెరిగి మెరుగైన ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది. ఎంతమేర ప్రయోజనం అంచనా వేయటం సాధ్యం కానప్పటికీ, వాదన మాత్రం సరైనదే.

ఏకకాల ఎన్నికలు ఎందుకు అవసరం అని వివరించ

టంతోపాటు, కొన్ని తరచూ తలెత్తే ప్రశ్నలను పరిష్కరించే ప్రయత్నం కమిటీ చేసింది. మన రాజకీయ ప్రక్రియ, ఫెడరలిజం, ప్రజాస్వామ్యం వంటి విస్తృతాంశాలకు సంబంధించినవి ఈ ప్రశ్నలు. ఇలాంటి విషయాల్లో, ఒక కచ్చితమైన నిర్ధారణకు రావటం కష్టం.

ఉదాహరణకి, ప్రాంతీయ పార్టీలు తమ ప్రాముఖ్యతని కోల్పోతాయని, ఫెడరల్ వ్యవస్థ క్షీణిస్తుందని ఏకకాల ఎన్నికలను వ్యతిరేకించేవారి వాదన. మరోవంక కమిటీ మాత్రం ఏకకాల ఎన్నికలు ప్రాంతీయ పార్టీలను, ఫెడరలిజంను బలోపేతం చేస్తుందని పేర్కొంది. వారి అంచనాలో ఏకకాల ఎన్నికల కారణంగా ఎన్నికల్లో డబ్బు బలం తగ్గి, జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడే శక్తి మెరుగవుతుంది. అదేకాకుండా, దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్న జాతీయ పార్టీతో పోలిస్తే స్థానిక సమస్యలపై ప్రచారాన్ని నిర్వహించటంలో ప్రాంతీయ పార్టీలది పైచేయి అయ్యే అవకాశముంది. అయితే విషయం అంత తేలిగ్గా తేల్చిచెప్పగలిగినది కాదు. దేశంలో ఇప్పటికీ మెజారిటీ ఓటర్లు వారి ఓటు విలువ పూర్తిగా అర్థంకాని పరిస్థితుల్లో ఉన్నారు. ఏకకాల ఎన్నికల వల్ల జాతీయ సమస్యలు ప్రాంతీయ అంశాల్ని లేదా ప్రాంతీయ సమస్యలు జాతీయ సమస్యల్ని కప్పిపుచ్చే ప్రమాదం ఉంది. ఈ విధంగా, ప్రభుత్వంలోని వివిధ స్థాయిలలో ఓటు మధ్య తేడాను గుర్తించటం కష్టమయ్యే పరిస్థితి వల్ల ఏకకాల ఎన్నికలు భారత ప్రజాస్వామ్య పరిణామక్రమంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు.

అదేవిధంగా, ఏకకాల ఎన్నికలు రాజకీయ పార్టీల ఖర్చును తగ్గించవచ్చు, కానీ పూర్తిగా తగ్గించలేవు. ఎందుకంటే, చట్టవిరుద్ధ డబ్బు పంపిణీకి కారణమయ్యే పరిస్థితులు వీటివల్ల ఏ విధంగానూ మారవు.

లోక్‌సభ/ రాష్ట్ర అసెంబ్లీను ముందస్తుగా రద్దు చేయటం ఏకకాల ఎన్నికల వ్యవస్థలో మరో ప్రధాన సమస్య. అటువంటి సందర్భాల్లో ఏకకాల ఎన్నికలను కొనసాగించటానికి, కమిటీ "మధ్యంతర" ఎన్నికలను ప్రతిపాదిస్తోంది. ఉప ఎన్నికల మాదిరిగానే, కొత్తగా ఎన్నికైన ప్రభుత్వ పదవీకాలం నిర్ణీత గడువుతో ముగుస్తుంది. ఇటువంటి వ్యవస్థ గడువులోగా సభల రద్దును నిరుత్సాహపరుస్తుందని, మరింత స్థిరమైన పాలనను అందిస్తుందని కూడా కమిటీ వాదించింది. అయితే, ప్రతిపాదనలో కొన్ని లోపాలున్నాయి. ప్రజల పూర్తి మద్దతుతో ఎన్నుకోబడిన ప్రభుత్వానికి నిర్ణీత వ్యవధితో సంబంధం లేకుండా గడువు తీరని కాలానికి మాత్రమే పరిమితం చేయటం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం. ఆచరణలో, కొత్త ప్రభుత్వానికి మంచి ఫలితాలను అందించటానికి అవసరమైన సమయం ఉండకపోవచ్చు. ఈ పర్యవసానాల వల్ల ముందస్తు రద్దుకు వెనుకంజ వేసినప్పటికీ, అంతర్గత ఐక్యత లేకపోవటం కొన సాగుతున్న ప్రభుత్వం అసమర్థంగా, ఇంకా బలహీనంగా మారవచ్చు. ఏకకాల ఎన్నికల వల్ల అంచనా వేయగల పరిణామాలలో ఇవి కొన్ని మాత్రమే.

ఊహించలేని పరిణామాలు బహుశా ఇంకా ఎక్కువ ఉండవచ్చు. ఓటరు ప్రవర్తన, రాజకీయ పార్టీ అభ్యర్థుల ఎంపిక, పనితీరు, రాజకీయాల్లో ధనబలం, ప్రాంతీయ పార్టీలపై ప్రభావం, శాసనసభల పనితీరు, వివిధ స్థాయిల్లోని సమస్యలపై మీడియా దృష్టి పెట్టటం, ఇంకా మరెన్నో అంశాలపై ఈ వ్యవస్థ ప్రభావం ఎలా ఉండబోతోందో మనం ఈవేళ కచ్చితంగా తేల్చలేం. ఈ ప్రక్రియ ఒక సామాజిక, ప్రజాస్వామ్య ప్రయోగం. శాస్త్రీయ ఫలితాల్లా ఫలితాలు సూటిగా, కచ్చితంగా ఉంటాయని చెప్పలేం. ❖

## సోషల్ మీడియాపై.. ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తత అవసరం

(32వ పేజీ తరువాయి)

విస్మరించలేం, కాబట్టి ఈ సమస్యను పరిష్కరించుకోవటం అవసరం. ఆ మార్పు ఒక్కరి చేతుల్లో లేదు. ప్రభుత్వం, ప్రజలు, రాజకీయ పార్టీలు, సోషల్ మీడియా సంస్థలు తమ బాధ్యతల్ని సవ్యంగా నెరవేర్చాలి. ప్రభుత్వం, సోషల్ మీడియా సంస్థలు కొన్ని స్థూల అంశాల మీద అవగాహన, ఏకాభిప్రాయానికి రావాలి. ఉదాహరణకి రాజ్యాంగాన్ని కించపరిచే, హింసని ప్రేరేపించే మాటల్ని వాడినా, ఆరోగ్యం విషయంలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసినా, శాస్త్రీయంగా నిర్ధారించిన వాస్తవాన్ని వక్రీకరించినా, ప్రభుత్వం, సామాజిక మాధ్యమాల సంస్థలు కఠినమైన చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వం, సోషల్ మీడియా సంస్థలు మాత్రమే కాదు, ప్రజలు కూడా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అయినా, సోషల్ మీడియా ద్వారా అయినా వచ్చిన ప్రతి వార్త నిజం అని నమ్మకుండా, పోస్ట్, ఫార్వర్డ్ చేయకుండా స్వీయనియంత్రణ పాటించాలి. పౌరుల్లో ప్రతి ఒక్కరూ జర్నలిస్ట్ అయ్యే అవకాశం ఉన్నప్పుడు, చాలా సమాచారం వెలువడుతున్నప్పుడు, అందులో నిజమెంతో, అబద్ధమెంతో తెలీనప్పుడు తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతుంది (నిజం గడప దాటే లోపు అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వస్తుంది).

అలాంటి పరిస్థితిలో ప్రజలు ఎవరిని నమ్మాలి, అనుసరించాలి? ఎవరైతే హేతుబద్ధంగా, తర్కం, సాక్ష్యాల ఆధారంగా పరిష్కారం లక్ష్యంగా మాట్లాడతారో, ఆ తరహా విశ్వసనీయ చరిత్ర ఎవరికి ఉందో అలాంటి వారిని అనుసరించాలి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. సమస్య ఉందని మీడియాను విస్మరించటం పరిష్కారం కాదు. ఒక బలమైన ప్రజాస్వామ్య నిర్మాణంలో ప్రింట్ నుంచి సోషల్ మీడియా వరకు అన్ని రకాల మాధ్యమాలూ ముఖ్య పాత్ర పోషిస్తాయి.

మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం. ఆ మీడియాకి ప్రజాస్వామిక విస్తరణ సోషల్ మీడియా. ఇందులో సంభాషణలు, చర్చలు వినూత్న రీతిలో ఉంటాయి. ఇటువంటి సోషల్ మీడియాను పౌరులు, ప్రభుత్వం, సంబంధిత సంస్థలు విస్తృత ప్రజాప్రయోజనం కోసం ఉపయోగించటం ప్రజాస్వామ్యం మరింత వేళ్లూనుకోవటానికి దోహదం చేస్తుంది. ❖










# సవాళ్లకు భయపడొద్దు

యువత సవాళ్లకు వెన్నుచూపకుండా ఎదుర్కొని అధిగమించాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 'సవాళ్లను ఎదుర్కోవటం యువతకు ఎందుకు అవసరం' అంశంపై హైదరాబాద్ రాయదుర్గం టీ హబ్‌లో Knowvation Learnings సంస్థ ఆధ్వర్యంలో టెక్నోథాన్ 1.0 పేరుతో సాంకేతిక సదస్సు నిర్వహించారు. 60కి పైగా కళాశాలల నుంచి 250 మందికిపైగా విద్యార్థులు, 70 మంది యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో జేపీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. Knowvation వ్యవస్థాపకురాలు, సీఈవో స్వాతి రుషీత సంధానకర్తగా వ్యవహరించారు. వివిధ అంశాలపై దివ్యాంగుడు, ప్రణవ్ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకుడు చంద్రకాంత్ సాగర్, ఎస్ఎన్ఐఎస్‌టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రుతి భార్గవ, యువ పారిశ్రామికవేత్తలు వికాస్ కాట్రగడ్డ, మెరాజ్, శశాంక్ గాంద్రప్పు, శీతల్ శ్రీకాంత్, నిఖిల్ అమిగొ, జిగ్నేష్ తలసిల తదితరులు ప్రసంగించారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th April, 2024 Posting Date 15 &16th of every month

# క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
# జనబలం చందాదారులుగా చేరండి

SBI

**Merchant Name : FOUNDATION FOR DEMOCRATIC**

**UPI ID : 52086568057@sbi**

BHIM UPI

G20 भारत 2023 INDIA

वसुधैव कुटुम्बकम्

ONE EARTH • ONE FAMILY • ONE FUTURE

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**